RNI.No.TELTEL/2000/00272

Estd.: 2000

www.voodayam.com /voodayam /Voodayam

ASHISH MEDIA SERVICES (AMS)
You can download news from our 'AMS News Agency'
Logon to our website and registar.
News from the Unreached
AMS NEWS
www.ashishmediaservices.blogspot.com
Contant No. : 7075458621

# వుదయం

Simultaneously published from Hyderabad, Adilabad, Khammam, Karimnagar, Guntur & Warangal

రిపోర్టర్లు కావలెను...
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వుదయం తెలుగు దిన పత్రికకు రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తిగల, అనుభవజ్ఞులైన అభ్యర్థులు కావలెను.
- సిరికొండ అగస్టిన్
BA. L.L.B., M.C.J.
వుదయం ఎడిటర్
సెల్: 9247698676

సంపుటి : 25 || సంచిక :248 || హైదరాబాద్ || శుక్రవారం,నవంబర్ 08, 2024 || VOODAYAM Telugu Daily || వెల : రూ. 3.00 || పేజీలు : 12

## కేటీఆర్ చుట్టూ బిగుసుకుంటున్న
# ఫార్ములా ఈ రేసు స్కాం

- ఫార్ములా ఈ-కార్ రేసింగ్ వ్యవహారంలో భారీ స్కామ్ జరిగిందని అనుమానిస్తున్న కేసులో ఏసీబీ దూకుడుగా దర్యాప్తు
- విచారణలో వేగం పుంజుకున్న ఫార్ములా ఈ రేసు కేసు
- కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్ నమోదుకు గవర్నర్ అనుమతి కోసం రాష్ట్ర ప్రభుత్వం లేఖ
- రాష్ట్రంలో జరిగిన పలు స్కాములపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే.



హైదరాబాద్

ఫార్ములా-ఈ కారు రేస్ వ్యవహారంలో ఒప్పందం కుదరడానికి ముందే నిధులు చెల్లించడం, అందులోనూ నిబంధనలకు విరుద్ధంగా విదేశీ కరెన్సీ రూపంలో ఇవ్వడంపై విచారణ వేగవంతం అయినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై విచారణ జరపాలని ఏసీబీకి పురపాలక, పట్టణాభివృద్ధి సంస్థ గత వారమే లేఖ రాసింది. అయితే ఇక్కడే ఒక చిక్కుముడి వచ్చింది. బాధ్యులైన వారిపై కేసు నమోదు చేసి విచారణ జరపాలంటే వారి స్థాయి ప్రకారం ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో అప్పటి పురపాలక శాఖ మంత్రి, ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్ నమోదుకు గవర్నర్‌కు అనుమతి కోసం లేఖ రాసినట్లు సమాచారం. దీనిపై గవర్నర్ సైతం న్యాయ సలహా కోరినట్లు తెలుస్తోంది. ఫార్ములా ఈ-కార్ రేసింగ్ వ్యవహారంలో భారీ స్కామ్ జరిగిందని అనుమానిస్తున్న



## కేంద్రం కీలక నిర్ణయం

- పంట వ్యర్థాలు తగలబెట్టే రైతులకు రెట్టింపు జరిమానా
- రోజురోజుకూ తీవ్రమవుతోన్న వాయు కాలుష్యం
- పంట వ్యర్థాలను దహనం చేసే రైతులకు రెట్టింపు జరిమానా విధించేలా నిబంధనలు
- ఏక్యూఐ లెవల్స్ రాజధాని ప్రాంతంలో 400కుపైనే నమోదు

## ముందుకు సాగని
# రైతు కమిషన్

- రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం
- జీవో నెంబర్ 36తో దీన్ని ఏర్పాటు చేసి, కిసాన్ కాంగ్రెస్ నేత కోదండ రెడ్డిని చైర్మన్‌గా నియమించింది.
- విద్యా కమిషన్‌కు వసతులు ఆగమేఘాలపై ఏర్పాటు కాగా,
- రైతు కమిషన్‌పై మాత్రం అశ్రద్ధ వహిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది.




హైదరాబాద్

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతుల సంక్షేమం కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. జీవో నెంబర్ 36తో దీన్ని ఏర్పాటు చేసి, కిసాన్ కాంగ్రెస్ నేత కోదండ రెడ్డిని చైర్మన్‌గా నియమించింది. భూ చట్టాల నిపుణుడు సునీల్‌తో సహా మరో ఆరుగురు సభ్యులుగా ఈ కమిషన్ ముందుకెళ్తోంది. మొదటి సమావేశం బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో జరిగింది. అయితే, కమిషన్‌కు సంబంధించి అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. విద్యా కమిషన్‌కు వసతులు ఆగమేఘాలపై ఏర్పాటు కాగా, రైతు కమిషన్‌పై

# ఎట్టిపరిస్థితుల్లో అలా చేయకూడదు

- ప్రభుత్వ ఉద్యోగాలపై సుప్రీంకోర్టు కీలక తీర్పు!
- రిక్రూట్‌మెంట్ మధ్యలో రూల్స్ మార్చకూడదన్న న్యాయస్థానం
- ఈ మేరకు సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు అనుగుణంగా నిబంధనలు ఉండాలని సూచన



## నాణ్యమైన విద్య అందించడమే
# ప్రభుత్వ లక్ష్యం

- థాంక్యూ సీఎం సార్..గురుకుల విద్యార్థులతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ..
- డైట్ ఛార్జీలు పెంచినందుకు విద్యార్థులు సీఎంకు కృతజ్ఞతలు
- గురుకులాల్లో పరిస్థితులను సీఎం విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.
- అందరికి విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది
- చదువుతో పాటు స్కిల్స్ ఉంటేనే ఉద్యోగాలు

హైదరాబాద్

సచివాలయంలో ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గానికి చెందిన విద్యార్థులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం విద్యార్థులతో మాట్లాడుతూ. అందరికి విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం. చదువుతో పాటు స్కిల్స్ ఉంటేనే ఉద్యోగాలు లభిస్తాయి. అని విద్యార్థులకు సీఎం సూచించారు. డైట్ ఛార్జీలు పెంచినందుకు విద్యార్థులు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. గురుకులాల్లో పరిస్థితులను సీఎం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం పేర్కొన్నారు.





# వాటిపై ఫోకస్ పెట్టిన హైడ్రా

- ప్రత్యేక టీమ్‌తో బెంగళూరుకు కమిషనర్ రంగనాథ్
- బెంగళూరులో హైడ్రా బృందం పర్యటన
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ నేతృత్వంలో అక్కడి చెరువులపై అధ్యయనం
- ఎలక్ట్రానిక్ సిటీ సమీపంలో చెరువుల సందర్శన
- నివాసాల మధ్య చెరువుల ఎఫ్‌టీఎల్ నిర్ధారణ

హైదరాబాద్

చెరువుల పునరుద్ధరణ, విపత్తుల నిర్వహణపై అధ్యయనానికి హైడ్రా అధికారుల బృందం బెంగళూరు బాట పట్టింది. బుధవారం హైడ్రా అధికారులు బెంగళూరు వెళ్లగా, ఇవాళ కమిషనర్ రంగనాథ్ అక్కడికి చేరుకున్నారు. రెండు రోజుల పాటు బెంగళూరులోనే పర్యటించి అక్కడి చెరువుల పునరుద్ధరణపై సీనియర్ శాస్త్రవేత్తలు, పర్యావరణ ప్రముఖులతో సమావేశం కానున్నారు. యెల్లంకలో

## 'ఒకే ఒక్కడు ఎనుముల రేవంత్ రెడ్డి'
# పుస్తకాన్ని ఆవిష్కరించిన టీపీసీసీ చీఫ్

- రేవంత్ రెడ్డి విలక్షణమైన నాయకుడన్న మహేశ్ కుమార్ గౌడ్
- రాజకీయాల్లో డైనమిక్ లీడర్‌గా ఎదిగిన వ్యక్తి అని ప్రశంస
- రేవంత్ సుదీర్ఘ కాలం రాజకీయాల్లో ఉండాలని ఆకాంక్ష



హైదరాబాద్

హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో 'ఒకే ఒక్కడు ఎనుముల రేవంత్ రెడ్డి' పుస్తకాన్ని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని ప్రముఖ రచయిత వేణుగోపాల్ రెడ్డి రాశారు. ఆవిష్కరణ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ... రేవంత్ రెడ్డి విలక్షణమైన నాయకుడు అన్నారు. చిన్న వయస్సులోనే రాజకీయాల్లో డైనమిక్ లీడర్‌గా ఎదిగిన వ్యక్తి అని కొనియాడారు. ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కి నిర్బంధ పాలన చేస్తున్న కేసీఆర్‌పై .

# ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడిన మోదీ

- భారత్, అమెరికా మధ్య ఉన్న వాణిజ్య బంధాన్ని గుర్తు చేసిన మోదీ
- 2019 సెప్టెంబర్‌లో హూస్టన్‌లో జరిగిన హౌడీ మోడీ ఈవెంట్‌ను కూడా ప్రధాని మోదీ గుర్తు చేశారు



# కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాలు దివాలా తీశాయి

- కాంగ్రెస్ పాలనపై 11 నెలల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకత వస్తోందని వ్యాఖ్య
- బీజేపీకి సంస్థాగత ఎన్నికల వ్యవస్థనే ఊపిరి అన్న కిషన్ రెడ్డి
- ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని పిలుపు



# సంపాదకీయం

## శ్వేతసౌధంలోకి ట్రంప్ పునరాగమనం

కమలా హారిస్ ఓటమితో అమెరికా రాజకీయాల్లో మహిళల స్థానం ప్రశ్నార్థకంగా మారింది. హిల్లరీ క్లింటన్‌ను నిరాదరించిన తరహాలోనే కమలా హారిస్‌ను కూడా అమెరికా పౌరులు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. శ్వేతసౌధంలోకి మరోమారు డోనాల్డ్ ట్రంప్ అడుగుపెట్టబోతున్నారు. అమెరికా 47వ అధ్యక్షుడిగా ట్రంప్ వచ్చే సంవత్సరం జనవరి నెలలో పదవీ స్వీకార ప్రమాణం చేయబోతున్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలంటే కేవలం ఆ దేశ ప్రజలకే కాదు ప్రపంచానికే ఎన్నికలనే అభిప్రాయం ప్రబలిపోయింది. సోవియట్ రష్యా పతనం తర్వాత ప్రచ్ఛన్న యుద్ధం సమసిపోయింది. ద్విధ్రువ ప్రపంచం అదృశ్యమై, అమెరికా సారథ్యంలో ప్రపంచాన్ని ఒంటిచేత్తో నడిపే ఏకధ్రువ ప్రపంచం ఆవిర్భవించింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత రవి అస్తమించని బ్రిటీషు సామ్రాజ్యం అంతరించింది. అమెరికా, సోవియట్ రష్యాలు ప్రపంచాన్ని శాసించే శక్తులుగా ఎదిగాయి. ఇరుదేశాల యుద్ధోన్మాద చర్యలకు ప్రపంచం భీతిల్లిపోయింది. ఇరుదేశాల మధ్య అర్ధ శతాబ్దం కొనసాగిన ప్రచ్ఛన్న యుద్ధం 'సోవియట్ యూనియన్' విచ్ఛిన్నంతో అంతమైపోయింది. ఉత్థాన పతనాలు ప్రపంచ రాజకీయ చరిత్రలో కొత్తేమీ కాదు. వింతేమీ లేదు. ఎగిరిపడే కెరటాలు సైతం వెనుదిరగక తప్పదు. సునామీ సైతం సద్దుమణగక తప్పదు. అదే తరహాలో బలవంతులమని విర్రవీగే దేశాలెన్నో బలహీన దేశాల చెంత పాదాక్రాంతమైన సంఘటనలెన్నో జరిగాయి. ఇలాంటి పరిణామాల వలన ఎన్నో సంపన్న దేశాలు పేద దేశాలుగా, పేద దేశాలు ధనిక దేశాలుగా ఆవిర్భవించాయి. అమెరికా కూడా ఎన్నో రాజకీయ, సామాజిక పరిణామాల అనంతరం అగ్రరాజ్యంగా అవతరించింది. సోవియట్ పతనం తర్వాత కూడా అమెరికా తన అగ్రరాజ్య హోదాను కాపాడుకోవడానికి ఎన్నో తంటాలు పడుతున్నది. బెదిరే దేశాలను తన పాదాక్రాంతం చేసుకుని, బెదరని దేశాలను భయపెట్టి ప్రపంచానికి పెద్దన్నగా చెలామణి అవుతున్నది. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశాల్లో ఒకటైన అమెరికాలో జరిగిన ఎన్నికలు ఎంతో ఉత్కంఠతను కలిగించాలి. ప్రపంచమంతా ఎన్నికల ఫలితాల కోసం ఆసక్తికరంగా, ఉత్కంఠభరితంగా ఎదురుచూసింది. ప్రపంచాన్ని తన కనుసన్నలతో శాసించే పెద్దన్న తీసుకునే నిర్ణయాలపై ప్రపంచ భవితవ్యం ఆధారపడి ఉండడమే దీనికి కారణం. ఇప్పటి వరకు ఎన్నో పర్యాయాలు అమెరికాలో అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగాయి. ఎంతో మంది ప్రముఖులు అమెరికా అధ్యక్ష పీఠాన్ని అలంకరించి, అగ్రరాజ్యహోదాను నిలబెట్టారు. గతంలో నాలుగు సంవత్సరాలు అమెరికాను పాలించిన డోనాల్డ్ ట్రంప్ వలన అమెరికా ప్రతిష్ఠ మసకబారింది. అగ్రరాజ్యమనే గౌరవ భావన అడుగంటింది. ట్రంప్ చేష్టలతో ప్రపంచం బిత్తరబోయింది. మెక్సికో గోడ పేరుతో ట్రంప్ చేసిన హడావిడి అంతాఇంతా కాదు. 'నా దేశం- నా ప్రజలు' అనే భావన ప్రతీ దేశానికి, ప్రతీ పౌరుడికి, ప్రతీ ప్రభుత్వాధినేతకు ఉండడం సహజం. ఇది కాదనలేని సత్యం. ఇతర దేశాల విషయం ప్రక్కనబెడితే, పెద్దన్నగా ప్రపంచాన్ని శాసించాలని నిరంతరం వ్యూహాలు పన్నే అమెరికా విషయంలో 'తన దేశం- తన ప్రజలు' అనే సంకుచితమైన అభిప్రాయం అంకురించడం అగ్రరాజ్యాధిపత్యానికి తిలోదకాలివ్వడమే. తన పరిపాలనలో ఇదే విధానం కొనసాగించి, అమెరికా ప్రజల్లో శ్వేత జాతీయులు, నల్లజాతీయులనే భేదభావం ప్రదర్శించి జాత్యహంకార బీజాలు నాటిన ట్రంప్ వల్ల అమెరికన్లలో వ్యతిరేక ధోరణి ప్రబలింది. పార్టీలపరంగా, జాతులపరంగా దేశాన్ని రెండుగా చీల్చడానికి ట్రంప్ చేసిన ప్రయత్నాల వలన డెమొక్రాట్లు అధికారంలోకి రావడం జరిగింది. గత ఎన్నికల్లో అధ్యక్ష పీఠానికి దూరమైన ట్రంప్ మళ్లీ శ్వేతసౌధంలో విహరించబోతున్నారు. ట్రంప్ వలసవాదుల పట్ల, విదేశీయులకు వీసాల మంజూరులో గతంలో వ్యవహరించిన తీరుపట్ల అనేక మంది ప్రతిభావంతులు అమెరికా చదువులకు, ఉద్యోగాలకు దూరమైనారు. ఇదే వైఖరి ఇప్పుడు కూడా కొనసాగిస్తారా? లేక గత వైఖరికి భిన్నంగా వ్యవహరించి, మారిన మనిషిగా వలసవాదుల మనోభిప్రాయాలను మన్నించి, వారి గౌరవాభిమానాలకు పాత్రుడవుతారా? అనే విషయం త్వరలోనో స్పష్టమవుతుంది. ప్రపంచ దేశాలన్నీ ఇతర దేశాలతో ఆర్థిక, వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్న నేపథ్యంలో ఏ ఒక్క దేశం గిరిగీసుకుని మనుగడ సాగించలేదు. ఒక దేశానికి, మరో దేశానికి వైద్య, సాంకేతిక, ఉద్యోగపరమైన అవసరాల దృష్ట్యా, ఇచ్చిపుచ్చుకునే ధోరణి అవసరం. ప్రస్తుత ఆర్థిక అవసరాల రీత్యా ప్రపంచీకరణ వలన ఏ దేశమైనా ఇతర దేశాలతో సఖ్యతగా మెలగాలి. గిరిగీసుకుని ఒంటరిగా బ్రతికే రోజులు పోయాయి.

మరోమారు అమెరికా అధ్యక్షునిగా జనవరి 20వ తేదీన ప్రమాణ స్వీకారం చేయనున్న ట్రంప్ ముందు అనేక సవాళ్ళులున్నాయి. ఎన్నో బాధ్యతలు, బరువులు ట్రంప్ కోసం ఎదురు చూపులు చూస్తున్నాయి. గతంలో ట్రంప్ అనుసరించిన విధానాలపై సమీక్ష జరగాలి. వలసదారులకు అన్ని దారులు మూసి వేయడానికి, అమెరికా జాతీయులకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపరచడానికి గతంలో ట్రంప్ ప్రభుత్వం వీసాల జారీలో తెంపరితనం ప్రదర్శించింది. హెచ్ 1బి వీసాల విషయంలో ట్రంప్ నిర్ణయాలు అమెరికాలో విద్య, ఉద్యోగావకాశాల కోసం పోటీపడిన అనేక మంది విదేశీ ప్రతిభావంతులకు నిరుత్సాహం కలిగించాయి. వీసాల విషయంలో కూడా నిబంధనలు విధించడం వలన అమెరికావాసులకు ఎలాంటి ప్రయోజనం సిద్ధించలేదు. వీసాల మంజూరు విషయంలో అమెరికా వైఖరి వలన భారత్ టెకీలు నష్టపోయిన మాట వాస్తవం. అయితే ట్రంప్ గత పాలనకు విరుద్ధంగా పరిపాలన సాగిస్తారా? లేదా అదే విధానం కొనసాగిస్తారా? అనే సందిగ్ధం కొనసాగుతున్నది. అమెరికా అభివృద్ధిలో విదేశీ ప్రతిభ ప్రధాన భూమిక పోషిస్తున్న నేపథ్యంలో విదేశీయులను కాదని అమెరికా అభివృద్ధి సాధించలేదు. గత ట్రంప్ పాలన భారతీయుల ప్రతిభకు అణగదొక్కింది. అభివృద్ధికి శరాఘాతంలా మారింది. చైనాపై అక్కసుతో భారత్‌పట్ల ట్రంప్ సానుకూల వైఖరి ప్రదర్శించే అవకాశముంది. చైనాపై అమెరికా తన 'ట్రేడ్ వార్' లో భాగంగా భారత్‌కు అనుకూలంగానే ప్రవర్తించడం భారత్ పై కయ్యానికి సై అంటూ కాలు దూసే చైనా దూకుడుకు ఒక రకంగా కళ్ళెం వేయగలదు. ట్రంప్ పునరాగమనంతో భారత్‌కు మేలు జరుగుతుందా? భారత దేశానికి ఇబ్బంది కలుగని రీతిలో చైనాతో సంబంధాలను ఏర్పాటు చేసుకోవడం వలన భారత దేశానికి నష్టమేమీలేకపోవచ్చు. అయినా చైనాతో ట్రంప్ సఖ్యంగా మెలిగే అవకాశాలు లేవనే చెప్పాలి. ట్రంప్ తెంపరితనం ప్రపంచానికి కొత్త సమస్యలు తలెత్తవచ్చు. చైనాతో ట్రంప్‌కున్న విభేదాల కారణంగా భారత్‌కు మేలు జరిగే అవకాశాలున్నాయి. తనకు పక్కలో బల్లెంలా తయారవుతున్న చైనాను నిలువరించకపోతే అమెరికా అస్తిత్వానికే ముప్పు. ఈ విషయం అమెరికా పాలకులకు తెలియనిది కాదు. ఎవరు శ్వేతసౌధంలోకి అడుగుపెట్టినా తమ దేశ ప్రయోజనాలను పణంగా పెట్టి ఇతర దేశాల ఎదుగుదలకు సహకరిస్తారనుకోవడం కేవలం భ్రమ మాత్రమే కాగలదు. పెద్దన్న పాత్రను వదులుకోవడానికి అమెరికా ససేమిరా ఒప్పుకోదు. ఇతర దేశాల అభివృద్ధిని తట్టుకోలేదు. రిపబ్లికన్ల పాలనలోను, డెమొక్రాట్ల పాలనలోను ఇప్పటి వరకు జరిగిన తంతు ఇదే. అమెరికా రథసారథ్యం వహించిన మహామహులంతా ఇదే విషయాన్ని నిరూపించారు. భారత ఉపఖండంలో శాంతి సుస్థిరతలను కాపాడడంలో అమెరికా విదేశాంగ విధానం కీలక భూమిక పోషిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. రష్యా- ఉక్రెయిన్ల మధ్య యుద్ధాన్ని ట్రంప్ అపగలరా? ఇరాన్- ఇజ్రాయిల్ మధ్య సంఘర్షణను నిలువరించగలరా? ట్రంప్ పాలనపై పలు ప్రపంచ దేశాల భవిష్యత్తు ఆధారపడి ఉన్న దృష్ట్యా ట్రంప్ హుందాగా పాలిస్తూ ప్రస్తుతం ప్రపంచంలో నెలకొన్న యుద్ధ వాతావరణాన్ని సమసిపోయేలా చేయాలని ఆశిద్దాం.

# ఎక్స్-కిరణాల ఆవిష్కరణతో వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు



డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. వ్యాధి నిర్ధారణ, ఇమేజింగ్ టెక్నాలజీలు, శస్త్ర చికిత్సలు, ఔషధ రంగాల్లో పెనుమార్పులకు నాంది పలుకుతున్నాం. నేడు ఎక్స్-రే, ఎంఆర్ఐ లాంటి ముఖ్యమైన రేడియేషన్ ఆధారిత టెక్నాలజీలను రోగ నిర్ధారణలో వాడడంతో చికిత్సలకు మార్గం సుగమం అవుతున్నది. అత్యాధునిక వైద్యరంగంలో రేడియోగ్రాఫర్లు, రేడియోలాజిక్ టెక్నాలజిస్టుల పాత్రను కొనియాడడానికి ప్రతి ఏట 08 నవంబర్‌న విశ్వమానవాళి "ప్రపంచ రేడియోగ్రాఫర్స్ దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. వరల్డ్ రేడియోగ్రఫీ డే-2024 నినాదంగా "రేడియోగ్రాఫర్స్ : కనిపించని దానిని చూడగలగడం (రేడియోగ్రాఫర్స్ : సీయింగ్ ది అన్‌సీన్)" అనబడే థీమ్‌ను తీసుకొని ప్రచారం చేస్తున్నారు. ప్రపంచ రేడియోగ్రఫీ దినం సందర్భంగా చరేడియోలాజిక్ టెక్నాలజీ, చమెడికల్‌ఇమేజింగ్ లాంటి హాష్ ట్యాగ్‌లు వాడుతూ సామాజిక మాధ్యమాల్లో కూడా ప్రచారం చేయడం పరిపాటి అవుతున్నది.

ఎక్స్- కిరణాల ఆవిష్కర్త డబ్ల్యూ. సి. రాంటిజెన్:

1895, 08 నవంబర్‌న విల్‌హెమ్ కాన్రడ్ రాంటిజెన్ కృషి ఫలితంగా ఎక్స్-కిరణాల ఆవిష్కరణ జరగడం, వైద్య రంగంలో రోగ నిర్ధారణ సులభం కావడం అనే సందర్భాన్ని ఆసరాగా తీసుకొని 2004 నుంచి ప్రతి ఏట వరల్డ్ రేడియోగ్రఫీ డే పాటిస్తున్నాం. శస్త్ర చికిత్స చేయకుండానే రేడియేషన్ టెక్నాలజీని ఉపయోగించి రోగి శరీరం లోపల జరుగుతున్న మార్పులను, అవయవాల స్థితులను చూడగలగడంతో వ్యాధి వివరాలను తెలుసుకోవడం తేలికైంది. ఎక్స్-కిరణాలతో ప్రారంభమైన రేడియోషన్ ఆధారిత ఇమేజింగ్ టెక్నాలజీ ద్వారా సిటి-స్కాన్, ఎంఆర్ఐ, అల్ట్రాసౌండ్ లాంటి రేడియోషన్ టెక్నిక్స్ అందుబాటులోకి రావడంతో వైద్యరంగం కొత్త పుంతలు తొక్కుతున్నది. క్యాన్సర్ ట్యూమర్స్, ఎముకలు విరగడం, న్యుమోనియా, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లను సులభంగా గుర్తించడం, తగు వైద్యాలను అందించడం నేటి విధానం అయ్యింది.

రేడియోగ్రఫర్లకు కృతజ్ఞతలు తెలిపే సందర్భం:

ఆధునిక వైద్య రంగంలో రేడియోషన్ టెక్నాలజీ ప్రాధాన్యం పెరగడంతో సాధారణ రేడియోగ్రఫీ డిప్లమా కోర్సులతో పాటుగా వైద్య కళాశాలలు రేడియోలజీలో పిజి కోర్సులను సహితం ప్రారంభించడం చూసేతున్నాం. శరీరాన్ని తాకకుండా, దేహం లోపల అవయవాల పని తీరును, వాటిలో వచ్చిన మార్పులను తెలుసుకోవడానికి శరీర భాగాలకు రేడియోషన్‌ను పంపించి ఫలితాలను విశ్లేషిస్తున్నారు. నేటి డిజిటల్-ఏఐ యుగంలో వైద్యరంగం ఎంతో ప్రగతిని సాధించడం, చికిత్సలు సులభం కావడం, ప్రజారోగ్య పరిరక్షణ తేలిక కావడం లాంటివి సుసాధ్యం కావడానికి రేడియోగ్రాఫర్లు నిరంతరం కృషి చేస్తున్నారని గమనించి వారి కృషిని మెచ్చుకోవడం, వారిని ప్రోత్సహించడం లాంటివి ప్రపంచ రేడియోగ్రఫీ దినం రోజున నిర్వహిస్తున్నారు. చూడలేని వాటిని చూడగలగడం, ముట్టుకోకుండానే వ్యాధి మర్మాన్ని తెలుసుకోవడం, క్షణాల్లో వ్యాధి నిర్ధారణ చేయగలగడం, వైద్యులు సరైన ఔషధాలను సూచించగలగడం లాంటివి రేడియోగ్రాఫర్ల కృషితోనే సాధ్యం అవుతున్నాయని గమనిస్తూ 08 నవంబర్‌న మన సమీప డయగ్నాస్టిక్ సెంటర్స్‌లో సేవలందిస్తున్న రేడియోగ్రాఫర్లను గుర్తించి వారిని సన్మానాలతో ప్రోత్సహిస్తూ, కృతజ్ఞతలు సహితం కెలియజేద్దాం, అనారోగ్యాలను తొలి దశలోనే నిర్ధారించుకొని తరిమేద్దాం.

# విజయ గజమెక్కి శ్వేతసౌధంలోకి...

అమెరికా ఎన్నికల ఫలితాల్లో ఉత్కంఠ వీడింది. అమెరికా ప్రజలు ఎలాంటి కన్ఫ్యూజన్ లేకుండా స్పష్టమైన తీర్పు చెప్పారు. 538 ఎలక్టోరల్ ఓట్లు కలిగిన అమెరికాలో అధ్యక్షుడి పీఠం అధిరోహించాలంటే 270 ఓట్లు సాధించాలి. రిపబ్లికన్ పార్టీ మెజార్టీ మార్క్ దాటింది. దీంతో అమెరికా 47వ అధ్యక్షుడిగా ట్రంప్ ఎన్నిక లాంఛనమే కానుంది. కొంత విరామంతో ఒక అభ్యర్థి అమెరికా అధ్యక్ష స్థానంపై తిరిగి కూర్చోవడం 131 ఏళ్ల తర్వాత ఇదే. అంతేకాదు.. 2016 నాటి ఫలితాలకు భిన్నంగా ఈసారి పాపులర్ ఓటు కూడా ట్రంప్‌నకే లభించింది. ఆయనకు దాదాపు 51 శాతానికి పైగా ఓట్లు లభించగా.. హారిస్ 47 శాతం వద్దే ఆగిపోయారు. 'ఆమె'కు దూరంగా అమెరికా ఎన్నో దేశాలు మహిళలను ఉన్నత స్థానంపై కూర్చోబెడుతుంటే... ప్రపంచంలో అత్యంత పురాతన ప్రజాస్వామ్యంగా ప్రచారం చేసుకునే అమెరికా మాత్రం ఇప్పటిదాకా ఆ అవకాశం ఇవ్వలేదు. ఈ అధ్యక్ష ఎన్నికలలో డొనాల్డ్ ట్రంప్ విజయం అమెరికా అధ్యక్ష ఎన్నికల చరిత్రలో అత్యంత ఆశ్చర్యకరమైన సంఘటనలలో ఒకటి. డొనాల్డ్ ట్రంప్ ఎలక్టోరల్ కాలేజీ ఓటును గెలుచుకున్నారు. అనేక కీలక రాష్ట్రాల్లో సాంప్రదాయ రిపబ్లికన్ ఓటర్లను సమీకరించడంలో అతను విజయం సాధిం చాడు. రక్షణవాద, వలస వ్యతిరేక వైఖరి ద్వారా కార్మిక మధ్యతరగతి ఓటర్లను, ఆకర్షించడంలో కూడా విజయం సాధించాడు. అధ్యక్షునికి ఇది అద్భుతమైన పునరాగమనం. 78 ఏళ్ల వయసులో ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అతి పెద్ద వ్యక్తి. అమెరికా అధ్యక్ష ఎన్నిక ప్రతి దశలోనూ తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అధ్యక్ష అభ్యర్థిపై హత్యాయత్నం జరగ్గా..మరోసారి ప్రచారం మధ్యలో ఏకంగా ప్రధాన పార్టీ అభ్యర్థినే మార్చేసింది. ప్రచారం ఆసాంతం నువ్వా నేనా అన్నట్లు సాగింది. 2024 అధ్యక్ష ఎన్నికల ఫలితం ఎక్కువగా స్వింగ్ రాష్ట్రాలపైనే ఆధారపడింది. కీలకమైన స్వింగ్ రాష్ట్రాలు అనూహ్యంగా ఈ సారి ట్రంప్‌కి మద్దతు తెలిపాయి. ఎన్నికల్లో విజయం సాధించి, అధ్యక్ష పదవిని తిరిగి పొందిన ట్రంప్ అంతర్జాతీయ రాజకీయాలపై ప్రభావం చూపగలరు. అమెరికా విదేశాంగ విధానంలో పెను మార్పులు చేయటానికి అవకాశం ఉంది. అమెరికా అధ్యక్షుడిగా తన మొదటి పదవీకాలం నుండి, డొనాల్డ్ ట్రంప్ అక్రమ వలసలను గట్టిగా వ్యతిరేకిస్తూ "మేక్ ఇన్ అమెరికా" విధానాలను సమర్థించేవారు. ఈ ఎన్నికల్లో విదేశీయులు అమెరికన్ల నుండి ఉద్యోగాలు తీసుకుంటున్నారనే అంశాన్ని ప్రచార అస్త్రంగా వినియోగించడం వల్ల యువతపై అది ప్రభావం చూపింది. యువ ఓటర్లు ట్రంప్‌కు మద్దతు పలికారు.

పెరుగుతున్న ద్రవ్యోల్బణంకి తోడుగా రష్యాకు వ్యతిరేకంగా ఉక్రెయిన్ సుదీర్ఘ పోరాటానికి అమెరికా, దాని పాశ్చాత్య మిత్రదేశాలు నిధులు అందించడం కొనసాగిస్తున్నందున విమర్శలు పెరిగాయి. ఇంతలో, ఇజ్రాయెల్ గాజాలో కాల్పుల విరమణ కోసం అమెరికా పిలుపులను ధిక్కరించింది, లెబనాన్, ఇరాన్‌తో సహా మధ్య ప్రాచ్యం అంతటా తన సైనిక చర్యలను పెంచింది. ఈ చర్యలను అమెరికన్ ఓటర్లు ఆమోదించలేదు.

అందుకే ట్రంప్‌కు పట్టం కట్టారు. డొనాల్డ్ ట్రంప్ విజయపథంలో దూసుకుపోవడానికి ఒక పెద్ద కారణం ఉందంటే అది స్వదేశంలో వ్యాపించిన బలమైన అధికారపక్ష వ్యతిరేక భావన. ఆర్థిక వ్యవస్థపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అమెరికా ఓటరుకు నచ్చినట్లుంది. ఎన్నికలకు ముం దు, దేశంలో ఆర్థిక పరిస్థితులు అధ్వా నంగా ఉన్నాయని 62 శాతం మంది ప్రజ లు విశ్వసించారు. అందుకే ఈసారి ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టగల వ్యక్తికి పట్టం కట్టాలని నిర్ణయించుకున్నట్లు, అందుకే ట్రంప్ వైపు మొగ్గు చూపినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ట్రంప్‌కు అనుకూలంగా మారిన మరో అంశం ఇమ్మిగ్రేషన్ లేదా అక్రమ వలసలు అమెరికన్ ప్రజలకు ఎలా ముప్పు కలిగిస్తాయి అనే అంశంపై ప్రచారం మొత్తంగా, వలసలపై తన కఠినమైన వైఖరిని నొక్కి చెప్పాడు. అదనంగా, ట్రంప్ అపరిమిత శైలి, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థపై వాగ్దానాలతో పాటు, బలమైన దృక్కోణాలు కలిగిన దృఢమైన వ్యక్తిగా ఉండటం, అమెరికాకు మొదటి స్థానం ఇవ్వడంపై, కొనసాగుతున్న యుద్ధాలను అంతం చేయడంపై ఆయన చేసిన వ్యాఖ్యలు అన్నీ కలిసి తన గెలుపునకు దోహదపడ్డాయి. దేశ గ్రామీణ ప్రాంతాల్లోనూ డొనాల్డ్ ట్రంప్ భారీ విజయం సాధించడంలో ఆశ్చర్యం లేదు. తన ఎన్నికల ప్రచార నినాదమైన 'విల్ మేక్ అమెరికా గ్రేట్ అగైన్' విజయ మంత్రమైంది. విజయ గజమెక్కి శ్వేతసౌధంలోకి ట్రంప్ మరో మారు అడుగు పెట్టడాన్ని స్వాగతించక తప్పదు. అగ్ర రాజ్య ఆధ్యక్షుడిగా విశ్వ రాజకీయ యవనికపై ట్రంప్ తిరిగి కీలక భూమిక పోషించాలి.

# తెలుగు ప్రజల హృదయేశ్వరి "మల్లీశ్వరి"

తెలుగు చలనచిత్ర చరిత్రలో స్వర్ణ యుగానికి చెందిన గొప్ప చిత్రంగా మల్లీశ్వరి ఖ్యాతి గాంచింది. ఆ సినిమా భారతదేశం లోనే కాక ఇతర దేశాలలో కూడా చాలా రోజుల పాటు ప్రదర్శింప బడింది. రాచరికపు ఆడంబరాలను, ఆచారాలను చిత్రించినా ఆ సినిమా కమ్యూనిస్టు దేశమైన చైనా లోనే వంద రోజులకు పైగా ఆడింది. ఆ సినిమాకు మాటలు, పాటలు, కళ, నటన, సంగీతం, ఛాయా గ్రహణం, ఎడిటింగులతో సహా అంతా తానై బి.ఎన్.రెడ్డి నడిపించినవే. అందుకే కృష్ణశాస్త్రి "మల్లీశ్వరి సృష్టిలో మేమంతా నిమిత్త మాత్రులం. బి.ఎన్.రెడ్డి దీనికి సర్వస్వం." అన్నారు. మల్లీశ్వరి బహుళ ప్రజాదరణ పొందిన చిత్రం. బొమ్మిరెడ్డి నరసింహారెడ్డి (బి.ఎన్.రెడ్డి) (నవంబర్ 16, 1908 – నవంబర్ 8, 1977) తెలుగు సినిమా దర్శకుడు, నిర్మాత. 1975లో దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు పొందిన తొలి దక్షిణ భారతీయుడు. పద్మ భూషణ్ పురస్కార గ్రహీత.శ్రీకృష్ణదేవ రాయలంటే ఆరాధనాభావమున్న, ఆంధ్రాంగ్ల సాహిత్యాలను విస్తృతంగా అధ్యయనం చేసిన బి.ఎన్.రెడ్డి రాయలవారి మీద ఒక సినిమా తీయాలని సంకల్పించారు. బి.ఎన్. తమ తొలి సినిమా 'వందేమాతరం' షూటింగు కోసం హంపి ప్రాంతానికి వెళ్ళినప్పటి నుండి అందుకు తగిన కథ కోసం వెదుకుతూనే ఉన్నారు. ఇల్లస్ట్రేటెడ్ వీక్లీలో వచ్చిన ఒక కథ, బుచ్చిబాబు వ్రాసిన "రాయల కరుణ కృత్యం" నాటిక కలిపి దేవులపల్లి కృష్ణశాస్త్రి చేత "మల్లీశ్వరి" స్క్రిప్టుగా అభివృద్ధి చేశారు. అయితే బుచ్చిబాబు పేరు కథా రచయితగా సినిమాలో స్థానం కల్పించ లేదు.వాహినీ వారి మల్లీశ్వరి. ఇది దేవులపల్లి వారి తొలి సినిమా. అయన పాటలు – మాటలు, ర'సాలూరు' రాజేశ్వర రావు కమ్మని బాణీలు, ఎన్.టి.ఆర్., భానుమతిల అద్భుత నటన, ఘంటసాల – భానుమతి గార్ల విలక్షణమైన గాన పటిమ అన్నీ కలబోసిన రాగేశ్వరి మల్లీశ్వరి. శ్రీ కృష్ణ దేవరాయలు పాలించే విజయ నగరానికి సమీపాన నివసించే పల్లెటూరి యువ ప్రేమికులు మల్లి, నాగరాజు. తెలియక వెటకారానికి, మారువేషంలో వున్న రాయలు, పెద్దనలతో రాణివాసం పల్లకి కోరి, తద్వారా ప్రేమికులు విడిపోయి, విరహ వేదన అనుభవిస్తారు. అలనాడు మహాకవి కాళిదాసు ప్రేమికుల సంకేతాలను 'మేఘ సందేశం' గా రచించగా, ఈ చిత్రంలో నాయికా నాయకుల నడుమ తొణికిసలాడే ప్రణయ స్పందనా తరంగాలను 'ఆకాశ వీధిలో హాయిగా' తేలియాడే మబ్బు తునకతో పంపారు కృష్ణ శాస్త్రి. అంతేకాదు ఈ మల్లీశ్వరి మేఘమాల నిజంగానే దేశదేశాలు తిరిగింది, చైనాతో సహా. సాలూరికి ఇష్టమైన చక్కని ఈ పాటను రాగ మాలిక గా భీంపలాస్, కీరవాణి, హంసానంది రాగాలలో కూర్చి ఘంటసాల, భానుమతి గార్లతో అందాల ఓ మేఘమాల పాట పాడించారు సాలూరు వారు.




నందమూరి తారక రామారావు, భానుమతి, సురభి కమలాబాయి, బేబీ మల్లిక, మాస్టర్ వెంకటరమణ, న్యాపతి రాఘవరావు, ఋష్యేంద్ర మణి, శ్రీవాత్సవ, కుమారి, వంగర, కమలాదేవి తదితరులు తమ పాత్రలలో ఒదిగి పోయారు.

చక్రవర్తి శ్రీకృష్ణ దేవరాయలు పరిపాలన నేపథ్యంలో ఈ చిత్ర కథ నడుస్తుంది. అప్పటి రాజవిధానం ప్రకారం రాజాంతఃపురంలో పనిచేయడానికి ఇష్టపడిన యువతులను వారింటికి పల్లకీ పంపి, వారి కుటుంబానికి ధన కనక బహుమానాలు ఇచ్చి, రాజాస్థానానికి పిలిపించే వారు. కాని ఒకసారి అంతఃపురంలో చేరిన యువతులకు బయటి మగవారితో సంబంధాలు నిషిద్ధం. ఈ నియమాన్ని అతిక్రమించిన వారికి ఉరిశిక్ష వేసేవారు.

చిత్రంలో పాటలు అన్నీ విశేషంగా జనాదరణ పొందాయి. లంబోదర లకుమికరా – పురందర దాసు కీర్తనబీ కోతీ బావకు పెళ్ళంట, కోవెల తోట విడిదంటబీ పిలచిన బిగువటరా ఔరౌరాబీ ఔనా! నిజమేనా! మరతునన్నా మరువలేనుబీ ఉషా పరిణయం యక్షగానం– కమలాదేవి, భానుమతి పరుగులు తీయాలి, గిత్తలు ఉరకలు వేయాలిబీ మనసున మల్లెల మాలలూగెనేబీ ఆకాశ వీధిలో హాయిగా ఎగిరేవు బీ ఎన్నినాళ్ళకీ బతుకు పండెనో, ఎంత హాయి ఈ రేయి నిండెనోబీ ఝుం ఝుం ఝుం తుమ్మెదా తుమ్మెదా తదితర పాటలు చిరస్థాయిగా నిలిచిపోయాయి.

ఒక సంప్రదాయ గానం, మరొక పురందరదాసు కీర్తన (గణేశ ప్రార్థన) తప్పించి మిగిలినవన్నీ దేవులపల్లి కృష్ణశాస్త్రి రచనలే. స్త్రీలను ఆకర్షించేందుకు భక్తి పాటలను ఏదో విధంగా చొప్పించే రోజుల్లో ఈ సినిమాలో టైటిల్స్ శ్రీగణనాథం అనే గీతం తప్ప మిగతా పాటలన్నీ సినిమాకు ముఖ్య కథాంశమైన అనురాగం, ప్రణయం, రెండవ థీం అయిన విజయనగర వైభవం చుట్టూ ఉండేలా రూపొందించారు. మొత్తం పాటల స్వరకల్పనకు ఆరు నెలల కాలం పట్టింది.

సినిమాలో మల్లీశ్వరి నాగరాజు ముందు ప్రదర్శించిన నృత్య గానాలను మారువేషంలో చూసిన అల్లసాని పెద్దన ఆశువుగా ఆమెను మెచ్చుకుంటూ ఓ పద్యం చెప్పే సన్నివేశం ఉంది. అల్లసాని పెద్దన రాసినట్లుగా అల్లిక జిగిబిగితో రావాలన్న జాగ్రత్త వల్ల కృష్ణశాస్త్రితో 108 పద్యాలు రాయించుకుని అందులో ఒక్కటి ఎంపిక చేసుకున్నారు బి.ఎన్.రెడ్డి.

మల్లీశ్వరి చలనచిత్రం ద్వారా చిత్రరంగానికి ప్రముఖ కవి, భావకవితోద్యమంలో ముఖ్యుడైన దేవులపల్లి కృష్ణశాస్త్రిని పరిచయం చేశారు.

ఈ చిత్రాన్ని సర్వేపల్లి రాధాకృష్ణ చూశారు. ఆయన గమనించిన విషయం – చిత్రంలో మల్లి, నాగరాజులు, మారువేషంలో ఉన్న రాయలవారిని కలిసింది పెద్దవర్షం వచ్చిన కారణంగా. ఐతే రాయలవారు వీరితో మాట్లాడి తిరిగి వెళ్ళిపోయే సమయంలో గుర్రాల స్వారీ వల్ల ధూళి రేగుతుంది. ఇది ఎలా సాధ్యం? అని ప్రశ్నించారు.

# మౌలిక సదుపాయాల కల్పనే ప్రపంచ పట్టణ ప్రణాళిక లక్ష్యం




ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవం ప్రపంచ వ్యాప్తంగా పట్టణ ప్రణాళిక ప్రాముఖ్యతను గుర్తించి, పట్టణాలను స్థిరంగా అభివృద్ధి చేసే దిశగా ప్రతి సంవత్సరం నవంబర్ 8న జరుపు కుంటారు. ఈ రోజు, పట్టణ ప్రణాళికలో పాల్గొనే ప్రణాళిక దారులు, ప్రభుత్వాలు, పౌరులు, పర్యావరణ కార్యకర్తలు వంటి వర్గాలు పట్టణాలను మరింత ఆరోగ్యకరమైన, సుస్థిరమైన, ఆర్థికంగా బలమైన ప్రదేశాలుగా మార్చాలన్న లక్ష్యాన్ని ప్రోత్సహిస్తాయి.పట్టణ ప్రణాళిక ఒక సమగ్ర, సుస్థిర అభివృద్ధి విధానంగా గుర్తించ బడుతుంది, ఇది పట్టణాలు, నగరాల భవిష్యత్తు అభివృద్ధికి మార్గదర్శకత ఇవ్వడమే కాకుండా ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో భూమి వినియోగం, రవాణా, మౌలిక సదుపాయాలు, పర్యావరణ పరిరక్షణ, ఆర్థికాభివృద్ధి వంటి అంశాలు ప్రధానంగా ఉంటాయి. సరైన ప్రణాళిక ద్వారా అన్ని వర్గాల ప్రజలకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన, జీవన స్థలాలను అందించవచ్చు.

పట్టణ ప్రణాళిక దారులు అనేక అంశాలను సమన్వయంగా పరిగణలోకి తీసుకుంటారు. జనాభా పెరుగుదల, వాతావరణ మార్పులు, సౌకర్యాల అభివృద్ధి, రవాణా సౌలభ్యం వంటి విషయాలు పట్టణ ప్రణాళికలో ప్రాధాన్యతను పొందుతాయి. ప్రపంచ వ్యాప్తంగా పట్టణీకరణ వేగంగా జరుగుతోంది. దీనికి అనుగుణంగా పట్టణాలను సుస్థిరంగా అభివృద్ధి చేయడం అత్యవసరం. నిర్దిష్ట ప్రణాళిక ద్వారా నివాస అవసరాలు, రవాణా, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలు సమర్థవంతంగా నిర్వహించవచ్చు. దీనివల్ల పట్టణాలు నియంత్రిత మార్గంలో అభివృద్ధి చెందుతాయి. పట్టణ ప్రణాళిక అన్ని వర్గాల ప్రజలకు సమాన అవకాశాలు కల్పించడంలో సహాయ పడుతుంది. సదుపాయాలు, విద్య, ఉపాధి అవకాశాలు, ఆరోగ్య సంరక్షణ వంటి సేవలు అందుబాటులో ఉండేలా చేస్తుంది. సరైన పట్టణ ప్రణాళికతో సామాజిక సమానత్వం పెంపొందించడం సాధ్యమవుతుంది. పట్టణ ప్రణాళిక పర్యావరణాన్ని రక్షించే విధానాలను ప్రోత్సహిస్తుంది. సరైన ప్రణాళిక ద్వారా ప్రకృతి వనరులను సంరక్షించడం, కాలుష్యాన్ని తగ్గించడం, గ్రీన్ స్పేస్‌ల అభివృద్ధి చేయడం వంటి కార్యక్రమాలు అమలు చేయవచ్చు. ఇది శాశ్వత వనరుల వినియోగాన్ని పరిమితం చేయడంలో కూడా సహాయ పడుతుంది. పట్టణ ప్రణాళిక ఆర్థికాభివృద్ధికి పునాది వేస్తుంది. పెట్టుబడులను ఆకర్షించడం, నూతన ఉద్యోగాలను సృష్టించడం, వ్యాపార అభివృద్ధి అవకాశాలను పెంచడం వంటి అంశాలను పట్టణ ప్రణాళికలో పరిగణలోకి తీసుకుంటారు.ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవం మన పట్టణాల భవిష్యత్తు గురించి ఆలోచించడానికి, వాటిని మరింత మెరుగైన ప్రదేశాలుగా తీర్చిదిద్దే దిశగా ప్రయత్నాలు చేయడానికి అన్ని వర్గాలకు విలువైన అవకాశాన్ని ఇస్తుంది.

పట్టణ ప్రణాళిక దారులు, ప్రభుత్వాలు, పౌరులు, మరియు సంబంధిత వర్గాలు కలిసి పనిచేస్తే సురక్షితమైన, ఆరోగ్యకరమైన, జీవించడానికి అనువైన పట్టణాలను సాధించడం సాధ్యమవుతుంది.

# కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



నల్లగొండ నవంబర్ 07(వుదయం ప్రతినిధి): సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా గురువారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తన ఇంటికి సర్వే నిమిత్తం వచ్చిన ఎన్యుమరేటర్ కు వివరాలను తెలియజేశారు. ఎన్యుమరేటర్ ఆయేషా హమీరా జిల్లా కలెక్టర్ ఇంటి నెంబర్, ఇంటి యజమాని, తదితర వివరాలను అడిగి తెలుసుకొని ఇంటికి అతికించే స్టిక్కర్ పై నమోదు చేశారు. వార్డు కోడ్, బ్లాక్ తదితర కోడ్ నెంబర్లు నమోదు చేసుకోన్న ఆనంతరం పూర్తి వివరాలను ఎప్పుడు సేకరిస్తారని జిల్లా కలెక్టర్ ఎన్యుమరేటర్ ను ప్రశ్నించగా, 9వ తేదీ నుండి మరో సారి ఇండ్లను సందర్శించి పూర్తి వివరాలను సేకరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కు సంబంధించి ఎన్యుమరేటర్ తో ఉన్న స్టిక్కర్, మ్యాప్, ఐ డి కార్డ్, ఇతర ఫారం లను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ నివాస గృహం గోడకు స్టిక్కర్ ను అతికించారు. ఈ కార్యక్రమంలో నల్గొండ ఆర్డిఓ అశోక్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ముసాబ్ అహ్మద్, సూపర్వైజర్ రోహిత్, తదితరులు ఉన్నారు.

# కర్ర కరుణాకర్ రెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్సీ రవీందర్ రావు ,ఎర్రబెల్లి దయాకర్ రావు



రాయపర్తి నవంబర్ 7( వుదయం ప్రతినిధి):మండలం కొండూరు గ్రామ తాజా మాజీ సర్పంచ్, తెలంగాణ ఉద్యమకారులు కర్ర సరిత – రవీందర్ రెడ్డి చిన్న కుమారుడైన కర్ర కరుణాకర్ రెడ్డి (23) హైదరాబాదులోని కీసర రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందగా,ఈ రోజు వారి స్వగ్రామం రాయపర్తి మండలం కొండూరు గ్రామంలో కర్ర కరుణాకర్ రెడ్డి అంతిమ యాత్రలో ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్రావు , మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాల్గొని, వారి భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమం లో బిఆర్ఎస్ జిల్లా నాయకులు బిల్లా సుధీర్ రెడ్డి, మాజీ ఎంపీపీ జీనుగు అనిమిరెడ్డి,మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల అధికారులు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఎండి నహీం, ప్రధాన కార్యదర్శి పూస మధు, మాజీ సర్పంచ్ గారే నర్సయ్య, మండల నాయకులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యాధికారి ఆకస్మిక తనిఖీ

లక్షెట్టిపేట నవంబర్ 7: (వుదయం ప్రతినిధి): మండలంలోని జెండావెంకటాపూర్స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని గంపలపల్లి ప్రాథమిక పాఠశాల లో డిఎంఫ్ టి నిధుల క్రింద మంజూరైన పనులను బుధవారం మండల విద్యాశాకాధికారి హెలెన్ దారతి ఆకస్మికంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి హెలెన్ హారతి మాట్లాడుతూ. చిన్న వయసు నుండే విద్యార్థులందరూ పట్టుదలతో చదివి ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలని అన్నారు. అదేవిధంగా ఎఫ్ఎల్న్ లో భాగంగా విధ్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి తగిన సూచనలను, సలహాలను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలప్రధానోపాధ్యాయురాలు సిహెచ్. జ్యోతి, ఉపాధ్యాయురాలు సిహెచ్ మంజుల, సిఆర్పి సిహెచ్ ప్రణీత్, భవాని పాల్గొన్నారు.



# కుల గణనలో మాదిగలు జాగ్రత్తగా ఉండాలి

## ఎమ్ ఆర్పీ యస్ టీ యస్ జిల్లా ఇంచార్జ్ తగరం మధురాజ్

చెన్నూరు ,నవంబర్07(వుదయం ప్రతినిధి): కుల గణనలో మాదిగలు జాగ్రత్తగా ఉండాలని ఎమ్ ఆర్పీ యస్ టీ యస్ జిల్లా ఇంచార్జ్ తగరం మధురాజ్ అన్నారు. ఈ సందర్భంగా తను మాట్లాడుతూఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పు అనంతరం మన తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపట్టింది అనగా (ఇంటింటి సమగ్ర సర్వే) 8 పేజీలు 75 ప్రశ్నలతో కూడిన ఒక బుక్ లెట్ ను తీసుకొని ఎన్యూమరేటర్ (సర్వే చేసే వ్యక్తి)మన ఇంటికి వస్తారని కావున ప్రతి ఒక్కరూ కులం అనే కాలంలో SC అనిఉపకులము అనే కాలంలో మాదిగ అని తప్పకుండా రాయించాలని అన్నారు.మాదిగ అని కాకుండా హరిజనులము అని చెప్పకూడదని, మన ముందే సర్వే చేసే వ్యక్తి ఎ స్సీ మాదిగ అని రాశాడో లేదో బుక్లెట్ ను ఒకసారి చూడాలని మన ముందు ఎస్సి అని రాసి తరువాత వేరే ఉప కులం రాసే ప్రమాదం పొంచి ఉన్నదని కావున ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన విషయం ఇదని,మన యొక్క భవిష్యత్తు, మన పిల్లల భవిష్యత్తు తరతరాల భవిష్యత్తు మారబోయే సువర్ణ అవకాశం ఇదనిమన కులము ఎస్సి ఉపకులము మాదిగఅని తప్పనిసరిగా రాయించాలని ఆయన కోరారు



# తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం గత రెండు రోజు నుండి

## కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్గాంధీ



పినపాక నియోజకవర్గం ,నవంబర్07(వుదయం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచన మేరకు ఎన్నికలమేనిఫెస్టోలో ఇచ్చినహామీ కుల గణన నుఅమలు పరుస్తూ తెలంగాణరాష్ట్ర ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచన మేరకు తెలంగాణరాష్ట్ర ప్రభుత్వం గత రెండు రోజు నుండి చేపడుతున్న సామాజిక, ఆర్థికవిద్య ఉపాధి, రాజకీయకుల సర్వే, సమగ్రకుటుంబ సర్వేలో భాగంగా ప్రభుత్వ అధికారులతోకలిసి సర్వే నిర్వహిస్తున్న ఆఫీసర్ దేవేందర్ పినపాక మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోడిశాల రామనాథం, ముస్లిం మైనారిటీ నియోజకవర్గ అధ్యక్షులు ఎండి బషీరుద్దీన్, గొట్టేముక్కుల, స్వతంత్ర రెడ్డి, ఎస్ కె పాషా, చిర్రా ఉప్పలయ్య, ఎస్ కె బేగం, ఎస్కే ఆమెన్ భాష తదితరులు పాల్గొన్నారు

# గుడుంబా తయారుచేసిన విక్రయించిన కఠిన చర్యలు తప్పవు

రాయపర్తి నవంబర్ 7 (వుదయం ప్రతినిధి): గుడుంబా తయారు చేసిన విక్రయించిన కఠిన చర్యలు తప్పవు అని వర్ధన్నపేట ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ స్వరూప అన్నారు. గురువారంమండలంలోని జయరాం తండ,సుభాష్ తండ , జేతురాం తండ గ్రామ పరిసరాలలో నాటు సారాయి కేంద్రాలపై ప్రోహిబిషన్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ స్వరూప ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆ గ్రామ అవాస ప్రాంతంలో మూడు కేసులు నమోదుచేసి 10 లీటర్ల నాటు సారాయి స్వాధీన పరచుకుని 850 లీటర్ల బెల్లం పానకం ధ్వంసము చేసినట్లు తెలిపారు. ఈ దాడులలో ప్రోహిబిషన్ ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ సరిత, సిబ్బంది టీ వెంకటేష్, , పి రమేష్ బాబు , రమేశ్ బాబు , వంశి, తదితరులు పాల్గొన్నారు.



# నా ఇంటిని బడిగా నడుపుతా

- నా శక్తి మేరకు ఈ పిల్లలకి విద్యను అందిస్తా.....
- క్రమశిక్షణను నేర్పిస్తూ పాఠశాల టైమింగ్స్ ను అలవాటు చేస్తా..
- మూల ఆదివాసి గ్రామ పెద్దమనిషి



భద్రాచలంనియోజకవర్గం ,నవంబర్07(వుదయం ప్రతినిధి): ఐ టి డి ఏ అధికారులు చర్ల మండలం ఆదివాసి గ్రామాలైన రాజయ్య నగర్ క్రాంతి పురం గ్రామాలలో ప్రాథమిక పాఠశాలను నిర్మిస్తారని ఆదివాసి బిడ్డలకు విద్యను అందిస్తారని ఆదివాసీల ప్రజల ఎదురుచూపులుచర్ల మండలంలోని సుబ్బంపేట పంచాయతీ పరిధిలోనీ ఆదివాసి గ్రామాలైన రాజయ్య నగర్ , క్రాంతి పురం గ్రామాల పరిధిలో విద్యార్థులు ఉన్నప్పటికీ అధికారులు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నిర్మించలేదు దాని కారణంగా ఈ రెండు గ్రామాల పరిధిలో ఉన్న విద్యార్థులు ఇతర పంచాయతీ అయినా కొయ్యూరులో ఉన్న బడికి రెండు కిలోమీటర్లు ప్రయాణం చేసి వెళ్తున్నారు వెళ్లే క్రమంలో అటవీ ప్రాంతం అయినందున విద్యార్థులకు పాముల నుండి తేల నుండి కుక్కల నుండి నక్కల నుండి పందుల నుండి ప్రాణ హాని జరిగే అవకాశం మెండుగా ఉంటుంది దారి పొడవునా వాగులు ఉండడం వలన అవి దాటే సందర్భంలో కూడా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంటుంది అంతేకాకుండా వచ్చిపోయేదారి అడవి అయినందున దారి తప్పే అవకాశం కూడా ఉంటుంది అలాగే ప్రధాన రహదారి దాటే సందర్భంగా యాక్సిడెంట్లు జరిగే అవకాశం కూడా ఉంటుంది ఈ భయం కారణంగానే తల్లిదండ్రులు విద్యార్థులను చదువులు మానిపించిన పరిస్థితి ఈ రెండు గ్రామాల పరిధిలో నెలకొన్నది తల్లిదండ్రుల భయం కారణంగా పిల్లల్ని బడికి పంపించడం లేదు అలా పంపించకపోవడంతో ఆ విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని అలా ఎన్నటికీ జరగవద్దని ఆదివాసి బిడ్డలు చదువుకోకపోతే భవిష్యత్తులో వారు ఈ సమాజంలో గౌరవంగా బ్రతకలేనని గుర్తించి ఆ గ్రామ పెద్దమనిషి అయిన రేగ ఆంధ్రయ తన ఇంటిని పాఠశాలగా మార్చినాడు ప్రాథమిక విద్యకు సంబంధించిన చార్టులు ఇతర పుస్తకాలు తీసుకువచ్చి తానే స్వయంగా తన శక్తి మేరకు విద్యార్థులకు బోధన చేస్తు ఉపాధ్యాయుడు అయినాడు పాఠశాల టైమింగ్ పాటిస్తూ ఆటలు ఆడిస్తున్నాడు ఏరోజు కైనా అధికారులు స్పందించి ఈ రెండు ఆదివాసి గ్రామాల పరిధిలో ఒక ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేస్తారని ఈ ఆదివాసి బిడ్డలకు చదువుని చెబుతారని నమ్మకంతో ఆశతో ఈ రకంగా క్రమం తప్పకుండా విద్యార్థులు క్రమశిక్షణ తప్పకుండా మా శక్తి మేరకు తోచిన విధంగా కృషి చేస్తున్నమని ఆయన అన్నారు ఇలా చేయకపోతే పిల్లలు చదువుల నుంచి బడి నుంచి డైవర్టు అవుతారని తల్లిదండ్రులు కూడా ఈ పిల్లలని ఏదో పనికి పంపాలని ఆలోచిస్తారని తద్వారా విద్యార్థులకు కూడా పనికి వెళ్లాలని ఆలోచన కలుగుతుందని అది విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం చేస్తుందని ఆయన అన్నారు ఇది ఏమైనాప్పటికీ ప్రభుత్వం అధికారులు ఈ గ్రామాల్లో పాఠశాల నిర్మించేంతవరకు నా ఇంటిని బడిగా నడుపుతానని నా శక్తి మేరకు ఈ పిల్లలకి విద్యను అందిస్తానని క్రమశిక్షణ నేర్పిస్తానని పాఠశాల టైమింగ్స్ ను అలవాటు చేస్తానని ఆయన అన్నారు

# విశ్వబ్రాహ్మణ - విశ్వకర్మలనుఒకే కులస్తులుగాపరిగణించాలి

**వృత్తులను కులాలుగా భావించవద్దు విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి.ఏలేశ్వరంనరసింహచారి**



చెన్నూరు నవంబర్ 7వు దయం : తెలంగాణ వ్యాప్తంగా బీసీ కమిషన్ ఆధ్వర్యంలో బుధవారం నుండి చేపట్టనున్న బీసీ కుల గణనలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మలను ఒకే కులంగా పరిగణించకుండా వృత్తులుగా కుల గణన కోడ్ బుక్ ఫార్మాట్లో పేర్కొనడం పట్ల రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు బుధవారం చెన్నూరు పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఏలేశ్వరం నరసింహ చారి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ జాతి వారిని బీసీ ప్రణాళిక సంఘం సభ్యులు వంచనకు గురి చేశా రని మండిపడ్డారు. బుధవారం నుండి జరిగే కుల గణన లో విశ్వబ్రాహ్మణులను విశ్వకర్మలను ఒకే కులం గా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు బీసీ కులాల జాబితాలో సీరియల్ నెంబర్ 21 ఆధారంగా బీసీ.బీ.గా విశ్వబ్రాహ్మణ కులం పేరుతో తమకు కుల ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్నారని అలాంటప్పుడు వృత్తులను కులాలుగా ఎలా ఫార్మాట్లో పేర్కొంటారని ఆవేదన వ్యక్తం చేశారు. విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ల లో పంచదారులైన ఐదు వృత్తుల వారు కమ్మరి వడ్రంగి కంచరి శిల్పి స్వర్ణకార వృత్తులు కొనసాగిస్తారని వారు విశ్వబ్రాహ్మణులేనని పేర్కొన్నారు. వృత్తులపరంగా కులాలను విడదీయరాదని తమను విశ్వకర్మలుగా లేదా విశ్వబ్రాహ్మణులుగా పరిగణించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫార్మాట్లో స్వర్ణకార. వడ్రంగి. కమ్మరి కంచరి .శిల్పి వృత్తుల వారిని ఫార్మాట్లో కోడు తో విభజించి వృత్తులనే కులాలుగా పేర్కొంటూ ప్రభుత్వం తమ జాతిని చిన్నచూపు చూస్తూ వంచనకు గురి చేసిందన్నారు. ఇప్పటికైనా ప్రణాళిక సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన ఫార్మాట్లో జరిగిన పొరపాటును సవరించాలని విజ్ఞప్తి చేశారు. వృత్తులు వేరైనా కులం మాత్రం విశ్వబ్రాహ్మణులు గానే పరిగణించాలని పేర్కొన్నారు. విశ్వకర్మల సాంప్రదాయ వృత్తులైన కమ్మరి. వడ్రంగి. కంచరి. శిల్పి. స్వర్ణకార. వృత్తి పని చేస్తున్న వారందరిని ఒకే జాతిగా గుర్తించాలని కోరారు. ఫార్మేట్ లో జరిగిన పొరపాట్లను సవరించకుండానే కుల గణన జరుపుతే రాష్ట్రస్థాయిలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో స్వర్ణకార సంఘం ప్రధాన కార్యదర్శి చిలుకూరి సందీప్ చారి మండల విశ్వబ్రాహ్మణ సంఘం. జాయింట్ సెక్రెటరీ. చిలుకూరి శ్రీనివాస్.రాజేందర్ పాలొగొన్నారు

# కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

నారాయణఖేడ్, ,నవంబర్07(వుదయం ప్రతినిధి): కల్హేర్ మండలం ఖానాపూర్ (కె) తాండకు చెందిన బాబు నాయక్ ఇటీవల మరణించారు.

ఈ విషయం తెలుసుకున్న నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి గురువారం బాబు నాయక్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి, పవార్ సింగ్ తాండ ప్రజలు తదితరులు ఉన్నారు.

# చనిపోయిన హోం గార్డ్స్ కుటుంబ సభ్యులకు ఆర్థిక చేయూత

రామగుండం పోలీస్ కమీషనరేట్ ,నవంబర్07(వుదయం ప్రతినిధి): రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తూ ఆరోగ్య సమస్యలతో చనిపోయిన హోం గార్డ్స్ బి. శ్యామ్ కుమార్ –921, బి. వెంకటేశం –116,కె. నగేష్ –207,ఎం. ఏ ఫెరోజ్ ఖాన్ –667 లకు తెలంగాణ రాష్ట్ర హోం గార్డ్స్ సంక్షేమ నిధి నుండి ఒక్కొక్కరికి 15 వేల రూపాయల చొప్పున మంజూరైన చెక్ లను రామగుండం పోలీస్ కమిషనర్ సీఎం శ్రీనివాస్ ఐపిఎస్., ఐజి గారు వారి కార్యాలయంలో హోంగార్డ్స్ కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, ఏ ఆర్ ఏ సి పి ప్రతాప్, హోంగార్డ్స్ ఆర్ ఐ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న భద్రాచలం ట్రాఫిక్ ఎస్సై మరియు సిబ్బంది..



. భద్రాచలంనియోజకవర్గం ,నవంబర్07(వుదయం ప్రతినిధి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణ పోలీస్ స్టేషన్ లో హోంగార్డుగా పనిచేస్తున్న మాడుగుల సత్యనారాయణ హెచ్ జి నెంబర్ 901 భార్యకు బ్రెయిన్ స్ట్రోక్ రావడం వలన వైద్యం కోసం హైదరాబాద్ తరలించడం జరిగింది. ఆమె అనారోగ్య దృష్ట్యా హైదరాబాదులో బ్రెయిన్ సర్జరీ చేయడం జరిగింది. ఇంకా ఆమె పూర్తిగా కోలుకోలేదు, ఆపరేషన్ తర్వాత ప్రతిరోజు ఫిజియోథెరపీ కోసం 30000 ఖర్చు అవుతుండగా అతని ఆర్థిక స్తోమతను దృష్టిలో ఉంచుకొని భద్రాచలం ట్రాఫిక్ ఎస్ఐ మధు ప్రసాద్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్ఐ మరియు వారి సిబ్బంది కలిసి మానవతా దృక్పథంతో ఆమె వైద్యం కోసం 22,000 డబ్బులను హోంగార్డ్స్ ఇంచార్జ్ శేషు కి అందజేయడం జరిగింది. హోంగార్డు కుటుంబానికి సహాయం చేసిన ట్రాఫిక్ ఎస్ఐ మరియు వారి సిబ్బందికి హోంగార్డ్స్ తరపున శేషు ధన్యవాదాలు తెలియజేశారు..

# రాజపేట పిరమిడ్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ధ్యానం



యాదాద్రి భువనగిరి,/రాజపేట, డిసెంబర్ 7 వుదయం ప్రతినిధి : ధ్యానంతో ఆరోగ్యం, ఏకాగ్రత, విద్యలో రాణింపు సాధ్యమవుతుందని మాస్టర్ అంజయ్య శోభారాణి దంపతులు తెలిపారు. గురువారం రాజాపేట మండలం పాము కుంట, సింగారం బేగంపేట రఘునాథపురం పాఠశాలల్లో విద్యార్థులకు ధ్యాన విద్యార్థి పైలట్ ప్రాజెక్టు కార్యక్రమంలో భాగంగా పిరమిడ్ సొసైటీ పి ఎస్ ఎస్ ఎం ఆధ్వర్యంలో హైదరాబాద్ మాస్టర్లు అంజయ్య శోభారాణి దంపతులు మెడిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంజయ్య శోభారాణి దంపతులతో పాటు రాజపేట మాస్టర్లు గొట్టిపాముల వెంకటేశం గౌటే బాలరాజు లు మెడిటేషన్ విధానాన్ని విద్యార్థులకు తెలిపారు. ప్రయోజనాలు వివరిస్తూ నిత్య కృత్యం లో ధ్యానం ఒక భాగం కావాలని విద్యార్థి దశ నుండి తప్పకుండా అలవర్చుకోవాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# శివానంద ఆశ్రమ నిర్మాణం కోసం 24న, గుట్టలో సమావేశం

యాదాద్రి భువనగిరి/రాజాపేట, డిసెంబర్ 7 వుదయం ప్రతినిధి : శివానంద ఆశ్రమ నిర్మాణం కోసం ప్రత్యేక సమావేశం యాదగిరిగుట్ట బుచ్చి దాసు ఆశ్రమంలో ఈనెల 24వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆధ్యాత్మికవేత్తలు భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని రాజపేట శ్రీ రామకృష్ణ సాయి మందిరం ఆలయ ట్రస్ట్ సభ్యులు ఉప్పల రమేష్ తెలిపారు. గురువారం రాజపేట గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కమిటీ ఏర్పాటు కోసం ఉత్సావంతులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రఘునాథపురం గ్రామ తాజా మాజీ సర్పంచ్ గాడి పల్లి శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు విద్యార్థిని ఎంపిక

లక్షెట్టిపేట నవంబర్ 7: (వుదయం ప్రతినిధి): అదిలాబాదు లోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరిగిన అండర్–17 ఖో–ఖో పోటీలలో జోనస్ స్థాయి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని తుమారాం గోపిక 9వ తరగతి విద్యార్థిని ఖమ్మంలో ఈనెల 8 తారీకు నుండి 10తారీకు వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యారాలు జి .శైలజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిడి కే.రామ్మోహన్ రావు ను, విద్యార్థిని గోపికను పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది అభినందించారు.



# పార్టీ అభివృద్ధి, పేదల కోసం అశోక్ గౌడ్ నిరంతర కృషి



యాదాద్రి భువనగిరి/రాజాపేట నవంబర్ 7 వుదయంప్రతినిధి: పార్టీ అభివృద్ధి కోసం పేద ప్రజల సంక్షేమం కోసం బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఊట్కూరు అశోక్గౌడ్ నిరంతరం శ్రమిస్తారని పార్టీ నాయకులు ప్రజలు అన్నారు. రాజపేటలో బీజేపీ యాదాద్రి జిల్లా ప్రధాన కార్యదర్శి ఊట్కూరి అశోక్ గౌడ్ పుట్టినరోజు వేడుకలు పార్టీకార్యకర్తలు అభిమానులు మంగళవారం రాత్రి మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బిజేపీ రాజపేట మండల అధ్యక్షులు దాచేపల్లి రాజు కేకు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి కుమ్మరి లక్ష్మణ్, మండల ప్రధాన కార్యదర్శి గవ్వల సిద్దేశ్వర్, గిరిజనమోర్చా రాష్ట్ర కార్యదర్శి భూక్యా శ్రీను నాయక్, మండల కార్యదర్శి సాధనబోయిన శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు కాసోజు సంపత్, బిజెవైఎం మండల అధ్యక్షుడు మార్క శివ, ప్రధాన కార్యదర్శి కోయ మధు, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఎర్రగోకుల వినోద్, బూతు అధ్యక్షులు, చిగుళ్ల బిరప్ప, చింతం వేణు, బిర్రు సురేష్, నాయకులు జెన్న సిద్ధులు, వనం నందు, ఎక్కలదేవి శ్రీహరి, సంగెం వేణు, గవ్వల అనిల్, కాకళ్ల సిద్ధులు, దప్పు రాజు, ఎం డి ఖాజా, కోయ హరినాద్,చింతల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటి సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

## : కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



రంగారెడ్డి జిల్లా ,నవంబర్07(వుదయం ప్రతినిధి): నార్సింగ్ మున్సిపాలిటీ కోకాపేటలో ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహిస్తున్నతీరును కలెక్టర్ నారాయణ రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోకాపేటలో అపార్ట్మెంట్ లో సర్వే చేస్తున్నఎన్యూమరేటర్ ను సర్వేకు సంబంధించిన వివరాలను కలెక్టర్ అడిగితెలుసుకున్నారు. సర్వే సందర్భంగా సమగ్ర వివరాలు తీసుకున్న అనంతరంసంబంధిత ఇంటికి సర్వే పూర్తి చేసినట్లు వేసిన స్టిక్కర్ ను కలెక్టర్పరిశీలించారు. కుటుంబ సర్వే నిర్వహణ కోసం అతికించిన స్టిక్కర్లను చూసి,వాటిపై నమోదు చేసిన ఇంటి నెంబరు, ఎన్యూమరేషన్ బ్లాక్, క్రమ సంఖ్య తదితరవివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సర్వేకు సంబంధించి ఎన్యూమరేటర్ కు కలెక్టర్ పలు సలహాలు సూచనలు చేశారు. ఆర్థిక, సామాజిక,రాజకీయ, విద్య,ఉపాధి,కులవివరాల సేకరణకై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగాజరిపిస్తున్న ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు తమవంతు సహకారం అందించాలనికలెక్టర్ అన్నారు. సర్వే కోసం ఇళ్లకు వచ్చే ఎన్యూమరేటర్లకు వాస్తవవివరాలతో కూడిన సమాచారాన్ని అందించాలని సూచించారు. ఆయా ఇళ్లనుసందర్శించి ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పకడ్బందీగా సర్వే జరపాలనిఅధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట నార్సింగ్ మున్సివల్ కమిషనర్, సంబంధిత అధికారులుతదితరులు పాల్గొన్నారు.

# కులగణన సర్వేపై ఎన్యుమరేటర్లకు శిక్షణ



కాసిపేట నవంబర్ 7 (వుదయం విలేకరి) సామాజిక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేపై మండలంలోని ముత్యం పల్లి రైతు వేదికలో ఎంపీడీవో సత్యనారాయణ సింగ్ ఆధ్వర్యంలో గురువారం శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శిక్షకులు సర్వే నిర్వాహకులు గా కేటాయించబడిన పంచాయతీ కార్యదర్శులు,ఉపాధ్యాయులు, ఇతర శాఖల సిబ్బందికి శిక్షణ నిచ్చారు. ఆధార్, రేషన్, తదితర వివరాలతో పాటు దాదాపు 70 ప్రశ్నలతో కూడిన వివరాలను ఇంటింటికి తిరిగి పొందువర్చాలన్నారు. అదేవిధంగా పశుసంపద, ఆస్తులు, ఐటీ వివరాలతో సర్వేను పూర్తి చేయాలన్నారు ఈ సమావేశంలో , తహసీల్దార్ భోజన్న ఎం పి ఓ శేఖ్. సప్దర్ అలీ, ఏ ఓ ప్రభాకర్ , ఏ ఏస్ ఓ అమరేందర్ రెడ్డి, సూపరింటెండెంట్ లక్ష్మయ్య, సీనియర్ సహాయకులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు

# ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన బాధితురాలిని పరామర్శించిన ఎస్పీ జానకి షర్మిల



బాసర నవంబర్ 07 ( వుదయం ప్రతినిధి) నిర్మల్ జిల్లా భైంసా ఏరియా ఆసుపత్రిలో బాధితురాలిని వివరలు అడిగి తెలుసుకున్న జిల్లా ఎస్పీ జానకి షర్మిల.నిన్న నిజమాబాద్ కి చెందిన ఓ కుటుంబం అప్పుల బాధ భరించలేక బాసర గోదావరి నది లో దూకి ఆత్మహత్యాయత్నం భార్య అనురాధను కాపాడిన స్థానికులు.
నిన్న భర్త మృతదేహం లభ్యం. కూతురూ పౌర్ణిమ మృతదేహాన్ని బాసర నుండి సుమారు 10 కిలోమీటర్ల దూరం లో గోదావరి నదిలో ఉన్నట్టు తెలుసుకున్న పోలీసులు.గోదావరి నది ప్రవాహంలో కొట్టుకుపోయిన పూర్ణిమ మృతదేహం.కూతురు పూర్ణిమ మృతదేహం లభ్యం.

# ఎమ్మార్పీఎస్ కమిటీ ఆధ్వర్యంలో సి సి కెమెరా పనులు ప్రారంభం



హనుమకొండ, నవంబర్ 07(వుదయం జిల్లా ప్రతినిధి): లష్కర్ సింగారం ఎమ్మార్పీఎస్ కమిటీ ఆధ్వర్యంలో సి సి కెమెరాల పని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బెతెల్ బాప్టిస్ట్ చర్చ్ పాస్టర్ ఉదయ్ సామ్యేలు, గ్రామ పెద్దలు మేధావులు, యువకులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో బొట్ల బిక్షపతి, ఎమ్మార్పీఎస్ 53 డివిజన్ అధ్యక్షులు ఎర్ర రాము .బొక్క రాజేష్ .ఎర్ర వరద రాజ్. సిలివేరు బిక్షపతి .మున్నంగి రఘు రాజన్ బాబు అలువల ఎల్లేష్ . మట్టేడా అనిల్ .నద్దునూరి రాజేశ్ ఖన్న ఆలువల ఉమేందర్.ఎర్ర రాజయ్య ఎర్ర మహేందర్ దామెర అరుణ్ కొడకండ్ల.విజయ్ ఎర్ర నరేష్. కోడకండ్ల రాజేష్. ఎర్ర అరుణ్ వెల్పుగొండ చిరంజీవి పెద్దలు:- మాజీ కార్పొరేటర్ సాగొంటి ప్రకాష్ బొట్ల బిక్షపతి MD బాబా భాయి దామెర సుదర్శన్ ఎర్ర రవీందర్. కోడకండ్ల సారయ్య ఎర్ర అబ్రహాం దమేరా శంకర్ నక్క ప్రభుదాస్.ఎర్ర సురేష్. సంద్ర గిరి ఎర్ర సురేందర్ ఎర్ర బాబు.షరీఫ్ భాయ్ md గౌస్ రహీమున్నిస భేగం గార్లు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు ఇప్పటివరకు మీ విరాళాల ద్వారా సహకరించిన ప్రతి ఒక్క కుటుంబానికి కృతజ్ఞతలు.

# గిరిజన ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ



బయ్యారం ,నవంబర్07(వుదయం ప్రతినిధి): బయ్యారం మండలంలోని ఇర్సులాపురంలో గ్రామంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల నందు గురువారం గిరిజన సంక్షేమ సహాయ అధికారి రాగిణి భాస్కర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా 9,10 వతరగతి విద్యార్థులతో మెను విషయాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం టీచింగ్ స్టాఫ్ మీటింగ్ ఏర్పాటు చేసి పదవతరగతి విద్యార్థుల హాజరు శాతం ,వంద శాతం ఉత్తీర్ణత సాదించే దిశగా ఉపాద్యాయులు పని చేయాలని సూచించారు.పరిసరాల పరిశుభ్రత పై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మండలకేంద్రంలో పిఎమ్ హెచ్ బాలుర,బాలికల వసతి గృహలను తనిఖీ చేసి వెళ్లారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ ఫిజికల్ డైరెక్టర్ లాలు,టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

# బాలవికాస సంస్థ ఆధ్వర్యంలోవిద్యార్థులకు సోలార్ టేబుల్ ల్యాంప్ ల పంపిణీ





కొత్తగూడ నవంబర్ 7 (వుదయం ప్రతినిధి ): మండలంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల గర్ల్స్ హాస్టల్లో బాలవికాస సంస్థ వరంగల్ వారి సహకారంతో విద్యార్థులకు సోలార్ టేబుల్ లాంప్ లను అందజేశారు.ఈ యొక్క సోలార్ టేబుల్ లాంప్ లను 8,9,10, వ తరగతి విద్యార్థునిలకు గాను 1,50,000 ల విలువగల సోలార్ టేబుల్ లాంప్ లను 100 మందికి పంపిణీ చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి తెలిపారు. విద్యార్థినిలు ఈ యొక్క బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన సోలార్ టేబుల్ లాంప్ లను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అదేవిధంగా గతం లో ఈ యొక్క పాఠశాలలో బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో వాటర్ ట్యాంకులను, వాటర్ ప్లాంట్లను కూడా ఏర్పాటు చేశారని.ఏజెన్సీ లో ఉన్న పాఠశాలలో వున్నా సమస్యలను తెలుసుకొని విద్యార్థుల అవసరాలను తీర్చాలని కృషి చేస్తున్న బాలవికాస సంస్థకు పాఠశాల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియ చేస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకన్న,బాలవికాస సంస్థ జోనల్ కో ఆర్డినేటర్ ఎం.నరేష్ %డ%కో ఆర్డినేటర్.జె. కిషన్ పాల్గొన్నారు.

# మురిమడుగు ఉన్నత పాఠశాలకు సైకిల్ పంపిణి



జన్నారం,నవంబర్ 7(వుదయం విలేఖరి) మురిమదుగు ఉన్నత పాఠశాల విద్యార్థులకు హెల్పింగ్ హాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ మంచిర్యాల వారు సైకిల్ పంపిణీ చేశారు. గురువారం రోజున ఉదయం పాఠశాల ఆవరణలో ఉచితంగా సైకిల్ అందజేశారు.ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ దూర ప్రాంతం నుంచి వచ్చే విద్యార్థుల చదువుకు దూరం భారం కాకూడదని మంచి ఉద్దేశంతో సైకిల్ అందజేశామని,భవిష్యత్తులో కూడా మరిన్ని సైకిళ్లు అందజేస్తామన్నారు.అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.అజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని,సైకిల్ తొక్కడం వల్ల విద్యార్థులు శారీరకంగా,మానసికంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనుమల రాజన్న,తాళ్లపల్లి కొమరయ్య,కందుల తిరుపతి,సురేష్ కుమార్,వినోద్ కుమార్,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇంటింటి సర్వేను జయప్రదం చేయండి

**- సర్వేలో మీ ఇంటి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ధరణి పాస్ బుక్కు, కుటుంబ సభ్యుల వివరాలు ఆర్థిక స్థితిగతులు కులము, మతము, ఆరోగ్య అనేక సమాచారాన్ని అందించాలి**

**- తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ఆటపాటల ద్వారా ప్రజలకు అవగాహన**

**- పంచాయతీ కార్యదర్శి పి.బాలరాజు**

వనపర్తి నవంబర్ 07(వుదయం ప్రతినిధి):తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం




ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని గురువారం గోపాల్ పేట్ మండలంలోని బస్టాండ్ లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం తమ యొక్క ఆటపాటల ద్వారా ప్రజలకు చైతన్య పరిచారు. 56 రకాల ప్రశ్నవలి ద్వారా అధికారులకు మీ మీ ఇంటి దగ్గరికి వచ్చినప్పుడు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ధరణి పాస్ బుక్కు, కుటుంబ సభ్యుల వివరాలు ఆర్థిక స్థితిగతులు కులము, మతము, ఆరోగ్య అనేక సమాచారాన్ని అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం టీం లీడర్ గుడిసె శివలింగం, కళాకారులుఎన్.సువర్ణ, ఏం. రాధా, ఎస్. శ్రీనివాసులు, డప్పు నరసింహ, డి కృష్ణయ్య, బోనాసి రాజు, వివిధ గ్రామాల ప్రజలు, విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు వైయస్సార్



యాదాద్రి భువనగిరి / మోటకొండూర్ : నవంబర్ వుదయం ప్రతినిధి : మండల కేంద్రంలోని మహాలక్ష్మి గార్డెన్స్ లో వర్టూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కీ, శే,, బొట్ల భిక్షపతి కుమార్తె కావ్య వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యెల్లంల సంజీవరెడ్డి. వారితో పాటు యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి నెమ్మని సుబ్రహ్మణ్యం, జిల్లా మీడియా కోఆర్డినేటర్ ఏకు సంతోష్ రెడ్డి, కార్తీక్, శ్రీను, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

# పోస్ట్ ఆఫీస్ ను సందర్శించిన ఎస్ఆర్ఎం పాఠశాల విద్యార్థులు.



కోదాడ టౌన్ నవంబర్ 7(వుదయం) కోదాడ పట్టణంలోని ఎస్ఆర్ఎం పాఠశాల క్లాస్ 1 విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా గురువారం పోస్ట్ ఆఫీస్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా హెడ్ పోస్టు మాస్టర్ సునీల్ పోస్ట్ ఆఫీస్ ద్వారా ప్రజలకు అందించే సేవలను విద్యార్థులకు వివరించారు.రిజిస్టర్డ్ పోస్ట్, మనియార్డర్, స్పీడ్ పోస్ట్ స్టాంపుల ఉపయోగాన్ని విద్యార్థులకు తెలియజేశారు.కరస్పాండెంట్ కేశినేని శ్రీదేవి మాట్లాడుతూ ఇటువంటి సందర్శనలు, పర్యటనలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# సాంస్కృతిక కవి గాయకులు పిన్నింటి రత్నంకు అభినందనలు

సంగారెడ్డి, ,నవంబర్07(వుదయం ప్రతినిధి): కొమురవెల్లి మండలం అయినాపూర్ గ్రామానికి చెందిన తెలంగాణ సాంస్కృతిక సారథి కవి గాయకులు పిన్నింటి రత్నం రచనలో రెండు పాటలను రాష్ట్ర ప్రభుత్వం బాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రగతి పథంలో ప్రజా పాలన పుస్తక సంకలనంలో చోటు దక్కింది. గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు రత్నం ఇంటికి వచ్చి అభినందనలు తెలిపి, బియ్యం అందజేశారు. ఈ సందర్బంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కవులు కళాకారుల పాత్ర మరువలేనిదన్నారు.

# వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే బొజ్జు



ఖానాపూర్,నవంబర్ 7(వుదయం విలేకరి) ఖానాపూర్ నియోజకవర్గం,జన్నారం మండలం, వరి ధాన్యం కొనుగోలు సాఫీగా జరిగేలా ప్రభుత్వం పటిష్ట చర్యలు చేవడుతోందని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు.గురువారం జన్నారం మండలం ఇంధనపల్లి గ్రామంలో డిసిఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని అన్నారు.వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు.సన్నవడ్లపై రైతుల ఖాతాల్లో 500 రూపాయల బోనస్ వేస్తామని తెలిపారు.రైతులు తమ ధాన్యంను బాగా అరబెట్టాలని 17 తేమ శాతం మించకుండా చూడాలని సూచించారు.రైతులు తమ పంటలను కొనుగోలు చేసే సమయంలో తమ వెంట పట్టా పాస్ బుక్,బ్యాంక్ పాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు తీసుకొని రావాలన్నారు.పట్టా పాస్ బుక్ లేని రైతులు ఏఈఓ అధికారి వద్ద రైతు ధ్రువీకరణ పత్రాన్ని వెంట తీసుకోచ్చి తమ పంటలను అమ్మాలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముజఫర్ అలీ,ప్రధాన కార్యదర్శి వేకల మాణిక్యం,అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,రైతులు పాల్గొన్నారు.

# రచనలు

ఏదో ఒకటి రాయాలని రాయకు
ఏదో ఒకటి చెప్పాలని రచించు
తలచిందే తడవుగా
పచ్చి పచ్చి ఆలోచనలు గీకి పడేయకు
ముద్రణకై పంపేయకు
పేరు అప్రధానం తీరు విశేషం
పేరు బుద్బుదం తీరు ప్రమాణం

నానబెట్టి, ముదర బెట్టి
పండించి, పరిపక్వత సాధించి
ఆలోచించి, విశ్లేషించి, వివరించి
సందేశాత్మకంగా, సంబోధాత్మకంగా
స్ఫూర్తిదాయకంగా, ప్రేరణాత్మకంగా
భాషను పెంచునట్లు లిఖించు
నూతన విషయాలు చెప్పు
వినూత్నంగా మనోరంజకంగా
ఆలోచింపజేసేలా, కనువిప్పు కలిగేలా
నలుగురికి పనికొచ్చేది సంలిఖించు
కలకాలం నిలిచేలా విస్తరించు
యుగయుగాలు పలికేలా విలిఖించు
భావి తరాలకు జరుగుతున్న
నేటి పరిస్థితులు తెలిసేలా
కళ్లకు కట్టినట్లు దృశ్యమాలికలా
సత్యం ఎలుగెత్తేలా ఆలిఖించు

సీతా రామ రాజు సనపల

# పారిశుద్ధ్య కార్మికులను ఆదుకుంటాం...

**వారికి మెరుగైన వైద్య సదుపాయం అందిస్తాం...**
**కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి జువ్వాడి నర్సింగరావు**

కోరుట్ల నవంబర్ 07 (వుదయం ప్రతినిధి) విధుల్లో ఉన్న సమయంలో ప్రమాదవశాత్తు గాయపడిన మున్సిపల్



పారిశుద్ధ్య కార్మికులను ఆదుకుంటామని క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి జువ్వాడి నర్సింగరావు తెలిపారు కోరుట్ల పట్టణ పాత బస్టాండ్ వద్ద మున్సిపల్ పారిశుద్ధ్య ట్రాక్టర్ ను ఢీకొని ఆరుగురు మున్సిపల్ సిబ్బందికి గాయాలు కాగా పరిస్థితిపై ఆరా తీశారు కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ మున్సిపల్ కమిషనర్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి గాయాల పాలైన పారిశుద్ధ్య సిబ్బందికి మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని సూచించారు కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు విధుల్లో ఉండే పారిశుద్ధ్య కార్మికులు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని సూచించారు నిర్లక్ష్యం చేస్తే అనుకోని ప్రమాదాలు జరుగుతాయని సిబ్బంది అవసరమైన జాగ్రత్తలు పాటించాలని కోరారు

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్.



జగిత్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 07 ( వుదయం )ఇబ్రహీంపట్నం మండలం కేంద్రంలో గోధూర్ గ్రామంలో ఫ్యాక్స్ సెంటర్ మరియు మెట్ పల్లి మండలంలోని ఆత్మా నగర్ గ్రామంలో ఐకెపి సెంటర్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్బంగా ధాన్యం ఎంత మొత్తంలో వస్తుంది, ధాన్యానికి సంబంధించిన తేమ ఏ విధంగా ఉందని కలెక్టర్ పరిశీలించారు. అలాగే ధాన్యాన్ని తీసుకొని దాని మ్యాచర్ ఏ విధంగా ఉంది అని తనిఖీ చేశారు. సంబంధిత ఏఈఓ ను కేంద్రం ఏ విధంగా నడుస్తుంది అని తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని. తేమ వచ్చిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చెయ్యాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో , మెట్ పల్లి ఆర్డిఓ శ్రీనివాస్ ,ఎమ్మార్వో, ఎంపీడివో, జిల్లా పౌర సర ఫరాల అధికారి జితేందర్ రెడ్డి, జిల్లా మేనేజర్ పౌర సరఫరాల అధికారి జితేందర్, డిఆర్డిఓ రఘు వరణ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన.

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి..



పరకాల నవంబర్ 7 (వుదయం ప్రతినిధి): పరకాల వ్యవసాయ మార్కెట్ నందు గురువారం రోజున సిసిఐ ద్వారా ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన కనీసం మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేయుటకు 8% తేమ శాతం కలిగిన పత్తికి రూ 7521 కనీస మద్దతు ధర కల్పిస్తున్నామని తెలిపారు. కావున రైతులు తాము పండించిన పత్తిని 8% తేమ మించకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ కనీసం మద్దతు ధర పొందాలని తెలిపారు. రైతులు దళారులకు పత్తిని విక్రయించకుండా సీసీఐ కొనుగోలు కేంద్రంలోని పత్తిని విక్రయించి, కనీసం మద్దతు ధర పొందాలని కోరారు. సిసిఐ అధికారులు తేమశాతం పేరుతో రైతులకు ఇబ్బందులు పెట్టకుండా కనీస మద్దతు ధర కల్పించాలని, రైతులకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని, అర్హులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని, ఈ విషయంలో రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు రైతులు మార్కెట్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

## అధ్వానంగా బోరు... అధికారులు చూడరు



అనంతగిరి, వుదయం (నవంబర్ 07)అనంతగిరి మండలం పాలవరం గ్రామంలో అయ్యగారు ఇంటి ఎదురుగా హ్యాండ్ బోరు కింది భాగంలో పగిలిపోయి బోరు నుండి బయటికి వచ్చిన మురికి నీరు వర్షపు నీరు బోరులోకి చేరి త్రాగునీరు కలిసితమై ప్రజలకు రకరకాల వ్యాధులు సంభవించే పరిస్థితులు ఉన్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కలిసితమైన త్రాగునీరు తాగాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. అధ్వానంగా ఉన్న హ్యాండ్ బోరు నెలల తరబడి మరమ్మతులు చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు.

# 2024 సం. నకు ఉత్తమ ఓటరు అవగాహన ప్రచార అవార్డుకు నామినేషన్ల ఆహ్వానం

## జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

జగిత్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 07 ( వుదయం ):ప్రజాస్వామ్యంలో ఓటు విలువ, ఓటు హక్కు వినియోగించుకోవడం పై 2024 సంవత్సరంలో ఓటర్లకు అవగాహన పెంపొందించి చైతన్య పరచడానికి కృషి చేసిన ఉత్తమ ప్రచారానికి సంబంధించి, భారత ఎన్నికల సంఘం మీడియా అవార్డులను ప్రకటించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మీడియా హౌస్ ల నుంచి 2024 సం.నకు ఉత్తమ ఓటరు అవగాహన ప్రచార అవార్డుకు నామినేషన్లను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ అవార్డులు నాలుగు విభాగాల్లో ఉన్నాయని, ప్రింట్ మీడియా, టెలివిజన్, రేడియో, ఆన్‌లైన్ సోషల్ మీడియాకు ఒక్కొక్కటి చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. ఓటరు హక్కులపై అవగాహన పెంపొందించడం, ఎలక్షన్ టెక్నాలజీ అంశాలను ప్రచారం చేయడం వంటి అంశాల్లో ప్రాముఖ్యతను చూపిన మీడియా సంస్థలను గుర్తించడం ఈ అవార్డుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ అవార్డులను జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా, 2025 జనవరి 25న అందజేయనున్నట్లు తెలిపారు. ప్రచార నాణ్యత, ఖచ్చితత్వం, ప్రజా పరిజ్ఞానం, ఓటర్లకు సరైన సమాచారాన్ని అందించడం, ప్రత్యేక కథనాలు, చర్చలు వంటి అంశాల ఆధారంగా ఈ అవార్డులను నిర్ణయిస్తారని, ప్రతి విభాగంలో పాల్గొనే సంస్థలు తమ ప్రచారం యొక్క సారాంశం, ప్రచురణ లేదా



ప్రసారం యొక్క వార్త ఇతర సంబంధిత ప్రచార కార్యకలాపాలతో సహా నిజ ప్రతులను సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. డిసెంబర్ 10,2024 లోగా తమ సిఫార్సును రాజేష్ కుమార్ సింగ్, అండర్ సెక్రటరీ (కమ్యూనికేషన్), ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా, నిర్వచన్ సదన్, అశోక రోడ్, న్యూ ఢిల్లీ...110001 చిరునామాకు పంపాలని పేర్కొన్నారు. ఈమెయిల్‌లో media-division@eci.gov.in కు పంపవచ్చని, హిందీ లేదా ఇంగ్లీష్ కాకుండా ఇతర భాషలలో ఉన్నట్లైతే ఆంగ్ల అనువాదం కూడా జతపరచాలని తెలిపారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ( ఈ సి ఐ) ప్రకటించిన 2024 ఉత్తమ ఓటరు అవగాహన ప్రచార అవార్డుకు గాను క్రింద చూపిన నిబంధనలు, షరతులు వర్తిస్తాయని తెలిపారు. ప్రింట్ మీడియా, టెలివిజన్, రేడియో, ఆన్లైన్ సోషల్ మీడియా విభాగాల్లో అవార్డులు అందిస్తారన్నారు. ప్రతి విభాగంలో ఉన్నత ప్రమాణాలు తీసుకున్న ప్రసార సమయం, సామర్థ్యం, ప్రజలపై చూపిన ప్రభావం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారని తెలిపారు. ప్రింట్ మీడియా ప్రచురించిన వ్యాసాల సంఖ్య, ఆర్టికల్స్ ప్రచురించిన ప్రింట్ ఏరియా స్క్వేర్ సెంటిమీటర్లు, పాఠకులలో అవగాహన కల్పించేందుకు చేసిన కార్యక్రమాల సమాచారాన్ని పీడీఎఫ్ సాఫ్ట్ కాపీ%ఓ%వెబ్ అడ్రస్ లింక్ఫుల్ సైజ్ ఫొటో కాపీ, న్యూస్ పేపర్ ప్రింట్ కాపీ,ఆర్టికల్స్ సమర్పించాలని తెలిపారు. టెలివిజన్, రేడియో ఎంట్రీలకు ప్రసారమైన కార్యక్రమం వ్యవధి, ఫ్రీక్వెన్సీ, మొత్తం ప్రసార సమయం వివరాలను సి డి , డి వి డి, లేదా పెన్ డ్రైవ్ ద్వారా సమర్పించాలని తెలిపారు. ఆన్‌లైన్‌సోషల్ మీడియా పోస్ట్‌లు, బ్లాగ్‌లు, ట్వీట్‌లు, లేదా ఇతర సోషల్ మీడియా ప్రచారాల సమీక్షను, మరియు వాటి ప్రభావం వివరాలతో పీడీఎఫ్ సాఫ్ట్ కాపీ,వెబ్ అడ్రస్ లింక్/ ఆన్ లైన్ యాక్టివిటీ వివరాలు సమర్పించాలని సూచించారు. 2024 సంవత్సరం లోనే ప్రసారం, ప్రచురణ లేదా ఆన్‌లైన్‌లో పోస్టు చేయబడాలని ,ఇతర భాషలలో సమర్పించినట్లైతే ఆంగ్ల అనువాదం తప్పనిసరి అని తెలిపారు. ప్రతి ఎంట్రీ కి సంస్థ పేరు, చిరునామా, టెలిఫోన్, ఫ్యాక్స్ నంబర్లు, ఈమెయిల్ ,తదితర పూర్తి వివరాలతో 10 డిసెంబర్ 2024 లోగా పంపాలని పేర్కొన్నారు. ప్రతి ఎంట్రీని ప్రచారం నాణ్యత, సరికొత్త ప్రచార పద్ధతులు, ప్రజలపై సాధించిన ప్రభావం వంటి అంశాల ఆధారంగా ఆమోదిస్తారని తెలిపారు.

# అధికారులు అంకితభావం తో పని చేయాలి

**రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను త్వరితగతిన అందించాలి**
**పెండింగ్లో ఉన్న ఇరిగేషన్, పంచాయతీరాజ్, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలి**
**రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

మహబూబాబాద్ జిల్లా, నవంబర్ 07 వుదయం ప్రతినిధి : అధికారులు అంకితభావంతో పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పాలకుర్తి నియోజకవర్గం, తొర్రూర్ మండల కేంద్రం, మహబూబాబాద్ జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. దంతాలపల్లి మండలం కేంద్రంలోని సహకార శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు, అనంతరం జనగామ, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లు సంబంధిత అధికారులతో కలిసి తొర్రూరులోని మిషన్ భగీరథ అతిథి గృహంలో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ధాన్యం కొనుగోలు సన్న రకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాలను నిర్వహించాలని, సన్న రకాలకు సర్టిపై చేసి కొనుగోళ్లు చేయలన్నారు.

గ్రామీణ ప్రాంతాలలో రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు త్వరగా మంజూరు చేయాలని, పాలకుర్తి పరిధిలోని ఇరిగేషన్ రిజర్వాయర్లు, కెనాల్లు, ఏదైనా మరమ్మతులు ఉంటే వెంటనే చేయాలని కొత్త పనులకు అవసరం ఉన్న చోట ప్రతిపాదనలు పంపాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పంచాయతీరాజ్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం విభాగాలలో పెండింగ్లో ఉన్న పనులు,ను వెంటనే పూర్తి చేయాలని సిసి రోడ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని, మహబూబాబాద్ జనగామ జిల్లా పరిధిలో ఇంటిగ్రేటెడ్ ఉన్నత పాఠశాలల మంజూరుకి స్థల సేకరణ చేసి ప్రతిపాదనలు వెంటనే పంపాలని సంబంధిత కలెక్టర్లను ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో భూ అక్రమణాలను గుర్తించి సంబంధిత వారికి నోటీసులు అందించి చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రెండు



పడకల గదుల నిర్మాణం ఎన్ని సిద్ధంగా ఉన్నాయో గుర్తించి పంపిణీకి సిద్ధం చేయాలని, మిగతా అవసరమైన రెండు పడకల గదులకు నిర్మాణం కు ప్రతిపాదనలు పంపాలని సూచించారు. క్షేత్రస్థాయిలో అన్ని శాఖల అధికారులు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. అధికారులు విధులలో ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదని అలాంటి వారి పై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు అందించే సేవలపై స్థానిక శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్లు సూచనల మేరకు విధులు నిర్వహించాలని, మంత్రి అధికారులకు సూచించారు.

ప్రజలకు విద్యుత్, త్రాగునీరు, విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత అధిక ప్రాధాన్యత కల్పించాలని మంత్రి కలెక్టర్లకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో వరంగల్, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు కడియం కావ్య, పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ విప్ డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ జాటోతు రామచంద్రనాయక్, పాలకుర్తి శాసన సభ్యురాలు హనుమండ్ల యశస్విని రెడ్డి, మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, మహబూబాబాద్ జనగామ జిల్లా కలెక్టర్లు అద్వైత్ కుమార్ సింగ్, రిజ్వాన్ భాషా షేక్, తదితర సంబంధిత శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీ కులగణన సర్వేలో రాష్ట్ర ప్రజలందరూ భాగస్వామ్యం కావాలి

**తండ రాజు గౌడ్**

చెన్నరావు పేట. ,నవంబర్07(వుదయం ప్రతినిధి): జిల్లా బీసీ యువజన సంఘం అధ్యక్షులులి రాష్ట్ర ప్రభుత్వం ఒక చారిత్రాత్మక మైనటువంటి ప్రతిష్టాత్మక మైనటువంటి నిర్ణయం తీసుకొని బీసీ కులగణన చేపడతా ఉంటే బీసీ కులగణను తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ పార్టీలుగా చలామణి అవుతున్నటువంటి బిజెపిపార్టీ, బి ఆర్ఎస్ మద్దతు ఇవ్వకపోగా బీసీ కులగణనను అడ్డుకునే ప్రయత్నం చేస్తా ఉన్నాయి మీకు బీసీల పైన ఇదేనా మీ ప్రేమ మా బీసీ బిడ్డలను మా బీసీ ప్రజలను జెండాలను మోపిచ్చి దండాలు పెట్టించుకొని జేజేలు కొట్టించుకొని ఇవాళ కేంద్రంలో బిజెపి పార్టీ అధికారంలో ఉన్నది అంటే గత తొమ్మిది సంవత్సరాలుగా బిఆర్ఎస్



ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్నదంటే దానికి కారణం మా బీసీలు కాదా మా భుజస్కందాల పైన మీ జెండాలను మోస్తే మా పైన ప్రేమను కనపరచకుండా ఇవాళ బీసీ కులగణను అడ్డుకునే ప్రయత్నం చేస్తా ఉన్నారు సిగ్గు ఉన్నదా అని అడుగుతా ఉన్నాం ఇవాళ రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులగణను చేపడతా ఉంటే గతంలో బి ఆర్ఎస్ పార్టీ చేసినటువంటి కుటుంబ సర్వే ఎక్కడికి పోయింది ఈ ఈ సర్వే అంతా వట్టిదే అని చెప్పి బిజెపి నాయకులు అంట ఉన్నారు బి ఆర్ఎస్ నాయకులు ఏమో బీసీ కులగణనకు సహకరించొద్దని చెప్పి మాట్లాడుతున్నారు. ఇది సరైనటువంటి పద్ధతి కాదు దీన్ని మార్చుకోవాల్సిన అవసరం ఉన్నది లేని పక్షాన బిజెపి ,బిఆర్ఎస్ నాయకులకు తెలియజేస్తా ఉన్నాం గత 30 సంవత్సరాలుగా బీసీ కుల గణన చేపట్టాలని చెప్పి మా బీసీ నాయకులు అందరూ బీసీ నినాదాన్ని భుజస్కందాల పైన వేసుకొని మా బీసీ ప్రజల బ్రతుకులు మారాలని మా బీసీలు రాజకీయంగా ,ఆర్థికంగా, విద్యా వరంగా ,సామాజికపరంగా ఎదగాలని చెప్పి అనేక పోరాటాలకు శ్రీకారం చుట్టినటువంటి వాళ్ళం మాకు పోరాటాలు కొత్త కాదు మా బీసీ సోదరులందరూ కూడా కన్నెర్ర చేస్తే బిడ్డ మీరు రోడ్లమీద కూడా తిరగలేరు ఇప్పటికే మీరు చేసిన తప్పులకు ఈ తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ కూడా సరైన బుద్ధి చెప్పిన మాట వాస్తవం ఇంకా మీకు సిగ్గు లేకుండా మమ్ములను అణిచివేయాలనే ప్రయత్నం చేస్తా ఉన్నారు ఈ వైఖరి మార్చుకోకపోతే రోడ్లమీద తిరగకుండా కూడా తరిమి కొడతామని కూడా హెచ్చరిస్తా ఉన్నాం బీసీల సత్తా ఏందో దమ్మేందో ధైర్యం ఏందో బీసీ కులగణన జరిగిన తర్వాత చూపిస్తాం బిడ్డా మా వాటా ఏందో మాకు రాకుండా ఇన్ని రోజులు చేసింర్రు ఇకపైన మీ ఆటలు కొనసాగవ్ మా బీసీ ప్రజలందరూ ఏకమైతాం మా కండగా నిలిచినటువంటి కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలుస్తాం ఈ కులగణనకు సహకరిస్తున్నటువంటి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారికి ,ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క గారికి మంత్రులకి అందరికీ కూడా తెలంగాణ రాష్ట్ర బీసీ ప్రజల పక్షాన బీసీ విద్యార్థుల పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం అన్నారు

## మోత్కూర్ మార్కెట్ యార్డులో వడ్ల కొనుగోలు వెంటనే ప్రారంభించాలని



యాదాద్రి భువనగిరి / నవంబర్ 07 వుదయం పతినిధి :-మోత్కూర్ మార్కెట్ యార్డులో వడ్ల కొనుగోలు వెంటనే ప్రారంభించాలని భారత రాష్ట్ర సమితి మోత్కూర్ శాఖ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొనతం యాకూబ్ రెడ్డి మండలపార్టీ అధ్యక్షులు పొన్నెబోయిన రమేష్ మాట్లాడుతూ... రైతు ఏడ్చిన రాజ్యం ఎద్దు ఏడ్చిన వ్యవసాయం ముందుకు సాగనట్లే రైతును ఏడిపిస్తున్న కాంగ్రెస్ పతనంగాక తప్పదు అన్నారు. మోత్కూర్ మార్కెట్ యార్డులో 20 రోజుల క్రితం స్థానిక శాసనసభ్యులు వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభించినప్పటికీ ఇప్పటివరకు క్వాంటలు వేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్వాంటాలు వేయక పోవడం వల్ల రైతులు దళారుల చేతుల్లో మోసపోతున్నారని అన్నారు ప్రభుత్వానికి కాంట్రాక్టులు కమిషన్లు తప్ప ప్రజల మీద. ప్రజా సంక్షేమాల మీద సోయి లేదన్నారు. సాగునీరు లేదు. రైతుబంధు లేదు. రైతుబీమాలేదు. కళ్యాణ లక్ష్మిపై తులం బంగారం లేదు. ఏ ఒక్క పథకాన్ని అమలు చేయలేని అసమర్థ ప్రభుత్వం అని అన్నారు. వెంటనే కొనుగోలు ప్రారంభించి అన్నిరకాల వడ్లకు 500 బోనస్ చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

ఈ కార్యక్రమంలో మాజీ మండల రైతుబంధు సమితి అధ్యక్షులు కొండ సోంమల్లు బి ఆర్ఎస్ పార్టీ నాయకులు మర్రి అనిల్ కుమార్ బయని పిచ్చయ్య అన్నందాసు విద్యాసాగర్ పొన్నె బోయిన మచ్చగిరి దండ్ల కిష్టయ్య బద్దం సంజీవరెడ్డి అమరేందర్ తదితరులు పాల్గొన్నారు..

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన వనపర్తి కలెక్టర్

దేవరకద్ర, ,నవంబర్07(వుదయం ప్రతినిధి): ధాన్యం కొనుగోలు ప్రక్రియలో తేమ శాతం పకడ్బందీగా పరిశీలించాలని వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. దేవరకద్ర నియోజకవర్గం మదనాపురం మండలంలోని గోపన్ పేట, ఆత్మకూరు మండలంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలలో తప్పనిసరిగా ఫ్యాన్లు, గన్ని బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని అన్నారు.

## నూతన ఎలక్ట్రిక్ లైన్ షిఫ్టింగ్ పనులు ప్రారంభం

భువనగిరి, ,నవంబర్07(వుదయం ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం రాక తర్వాత భువనగిరికి మహర్దశ వచ్చిందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. నూతన ఎలక్ట్రిక్ లైన్ షిఫ్టింగ్ పనులను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. గత ప్రభుత్వాలు విస్మరించిన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజా ప్రభుత్వంలో నిధులు మంజూరయ్యాయని భువనగిరి సుందరీకరణ ఆధునికరణ విషయంలో రాజీ పడేది లేదని రెండు నెలల్లోగా పనులను పూర్తి చేస్తామని అన్నారు.

## కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

కొడంగల్, ,నవంబర్07(వుదయం ప్రతినిధి): గండీడ్ మండలం జిన్నారం గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ కార్యక్రమంలో జితేందర్ రెడ్డి, పుల్లారెడ్డి, కోటాల చిన్నయ్య, వెన్నచేడ్ గోపాల్, గండీడ్ శ్రీనివాస్ రెడ్డి, ఆశన్న, వెంకట్రామ్ రెడ్డి, జిన్నారం గ్రామ కాంగ్రెస్ నాయకులు యు. రాంచేంద్రయ్య, బాల్ రెడ్డి, ఆశిరెడ్డి తిమ్మారెడ్డి, మహేందర్ వెంకట్రామ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నార

## సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

బాన్సువాడ, ,నవంబర్07(వుదయం ప్రతినిధి): ఆర్మూర్ మండల కేంద్రంలో గ్రామ పంచాయితీ వార్డులో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను కాంగ్రెస్ మండల అధ్యక్షులు ముక్కెర విజయ్, గ్రామ శాఖ అధ్యక్షులు కల్లెం మల్లారెడ్డి కలిసి గురువారం సర్వేలో పాల్గొన్నారు. ఈ సర్వేలో హౌస్ లిస్టింగ్, స్టిక్కరింగ్, కుటుంబ సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

## ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట :ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



జన్నారం,నవంబర్ 7(వుదయం విలేకరి) రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వేద్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం జన్నారం మండలంలోని ధర్మారం గ్రామంలో 20 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న నూతన ప్రైమరీ హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతుందన్నారు. ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శశికళ,తహసిల్దార్ రాజ మనోహర్ రెడ్డి,వైద్యశాఖ అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోళ్లపై నాణ్యత ప్రమాణాలు పాటించాలి : వ్యవసాయ అధికారి



మెదక్, ( 2024 నవంబర్ 07 వుదయం ప్రతినిధి : నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ధాన్యం కొనుగోళు చేయాలని నిజాంపేట మండల వ్యవసాయాధికారి సోమలుంగారెడ్డి అన్నారు. గురువారం రోజున మండల పరిధిలోని నందిగామ, బచ్చురాజ్ పల్లి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యం కొనుగోళ్లపై నిర్వాహకులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఇచ్చే గిట్టుబాటు ధరను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి రాజు, కేంద్రం నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలలో ధాన్యం సేకరణ పక్కాగా జరగాలి



మెదక్, ( 2024 నవంబర్ 07 వుదయం ప్రతినిధి : తూప్రాన్ మండలం రావెల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంబంధిత తాసిల్దార్ తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి ఎలాంటి ఇబ్బందులు రాకుండా మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు. సన్న రకం ధాన్యం క్రింద ఏ రకం ధాన్యాన్ని పరిగణిస్తున్నామనే అంశంపై రైతులకు స్పష్టంగా తెలిసేలా విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. సన్న రకం దాన్యంపై ప్రభుత్వం ప్రకటించిన 500 రూపాయల బోనస్ అర్హులైన ప్రతి రైతుకు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రైతులకు సకాలంలో చెల్లింపులు చేయాలని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు కొనుగోలు ప్రక్రియ సజావుగా, సక్రమంగా చేపట్టాలని, రైతుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని అన్నారు. సన్న రకం, దొడ్డు రకం ధాన్యం కొనుగోలుకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించామని తెలిపారు. సమగ్ర కార్యాచరణ తో ముందుకు పోవాలన్నారు ధాన్యం రవాణాకు కేటాయించిన వాహనాలు ఇతర పనులకు వినియోగించకుండా స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. కొనుగోలు చేసిన వెంటనే ధాన్యం తరలించేలా అవసరమైన వాహనాలు సన్నద్ధం చేశామని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో ఏదైనా ఇబ్బందులు ఉంటే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్రాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నాస్ పరీక్షలను జాగ్రత్తగా గా నిర్వహించాలి

: డి ఈఓ రాజేశ్వర్



కొత్తగూడ నవంబర్ 07(వుదయం ప్రతినిధి ):ప్రభుత్వ పాఠశాలలో 3,6,9 విద్యార్థుల కోసం నిర్వహించే నేషనల్ అచీవ్ మెంట్ సర్వే (నాస్ )పరీక్షలను జిల్లాలో పక్టబందిగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖధికారి రాజేశ్వర్ అన్నారు. కొత్తగూడ మండలంలోని వెలుబెల్లి, పోలారం కేజీబీవీ , ప్రాథమికోన్నత పాఠశాల కొత్తగూడ పాఠశాలలను గురువారం తనిఖీ చేశారు. ఆయా పాఠశాలలో విద్యార్థుల సమర్థ్యాలను పరిశీలించారు. కేజీబీవీ పోలారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల సామర్థ్యలు మెరుగు పడేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అనంతరం నాస్ మాదిరి పరీక్ష పత్రాలను... 6, 9 తరగతులకు వివరించారు. డిసెంబర్ నెల 4న జరిగే నాస్ పరీక్షల్లో ఇప్పుడి నుండే విద్యార్థులను సంసిద్ధులను చేయాలనీ సూచించారు. ఇప్పడి వరకు 3 మాక్ టెస్టలు నిర్వహించారు. రేపు 8న పాఠశాలల్లో నిర్వహించే నాల్గవ నాస్ మాక్ టెస్ట్ చివరిది. కాబట్టి విద్యార్థుల ప్రతిభ పత్రాలను రికార్డులను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏ ఏమోఓ ఆజాద్, ఎం.ఈ. ఓ గుమ్మడి లక్ష్మి నారాయణ, సి. ఆర్పీ ఉపేందర్ పాల్గొన్నారు.

# క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం




గద్వాల నవంబర్ 7 (వుదయం ప్రతినిధి) జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని మాల్డ్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో గురువారం నేషనల్ క్యాన్సర్ అవేర్నెస్ డే సందర్భంగా డిగ్రీ కళాశాల విద్యార్థులకు, జిల్లా ఎన్నిడి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జె సంధ్య కిరణ్ మై క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె క్యాన్సర్ కు సంబంధించిన కొన్ని విషయాలపై అవగాహన కల్పించారు. క్యాన్సర్ అనేది అందరికీ వస్తుందని, తొలిదశలో గుర్తించి ట్రీట్మెంట్ తీసుకుంటే నయం కావచ్చని, మూడవ నాలుగవ స్టేజీలో ఉన్నట్లయితే ప్రాణాంతకమని, అందుకే ప్రతి ఒక్కరూ ఫిజికల్ ఎక్సర్సైజ్, ఇమ్యూనిటీ సిస్టం పెంచుకోవాలని సూచించారు. కాలేజీ ప్రిన్సిపాల్ కలిందర్ భాష, వివిధ ఫ్యాకల్టీ లెక్చరర్స్, క్యాన్సర్లపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్ సి డి ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్యాంసుందర్, డిగ్రీ కాలేజ్ లెక్చరర్స్, డిగ్రీస్టూడెంట్స్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు దేశ సమగ్రతకు కృషి చేయాలి

జుక్కల్, ,నవంబర్07(వుదయం ప్రతినిధి): హర్యానా రాష్ట్రంలోని రివరి జిల్లాలో నిర్వహించిన జాతీయ సమగ్రత శిబిరాన్ని విజయవంతంగా ముగించుకొని వచ్చిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్లను తెలంగాణ యూనివర్సిటీ వీసీ యాదగిరిరావు గురువారం అభినందించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు దేశ సమగ్రతకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రవీందర్ రెడ్డి, పథకాలు సాధించిన వాలంటీర్లు పాల్గొన్నారు.

## నైపుణ్య గణన శిక్షణా కార్యక్రమం




తిరుపతిజిల్లా, చంద్రగిరి,యర్రావారిపాలెం, నవంబర్ 07 (వుదయం ప్రతినిధి) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న నైపుణ్య గణన కార్యక్రమాన్ని పటిష్టంగా చేపట్టాలని ఎంపీడిఓ పేర్కొన్నారు.ఎంపిడీఓ కార్యాలయం లో గురువారం నైపుణ్యాభివృద్ధి కో ఆర్డినేటర్ పిదీప, ఏపీఎం తిరుమలరాజు, ఇఓ పిఆర్డి ఎం వి మాలతి, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయసిబ్బంది తో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపిడిఓ వి. అరుణ మాట్లడుతూ 15 సంవత్సరాలు నుండి 59 సంవత్సరాల వయస్సు మధ్య గల విద్యార్థులు, ఉద్యోగం, అనుభవం, స్వయం ఉపాధి, సొంత వ్యాపారం తదితర అంశాల వివరాల్ని ప్రశ్నావళిలో నిపాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి నైపుణ్య గణన చేపట్టి వారి ఆసక్తికి అనుగుణంగా శిక్షణఇవ్వనున్నట్లు తెలి యజేయాలన్నారు.

## కుల గణన సర్వేను పరిశీలించిన జిల్లా పరిషత్ సీఈవో



మెదక్, ( 2024 నవంబర్ 07 వుదయం ప్రతినిధి : రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామపంచాయతీలో రెండవ రోజు కొనసాగుతున్న కుల గణన సర్వేను మెదక్ జిల్లా పరిషత్ సీఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. కుల గణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో, ఏపీఓ, అధికారులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి యువకుల సాయం



మెదక్, ( 2024 నవంబర్ 07 వుదయం ప్రతినిధి : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బాధిత కుటుంబానికి గ్రామస్థులు 65 వేల రూపాయలు సహాయాన్ని అందజేశారు. నిజాంపేట మండల కేంద్రానికి చెందిన గేరుగంటి శివకుమార్ గత నెల రోజుల క్రితం మరణించగా మృతుని కుటుంబా ఆర్థిక పరిస్థితితులు బాగోలేనందున గ్రామ యువకులు కలిసి గురువారం రోజున 65 వేల రూపాయల సహాయం అందించారు. ఇలానే దాతలు ముందుకు వచ్చి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. కుటుంబానికి సహాయం యువకులకు పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో జీపీ స్వామి, గేరుగంటి బాబు, పంజా బాబు, వడ్ల నాగరాజు, జాల రవి, మాసుల నాగరాజు, పవన్, షాదుల్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయికి ఎంపికైన ముధోల్ విద్యార్థి



ముధోల్, నవంబర్ 7, (వుదయం ప్రతినిధి) ముధోల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయులు అమీర్ ఖుస్రో, పిడి శ్రీనివాస్ తెలిపారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆదిలాబాద్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ లో బుధవారం అండర్ 17 బాలుర రెజ్లింగ్ జోనల్ సెలక్షన్లలో 10వ తరగతి విద్యార్థి అభిషేక్ ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. నవంబర్ 8వ తేదీ హైదరాబాద్ లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలో పాల్గొంటారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ప్రతిభ కనబరిచిన విద్యార్థిని అభినందించారు. రాష్ట్ర స్థాయికి ఎంపికవ్వడం పాఠశాలకు గర్వకారణమని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

# రైతులు కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించాలి.

**బైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్**



ముధోల్, నవంబర్ 7, (వుదయం ప్రతినిధి) రైతుల తమ వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో విక్రయించి లబ్ధి పొందాలని బైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్ పేర్కొన్నారు. గురువారం ముధోల్ మండలంలోని రువ్వి గ్రామంలో వరి కొనుగోలు కేంద్రంను, ముధోల్ పిఏసీఎస్ చైర్మన్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం రైతుల అభివృద్ధి కోసం పనిచేస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా ఏకకాలంలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేశారన్నారు. రైతులు తమ పంట ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో విక్రయిస్తే వారికి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర పొందే అవకాశం ఉంటుందని, రైతులు తమ పంట ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో విక్రయించాలన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో రైతులకు కావలసిన అన్ని వసతులు సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రువ్వి గ్రామ తాజా మాజి సర్పంచ్ లాలాబాయి గౌతమ్, బ్రాహ్మణగావ్ మాజీ సర్పంచ్ రాంరెడ్డి,వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ రాంనాథ్ నాయక్, నాయకులు అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# చేప పిల్లలు విడుదల చేసిన ఎమ్మెల్యే



మెదక్, ( 2024 నవంబర్ 07 వుదయం ప్రతినిధి : గురువారం రాయిన్ పల్లి ప్రాజెక్ట్ రాయిన్ పల్లి గ్రామములో 100 శాతం రాయితీ పై చెప పిల్లల విడుదల కార్యక్రమం మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు చేతుల మీదుగా ప్రారంభించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ మత్స్యశాఖ ఆధ్వర్యంలోఒక లక్ష 13 వేల 672 చేప పిల్లలను 1 లక్ష 80 వేల ఖర్చుతో చేప పిల్లలను విడుదల చేసినట్లు చెప్పారు.మెదక్ జిల్లాలో ఉచిత చేప పిల్లల పంపిణీ 100 శాతం రాయితీతో అందిస్తున్నామని తెలిపారు. మత్స్యకారులకు జీవనోపాధి కల్పించి, వారి జీవితాలలో వెలుగులు నింపాలనేదే ఆశయంగా పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు అండగా ఉంటుందని,మత్స్యకారులకు 5 లక్షల ప్రమాద బీమా చేశామని మత్స్యకారులకు చేపలను అమ్మేందుకు 10 లక్షల విలువ చేసే వాహనాలను 40 శాతం సబ్సిడీ తో అందిస్తున్నట్లుతెలిపారు. అభివృద్ధికి కృషి చేస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 66 లక్షల చేప పిల్లలను దాదాపు 82 చెరువులల్లో ఉచితంగా విడుదల చేయడం జరిగిందన్నారు. మత్స్యకారులకు ఎలాంటి సమస్యలు వచ్చినా తాను అండగా ఉంటానని అన్నారు.చేప పిల్లలను పెంచి, వాటి ఉపాధిని పొందాలన్నారు. ఈ కార్యక్రమంలోజిల్లా ఫిషర్ మెన్ కో ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు మానేగాళ్ళ రాంకిష్టయ్య, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీష్ హనుమంతరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి మల్లేశం, ఎమ్మార్వో లక్ష్మణ్ బాబు, అరి లక్ష్మణ్, మత్స్యశాఖ సిబ్బంది సంతోష్, భరత్, డేవిడ్, మల్లేష్ జయరాం, యాదగిరి, వాజీద్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు పట్టాలన్నింటికీ పంట రుణాలు ఇవ్వాలి.

**తెలంగాణ గ్రామీణ బ్యాంకు ముందు ధర్నా .**



భూపాలపల్లి ,నవంబర్07(వుదయం ప్రతినిధి): టిఆర్ఎస్ పార్టీ మండల విభాగం తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలోరైతు పట్టాలన్నింటికీ బ్యాంకు రుణాలు ఇవ్వాలని మహా ముత్తారం ముఖ్య కూడలి స్థూపం వద్ద నుండి తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వరకు ఆర్ వై ఎఫ్ ఆర్ పట్టాలకు, లావని పట్టాలకు పంట రుణాలు ఇవ్వాలని నినాదాలు చేస్తూ ర్యాలీ చేసి ధర్నా కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది.

తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ కి రిప్రజెంటేషన్ ఇచ్చి వారితో మాట్లాడడం జరిగింది వారు స్పందిస్తూ ఈ బ్యాంకు నిలవాల కంటే అప్పులే ఎక్కువ అయినాయని మా టార్గెట్ మించి అప్పులు పంట రుణాలు ఇచ్చామని ప్రభుత్వం నుంచి మా పై అధికారుల నుంచి ఇక రుణాలు ఇవ్వొద్దని ఆదేశాలు ఉన్నట్టుగా వారు తెలియజేశారు దీనిని బట్టి ప్రభుత్వ ప్రభుత్వ నిర్లక్ష్యం కూడా స్పష్టంగా అర్థమవుతుందని నాయకులు అన్నారు, అదేవిధంగా తెలంగాణ గ్రామీణ బ్యాంకు నుండి ఎమ్మార్వో ఆఫీస్ వద్దకు ర్యాలీగా వెళ్లి ఎమ్మార్వో కి కూడా వినతి పత్రం అందజేయడం జరిగిందని వారు తెలియజేశారు

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహా ముత్తారం మండలంలో ఆర్ వై ఎఫ్ ఆర్ పట్టాలు లావణ్య పట్టాలు పొందినటువంటి రైతులకు పంట రుణాలు ఇవ్వకపోవడం చేత తీవ్ర ఇబ్బందులు పడుతూ ప్రైవేటు వైద్య వ్యాపారస్తులని ఆశ్రయించి చాలా సమస్యల్లో ఇరుక్కుంటున్నారని వారన్నారు ఈ సమస్యపై అనేకమార్లు ప్రభుత్వ అధికారులకు వినతి పత్రాలు అందజేసి ఈ ప్రాంత ఎమ్మెల్యేలు మంత్రులు ఈ సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వానికి తెలియజేసిన పట్టించుకోకుండా తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఇది ఆదివాసి పేదల పట్ల వారి అభివృద్ధి సంక్షేమం పట్ల ఈ ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదు అనేది అర్థమవుతుందని వారన్నారు వెంటనే ఈ సమస్యని పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున రైతులని సమీకరించి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులను ముట్టడించడానికి అయినా వెనకాడ బొమ్మని వారు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మండల విభాగం నాయకులు మార్క రామ గౌడ్ ,రాధారస్వామి, శ్రీపతి సురేష్ జగపతి తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్ తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు తడండ్ల శ్రీను, కుమ్మరి గణేషు, మరియు ఆదివాసి గిరిజన సంఘం నాయకులు మరియు లంబాడి హక్కుల పోరాట సమితి నాయకులు రైతులు పాల్గొన్నారు.

# కుల గణనలో మాదిగలు జాగ్రత్తగా ఉండాలి.

**ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ.**



భూపాలపల్లి ,నవంబర్07(వుదయం ప్రతినిధి): కుల గణనలో మాదిగలు జాగ్రత్తగా ఉండాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు తీర్పు అనంతరం మన తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేపట్టింది అనగా (ఇంటింటి సమగ్ర సర్వే) 8 పేజీలు 75 ప్రశ్నలతో కూడిన ఒక బుక్ లెట్ ను తీసుకొని ఎన్యూమరేటర్ (సర్వే చేసే వ్యక్తి)మన ఇంటికి వస్తారని కావున ప్రతి ఒక్కరూ కులం అనే కాలంలో ఎస్సీఅని ఉపకులము అనే కాలంలో మాదిగ అని తప్పకుండా రాయించాలని అన్నారు.మాదిగ అని కాకుండా హరిజనులము అని చెప్పకూడదని, మన ముందే సర్వే చేసే వ్యక్తి %ాజ% మాదిగ అని రాశాడో లేదో బుక్లెట్ ను ఒకసారి చూడాలని మన ముందు %ాజ% అని రాసి తరువాత వేరే ఉప కులం రాసే ప్రమాదం పొంచి ఉన్నదని కావున ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన విషయం ఇదని,మన యొక్క భవిష్యత్తు, మన పిల్లల భవిష్యత్తు తరతరాల భవిష్యత్తు మారబోయే సువర్ణ అవకాశం ఇదని మన కులము%ఔజరి%ఉపకులము %ళి%మాదిగ%రి%అని తప్పనిసరిగా రాయించాలని ఆయన కోరారు.

# పోలీస్టేషన్కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం భరోసా కల్పించాలి

## మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్




బెల్లంపల్లి, నవంబర్06 (వుదయం ప్రతినిధి) పోలీస్టేషన్కు వచ్చే బాధితుల ఫిర్యాదుల విషయంలో వెంటనే స్పందించి విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్ అన్నారు. బుధవారం సాధారణ తనికల్లో భాగంగా మాదారం పోలీస్టేషన్, తాండూర్ సర్కిల్ కార్యాలయం ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిసిసి పిటిషన్ల రికార్డ్ లను తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరు, నమోదు చేయబడిన కేసులలో ప్లాన్ ఆఫ్ యాక్షన్, ప్రజలతో, ఫిర్యాదుదారులతో ఎలా ప్రవర్తిస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధి బౌగోలిక పరిస్థితులు, లా అండ్ ఆర్డర్ ఇష్యూస్, గ్రామాల్లో ఎలాంటి నేరాలు అధికంగా జరుగుతున్నాయనే తదితర అంశాలను సిఐని అడిగి తెలుసుకున్నారు. అధికారులు సిబ్బంది వివరాలు, వారు చేస్తున్న విధులు, పని తీరు, వారికీ ఏదైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేయాలని ప్రమాదాలు ఎక్కవ జరిగే ప్రదేశాలను బ్లాక్ స్పాట్స్ గా గుర్తించి పోలీసు అధికారులు రెవెన్యూ రవాణా,నేషనల్ హైవే అథారిటీ, గ్రామ పంచాయతీ, రోడ్డు భవన్ ల శాఖ వారి సమన్వయంతో ప్రమాదాలకు గల కారణాలను గుర్తించి, నివారణ చర్యలు చేపట్టాలని అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్స్, సైన్ బోర్డ్స్, రిఫ్లెక్టర్స్, స్టడ్స్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలు, పిర్యాదులు తెలుసుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని,

గంజాయి,మత్తు పదార్థాల, పిడియస్ రైస్, గుడుంబా సరఫరా, విక్రయం, అక్రమ రవాణా, సేవించడం వంటి వాటిపై, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతర నిఘా ఉంచాలని, చట్టం వ్యతిరేకమైన కార్యకలా పాల్పడే వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగే సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, తాండూర్ సిఐ కుమార స్వామి, మాదారం ఎస్ఐ సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం స్వగ్రామంలో నూతన దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

కల్వకుర్తి నవంబర్ 7 (వుద యం ప్రతినిధి ) రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్వగ్రామమైన వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా మూడు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణం చేపట్టిన దేవాలయంలో శివాలయం, ఆంజనేయస్వామి, కాశీ విశ్వేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం మూడు రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు ముఖ్యమంత్రి సోదరుడు ఎ నుముల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో గురువారం నాగర్ కర్నూల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణ , జిల్లా మహాసభ ప్రచార కార్యదర్శి మిరియాల రాజయ్య, వెల్దండ మండల సంఘ అధ్యక్షులు ఉప్పు ఆంజనేయులు లు దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన మహా యాగము, ధ్వజస్తంభ, విగ్రహ జలాధివాసం కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు అనంతరం నిర్వాహకులు ఎనుముల కృష్ణారెడ్డి, జగదీశ్వర్ రెడ్డి లను కలిసి శుభాకాంక్షలు తెలిపారు ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దినందుకు గ్రామస్తులు పెద్ద ఎత్తున వర్షం వ్యక్తం చేస్తున్నారు ఉత్సవాలలో నియోజకవర్గంలోని ఆయా గ్రామాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు భక్తులు విచ్చేస్తున్నారు ప్రతినిత్యం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు



# ధ్రువపత్రాల జారీ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



బెల్లంపల్లి, నవంబర్ 7 (వుదయం ప్రతినిధి)వివిధ రకాల ధ్రువపత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనల మేరకు పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని కన్నెపల్లి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం, ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, మండల ప్రజా పరిషత్, గ్రామపంచాయతీ కార్యాలయాలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం పాఠశాలను సందర్శించి రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ రకాల ధ్రువపత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలు మేరకు పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, ధరణి పోర్టల్ లో అందిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో నాణ్యమైన విద్యార్థి ఎందుకు ప్రభుత్వ చర్యలు తీసుకుంటుందని, ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా విద్యాబోధన చేయడంతో పాటు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువ కలిగిన ఆహారాన్ని అందించాలని, విద్యార్థుల ఆరోగ్య స్థితిగతులను పర్యవేక్షిస్తూ తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల ప్రజా పరిషత్, గ్రామ పంచాయతీల పరిధిలో చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి అర్హత గల ప్రతి లబ్ధిదారునికి సంక్షేమ పథకాల ఫలాలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినిలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపనచేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



రాయపర్తి నవంబర్ 7 (వుదయం ప్రతినిధి): పెర్కవేడు నుండి అన్నారం షరీఫ్ వరకు 7కోట్ల తో రోడ్డు నిర్మాణ పనులను పాలకుర్తి శాసనసభ్యురాలు మామిడాల యశస్విని ఝాన్సీ రెడ్డి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య తో రాష్ట్ర రెవెన్యూ శాఖ పౌరసర సరఫరాల శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వాలను చేయని అభివృద్ధి పనులను నేడు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని లింకు రోడ్స్ నిర్మాణం చేపడుతుందని అన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ రాజ్యంగా అందే సంక్షేమ ఫలాల ఉద్దేశ్యమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని పేర్కొన్నారు. రైతు రుణమాఫీ సకాలంలో మాఫీ చేశామని ధైర్యంగా చెబుతున్న ప్రభుత్వం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తాహసిల్దార్ ఎం శ్రీనివాస్, ఎంపీడీవో జి కిషన్, పి ఆర్ ఏ ఈ కిరణ్ కుమార్, డీఈ లు, ఏఈ లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హమ్యా నాయక్ మండల పార్టీ అధ్యక్షులు ఈదులకంటి రవీందర్ రెడ్డి దేవస్థానం చైర్మన్ కృష్ణమాచార్యులు డైరెక్టర్ పెండ్లి మహేందర్ రెడ్డి, మండల నాయకులు మాచర్ల ప్రభాకర్, సిరికొండ కృష్ణారెడ్డి, రెంటాల గోవర్ధన్ రెడ్డి ఉల్లెంగల యాదగిరి, ఎస్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు గబ్బెట బాబు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు చిర్ర మల్లయ్య, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు ఎండి అప్రోచ్ ఖాన్, యూత్ అధ్యక్షులు ఎండి మహమూద్, మహిళా మండల అధ్యక్షురాలు ఊగ మునిత, కాంట్రాక్టర్ చింతకుంట్ల శ్రీనివాస్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు తీగల సాయిలు మండల ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు దళారులకు పత్తిని విక్రయించి మోసపోవద్దు

## ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి



బెల్లంపల్లి, నవంబర్07 (వుదయం ప్రతినిధి) కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ ) కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన పత్తిని తీసుకువచ్చి మద్దతు ధరను పొందాలని బెల్లంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి అన్నారు. గురువారం తాండూర్ మండలంలోని శ్రీరామ జిన్నింగ్ మిల్ ఫ్యాక్టరీలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఆన్లైన్లో నమోదయినా పత్తి మాత్రమే కొనుగోలు చేస్తారని, రైతులు అధికారులకు సహకరించాలని అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రానికి తేమ తక్కువగా ఉండి, చెత్తా చెదారం లేని నాణ్యత గల పత్తిని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలన్నారు. రైతులు దళారులకు పత్తిని విక్రయించి మోసపోవద్దని తెలిపారు. పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకున్నారని చెప్పారు. అలాగే ఏ కాలంలో రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. అనంతరం ఇద్దరు యువ పత్తి రైతులు ప్రసాద్, రాము లను ఎమ్మెల్యే వినోద్ శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి షాబుద్దీన్, సెక్రటరీ భాస్కర్, తహశీల్దార్ ఇమ్రాన్ ఖాన్ పఠాన్, ఎంపిడిఓ శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గట్టు మురళీధర్ రావు, పార్టీ మండల అధ్యక్షుడు ఎండి ఈసా, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యాక్షుడు సూరం రవీందర్ రెడ్డి, మాజీ ఎంపిపి సిరంగి శంకర్, మాజీ జెడ్పిటిసి బాణయ్య,సీసీఐ అధికారులు పాల్గొన్నారు.

# ఆదివాసీ గూడాల్లో ఉవ్వెత్తున సాగిన గుస్సాడి సంబరం దీపావళి అనంతరం కొలబోడితో ముగిసింది

కాసిపేట నవంబర్ 7 (వుదయం విలేకరి) ఆదివాసీ గూడాల్లో అంగరంగ వైభవంగా సాగిన దండారి పండుగ ముగిసింది పక్షం రోజుల పాటు ఆదివాసీ గూడాల్లో ఉవ్వెత్తున సాగిన గుస్సాడి సంబరం దీపావళి అనంతరం కొలబోడితో ముగింపు చేపట్టారు పదిహేను రోజుల పాటు డప్పుల దరువులు, గజ్జెల మోతలు , గుస్సాడీ నృత్యాలతో దండారి పండుగను ఆదివాసీలు వారి సంప్రదాయపరంగా జరుపుకున్నారు. గిరిజనులు అత్యంత భక్తిశ్రద్ధలతో కొలిచే ఆరాధ్య దేవత 'ఏత్మాసార్ పేన్' పేరిట చేసే ప్రత్యేక పండుగతో ప్రారంభమైన దండారి పండుగ.. దీపాల వెలుగుల్లో అమావాస్య రాత్రిలో కొలబోడి పండుగతో ముగిసింది. ఎటు చూసిన పండుగ వాతవరణంతో ఆదివాసీ గూడాలు గుస్సాడీ నృత్యాలతో స్వాగతం పలికాయి మండలంలోని గిరిజన గ్రామాలలో ఎక్కడ చూసినా తుడుం మోతలు, డప్పుల చప్పుల్లు , గుస్సాడీ నృత్యాల ఆటపాటలు కనువిందు చేశాయి. తరతరాల సంప్రదాయాన్ని తూచ తప్పకుండా ఆదివాసీలు పాటిస్తున్నారు. ఓ వైపు కోలాటాలు, మరోవైపు గోండి పాటల నృత్యాలు, హాస్యనాటికల ప్రదర్శనలు అబ్బురపరిచాయి ఆశ్వీయుజ పౌర్ణమి అనంతరం ప్రారంభమైన ఈ వేడుకలు పక్షం రోజుల పాటు అంగరంగ వైభవంగా సాగి దీపావళి కాంతుల్లో ముగిసాయి మండలంలోని సోనాపూర్ గ్రామపంచాయతీ పరిధి దొడ్డి గూడ దండారి 15 రోజులపాటు ప్రదర్శన చేసి బుధవారం కొలబోడి తో ముగించారు బుధవారం ముగింపులో భాగంగా దండారి కి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు చెల్లించి కొలబోడి చేశారు దొడ్డి గూడ గ్రామ దండారి ప్రారంభించిన అప్పటినుండి మొదట దండేపల్లి మండలంలోని పద్మల్ పూరి కాకో దేవస్థానం వద్ద ప్రదర్శన చేసి అనంతరం మాకులపేట గ్రామంలో తదుపరి సాలెగూడ గ్రామంలో బాదుగూడ గ్రామంలో సోనాపూర్ గ్రామంలో అనంతరం తమ గ్రామంలో ప్రదర్శన చేపట్టి బుధవారం కోలబోడి చేసి ముగింపు చేపట్టారు



# ప్రీ స్కూల్ టీచర్ ట్రైనింగ్ కోర్స్ లకు దరఖాస్తులు ఆహ్వానం ??అడ్మిషన్లకు చివరి తేదీ ఈనెల 13



కోదాడ టౌన్ నవంబర్ 7(వుదయం ) 2024 -25 విద్యా సంవత్సరానికి తెలంగాణ స్టేట్ ఇంటర్మీడియట్ ఒకేషనల్ ఎడ్యుకేషన్ ద్వారా వృత్తి విద్య సర్టిఫికెట్ కోర్సులకు అడ్మిషన్లు జరుగుతున్నట్లు కోదాడ లక్ష్య ఎడ్యుకేషన్ అకాడెమీ కోఆర్డినేటర్ అనంతుల సతీష్ తెలిపారు . ల్యాండ్ సర్వేయర్ (6నెలలు) ,బ్యూటిషన్ (6నెలలు), ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్(12నెలలు) పూర్తి చేసుకోవచ్చని అన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు, విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పదో తరగతి పాసైన వారు, ఆ పై చదివిన వారందరికీ అవకాశం ఉందని తెలిపారు . తెలంగాణ రాష్ట్రంలో ల్యాండ్ సర్వేయర్, బ్యూటిషన్ , ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ కోర్సులకు మంచి భవిష్యత్తు ఉందని తెలిపారు.

ప్రభుత్వ గుర్తింపు పొందిన ఇంటర్మీడియట్ బోర్డు ద్వారా సర్టిఫికెట్లు జారీ చేయనున్నట్లు తెలిపారు.

అడ్మిషన్ల కి ఈ నెల 13 చివరి తేదీ అని మరిన్ని వివరాలకు లక్ష్య డిస్టెన్స్ అకాడమీ నయానగర్ ,కోదాడ ,బ్రిలియంట్ స్కూల్ పక్కన ఫోన్ నంబర్లకు 9542107771 , 7981528312 సంప్రదించాలని కోరారు.

# పీఎం నేషనల్ అప్రెంటిషిప్ మేళా



గద్వాల నవంబర్ 7 (వుదయం ప్రతినిధి) అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్ లో గల ప్రభుత్వ ఐ.టి.ఐ గద్వాల నందు ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళా ఈనెల 11న నిర్వహించడం జరుగుతుందని ఐటిఐ ప్రిన్సిపల్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి అప్రెంటిషిప్ మేళాకు హైద్రాబాద్ నుండి వివిధ కంపెనీలు పాల్గొనడం జరుగుతుందని, ఐటిఐ పాసైన అభ్యర్థులు బాలుర, బాలికలు వివిధ రంగాలలో ఉద్యోగాలు పొందాలంటే కచ్చితంగా అప్రెంటిషిప్ ను చేయాల్సి ఉంటుందని, ఐటిఐ చేసిన ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నరు. అభ్యర్థులు తమ యొక్క ఒరిజినల్ సర్టిఫికెట్స్ మరియు ఒక జిరాక్స్ సెట్ తీసుకొని 11వ తేదీ నాడు ఉదయం 10 గంటలకు గవర్నమెంట్ ఐ.టి.ఐ గద్వాల్ నందు హాజరు కాగలరని నేడు ఒక ప్రకటనలో తెలిపారు. అప్రెంటిషిప్ మేళాకు సంబందించిన మరిన్ని వివరాల కొరకు ఫోన్ నెంబర్లు 9110523925,8341441763 లను సంప్రదించాలన్నారు.

# మూసీ ప్రక్షాళన తో లక్షలాది పేదల జీవన స్థితిగతులను మార్చాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయం

## రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ,యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



నల్లగొండ నవంబర్ 07(వుదయం ప్రతినిధి): మూసీ ప్రక్షాళన ద్వారా లక్షలాది మంది పేదల జీవనస్థితిగతులను మార్చాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి, యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈనెల 8న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మూసీ పాదయాత్రను పురస్కరించుకొని గురువారం ఆయన యాదాద్రి భువనగిరి జిల్లా సంగం వద్ద ఏర్పాట్లను రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో ఉన్న మూసీ నది రానురాను మురికి కూపంగా మారిపోయిందని, గడచిన 42 సంవత్సరాలుగా ఎన్నో ప్రభుత్వాలలో పనిచేసిన అనుభవం తనకుందని, మూసి ప్రక్షాళనకు అన్ని ప్రభుత్వాలు ప్రయత్నించినప్పటికీ అది సాధ్యం కాలేదని, కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇది సాహసోపేతమైన చర్య అని అన్నారు. సాగునీటితో పాటు, తాగునీరు అందించడమే కాకుండా, మూసీ పరివాహక ప్రాంతంలోని లక్షలాది పేద ప్రజల జీవన పరిస్థితులను మార్చేందుకు తమ ప్రభుత్వం మూసీ ప్రక్షాళన చేపట్టనున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఇది కష్టమైనప్పటికీ, ఇబ్బంది అయినప్పటికి ఖచ్చితంగా మూసీ నదిని ప్రక్షాళన చేస్తామని అన్నారు. మూసీ పరివాహక రైతులు, ప్రజలు, కులవృత్తుల ఈతి బాధలను ప్రత్యక్షంగా తెలుసుకొని వారికి మేలు చేసేందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి తన జన్మదినం రోజు మూసి పాదయాత్ర చేపట్టనున్నారని, ఈ కార్యక్రమానికి అందరూ సహకరించి విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు మూసినది లక్షలాది మందికి సాగు, తాగునీరు ఇచ్చిందని, అలాంటిది ఈరోజు మూసి వెంట నడవలేని పరిస్థితి ఉందని, దుర్గంధంతో ఉన్న మూసీ నదిని దుద్ధీకరణ తర్వాత సాగునీటిని, తాగునీటిని అందించాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. మేనిఫెస్టోలో ఈ విషయాలు తాము పొందుపరచనప్పటికి రాష్ట్ర ముఖ్యమంత్రి తన పుట్టినరోజున మూసీ నది వెంట పాదయాత్ర చేసి మూసీని శుద్ధీకరణ చేయడం ద్వారా ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు కృషి చేస్తున్నారని అన్నారు .దీని ద్వారా ఉమ్మడి నల్గొండ జిల్లా తో పాటు, రంగారెడ్డి, హైదరాబాదు జిల్లాల ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని, అందుకే మూసీ నది శాశ్వత పరిష్కారానికి ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం మిషన్ భగీరథ పేరు మీద 50 వేల కోట్ల రూపాయలు, కాళేశ్వరం పేరు మీద లక్షల కోట్ల రూపాయలను ఖర్చు చేసి ఏడు లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసిందని ,కానీ మురికి కూపంగా మారిన మూసీ నది మాత్రం గుర్తుకు రాలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఛామల కిరణ్ కుమార్ రెడ్డి , ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ,ఎం ఎల్ ఏ కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంతరావు, రాచకొండ పోలీస్ కమిషనర్ జి. సుధీర్ బాబు, రెవిన్యూ అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, డిఆర్డిఏ నాగిరెడ్డి, డిపిఓ సునంద రోడ్లు భవనాల శాఖ నల్గొండ జిల్లా పర్యవేక్షక ఇంజనీర్ సత్యనారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# బిజినెస్





# అమెరికాలో ట్రంప్ గెలుపు..

## ట్రంప్‌తో భారత పరిశ్రమకు దెబ్బే..!

న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడిగా డొనాల్ట్ ట్రంప్ ఎన్నిక కానున్న నేపథ్యంలో భారత పరిశ్రమలో ఆందోళన నెలకొంది. అమెరికా కొత్త ప్రభుత్వ తొలి ఎజెండాలో ఆటో మొబైల్స్, వస్త్ర, ఔషధ పరిశ్రమ వస్తువులపై దిగుమతి సుంకాలు భారీగా పెంచే అవకాశం ఉందని తెలుస్తోంది. అదే జరిగితే భారతీయ ఎగుమతిదారులు అధిక కస్టమ్స్ సుంకాలను ఎదుర్కోవలసి ఉంటుందని వాణిజ్య నిపుణులు విశ్లేషిస్తున్నారు. హెచ్-1బి వీసా జారీ నిబంధనలను కూడా ట్రంప్ కఠినతరం చేయవచ్చు. అదే జరిగితే భారతీయ ఐటి సంస్థల ఖర్చులు, వృద్ధిపై ప్రభావం చూపుతుందని నిపుణులు అంటున్నారు. భారత ఐటి ఎగుమతి ఆదాయాల్లో 80 శాతానికి పైగా యుఎస్ నుంచే వస్తున్నాయి. వీసా విధానాలను కఠినతరం చేస్తే ఈ రంగం ఒత్తిడిని ఎదుర్కోనుంది. భారత అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా అమెరికా ఉంది. ఐటి సేవల్లో 190 బిలియన్ డాలర్ల వార్షిక వాణిజ్యం నమోదవుతోంది. చైనా సహా భారత్‌పైనా ట్రంప్ అధిక సుంకాలను వేసే అవకాశాలున్నాయని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (జిటిఆర్ఐ) వ్యవస్థాపకుడు అజరు శ్రీవాస్తవా పేర్కొన్నారు. భారత్ అతిపెద్ద సుంకాల దుర్వినియోగ దేశమని 2020లో ట్రంప్ తీవ్ర విమర్శలు గుప్పించారు. రెండో దఫా గెలుపొందిన ట్రంప్ మరోమారు వాణిజ్య భారాలను మోపే అవకాశం లేకపోలేదన్నారు. "ట్రంప్ ప్రభుత్వ ఫస్ట్ ఎజెండా భారతీయ వస్తువులపై మరింత సుంకాలను మోపవచ్చును. ముఖ్యంగా వాహన రంగం, మద్యం, వస్త్ర, ఔషధ రంగాల భారత ఎగుమతులుకు అడ్డంకులు వేయవచ్చు. టారీఫ్‌లను పెంచడం ద్వారా అమెరికా మార్కెట్‌లో మన ఉత్పత్తులు పోటీ పడలేవు. దీంతో ఆయా కంపెనీల ఆదాయాలు పడిపోనున్నాయి.'' అని శ్రీవాస్తవ విశ్లేషించారు. చైనాపై అమెరికా కఠిన వైఖరి భారతీయ ఎగుమతిదారులకు కొంత ఉపశమనం కలిగించవచ్చన్నారు. అమెరికా-భారత్ దేశాల మధ్య 2022-23లో ద్వైపాక్షిక వాణిజ్యం 129.4 బిలియన్ డాలర్లుగా, 2023-24లో 120 బిలియన్ డాలర్లుగా నమోదయ్యింది.

## రాకెట్ కంటే వేగంగా దూసుకెళ్లిన బిట్ కాయిన్..

అమెరికాలో అధ్యక్ష ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ప్రారంభ ట్రెండ్స్‌లో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ప్రత్యర్థి కమలా హారిస్ కంటే ముందంజలో ఉన్నారు. ట్రంప్ రాక దృష్ట్యా క్రిప్టోకరెన్సీ కూడా పెరుగుతోంది. నేడు బిట్‌కాయిన్‌తో సహా పలు కరెన్సీల ధరలు పెరిగాయి. బిట్‌కాయిన్ దాని అత్యధిక ధరను చేరుకోగా డాడ్జ్‌కాయిన్ 20 శాతం కంటే ఎక్కువ పెరుగుదలను చూసింది. బుధవారం ఉదయం 11 గంటలకు బిట్‌కాయిన్ ధర 8 శాతానికి పైగా పెరిగింది. ఈ పరిస్థితిలో 75 వేల డాలర్లు దాటింది. ఇప్పటి వరకు ఇదే అత్యధిక ధర. రూపాయి లెక్కన చూస్తే రూ.63 లక్షలకు పైమాటే. అమెరికన్ వ్యాపారవేత్త , ప్రపంచంలోని అత్యంత ధనవంతుడు ఎలోన్ మస్క్ ఇష్టమైన క్రిప్టోకరెన్సీ అయిన డాడ్జ్‌కాయిన్ 20శాతం కంటే ఎక్కువ పెరిగి $0.20 (రూ. 17.19)కి చేరుకుంది.అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించడం వల్ల క్రిప్టోకరెన్సీ మార్కెట్ లో భారీ బూమ్ నెలకొంది. బిట్‌కాయిన్ తొలిసారిగా 75,000 డాలర్ల మార్కును దాటింది. క్రిప్టోకరెన్సీ మార్కెట్‌కు (బిట్‌కాయిన్‌పై ఎన్నికల ప్రభావం) ట్రంప్ విధానాలు మరింత అనుకూలంగా ఉన్నాయని బిట్‌కాయిన్ ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. ట్రంప్ అధికారంలోకి వస్తే బిట్ కాయిన్ ధర మరింత పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. డొనాల్డ్ ట్రంప్ తన ఎన్నికల ర్యాలీలలో అమెరికాను క్రిప్టో రాజధానిగా చేయడం గురించి చాలాసార్లు మాట్లాడారు. దీంతో క్రిప్టోకరెన్సీ ఇన్వెస్టర్లను ముఖ్యంగా యువతను ఆకర్షించేందుకు ప్రయత్నించాడు. ట్రంప్‌తో పాటు అతని బలమైన మద్దతుదారు, టెస్లా యజమాని ఎలోన్ మస్క్ కూడా క్రిప్టోకరెన్సీని ఇష్టపడతారు. అమెరికాలో క్రిప్టోకరెన్సీలలో పెట్టుబడి పెట్టే వారి సంఖ్య మొత్తం జనాభాలో దాదాపు 16 శాతం ఉంది. ఇది ఎన్నికల ఫలితాలపై పెద్ద ప్రభావాన్ని చూపిందనే చెప్పాలి. ప్రపంచంలోని



అత్యంత సంపన్న వ్యాపారవేత్తలలో ఒకరైన ఎలోన్ మస్క్ బిట్‌కాయిన్, ఎథెరియం, డాగ్‌కాయిన్, షిబుయిన్‌లను కలిగి ఉన్నారు. మీడియా నివేదికల ప్రకారం.. మస్క్ ప్రపంచంలోనే అతిపెద్ద క్రిప్టోకరెన్సీలో 140 మిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టాడు. ఈ పెట్టుబడి అంతా అతని ఎలక్ట్రిక్ కార్ల తయారీ సంస్థ టెస్లా ద్వారా చేయబడింది. మస్క్ వ్యక్తిగతంగా Ethereum, Dogecoinలో కూడా పెట్టుబడి పెట్టాడు. అయితే, దాని విలువ గురించి సమాచారం తెలియదు.

# రూ.10 వేలు కట్టి యాక్టివా కొనేయచ్చు

భారత మార్కెట్లో స్కూటర్లకు మంచి ప్రజాదరణ ఉంది. ఇప్పుడు మనదేశంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన స్కూటర్ గురించి చెప్పాలంటే అది హెూండా యాక్టివా. ఈ స్కూటర్ ధర అందుబాటులో ఉండటంతోపాటు మంచి మైలేజీని కూడా ఇస్తుంది. మీరు కూడా హెూండా యాక్టివాను కొనుగోలు చేయాలని ప్లాన్ చేస్తుంటే, దాని డౌన్ పేమెంట్, ఈఎంఐ గురించిన వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం.

హెూండా యాక్టివా ఎక్స్ షోరూమ్ ధర రూ.76,684 నుంచి రూ.82,684 మధ్యలో ఉంది. దీని టాప్ మోడల్ ఆన్ రోడ్ ధర గురించి రూ.92,854గా ఉంది. హెూండా యాక్టివా మూడు వేరియంట్లలో అందుబాటులో ఉంది. మీరు రూ. 10,000 డౌన్ పేమెంట్తో హెూండా యాక్టివా బేస్ మోడల్ను కొనుగోలు చేస్తే, బ్యాంక్ లేదా ఫైనాన్స్ కంపెనీ మీకు దాదాపు రూ. 80,000 రుణం ఇస్తుంది. దానిపై మీరు 9.7 శాతం వడ్డీ చెల్లించాలి. మీరు ఐదు సంవత్సరాల కాల పరిమితితో లోన్ తీసుకుంటే మీరు ప్రతి నెలా రూ. 2500 వరకు ఈఎంఐ చెల్లించాల్సి ఉంటుంది. మీరు 5 సంవత్సరాలలో బ్యాంకుకు మొత్తం రూ.92,900 చెల్లిస్తారు. హెూండా ఈ స్కూటర్లో 109.51 సీసీ ఇంజన్ను అందించింది. ఈ ఇంజన్ గరిష్టంగా 7.79 పీఎస్ శక్తిని, 8.84 ఎన్ఎం పీక్ టార్కును జనరేట్ చేస్తుంది. ఇది కాకుండా కంపెనీ తెలుపుతున్న దాని ప్రకారం ఈ స్కూటర్ 50 కిలోమీటర్ల వరకు మైలేజీని కూడా అందిస్తుంది. అదే సమయంలో ఇందులో డ్రమ్ బ్రేక్స్ అందించారు. ఈ స్కూటర్ బరు



వు దాదాపు 109 కిలోలుగా ఉంది. ఈ స్కూటర్లో అనలాగ్ స్పీడోమీటర్, ఓడోమీటర్, ప్యాసింజర్ ఫుట్రెస్ట్, ఈఎస్పీ టెక్నాలజీ, షట్టర్ లాక్ ఉన్నాయి. అలాగే ఈ స్కూటర్లో 5.3 లీటర్ల పెద్ద ఫ్యూయల్ ట్యాంక్ ఉంది. మార్కెట్లో ఈ స్కూటర్ టీవీఎస్ జూపిటర్, సుజుకి యాక్సెస్ 125 వంటి స్కూటర్లకు ప్రత్యక్షంగా పోటీని ఇస్తుంది.

## భారత్‌లో కైలాక్ కాంపాక్ట్ ఎస్‌యూవీ లాంచ్ చేసిన స్కోడా



స్కోడా, కాంపాక్ట్ ఎస్‌యూవీని ఈ రోజు భారత్‌లో లాంచ్ చేసింది, దీని ప్రారంభ ధర రూ.7.89 లక్షలు. బుకింగ్‌లు డిసెంబర్ 2న ప్రారంభమవుతాయి. డెలివరీలు 2024, జనవరి 27 నుంచి మొదలవుతాయి. స్కోడా కైలాక్‌ను భారత మార్కెట్‌లో కీలక ప్లేయర్‌గా మార్చాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. కైలాక్.. మార్కెట్లో హ్యుందాయ్ వెన్యూ, టాటా నెక్సాన్, మారుతీ బ్రెజా, మహీంద్రా 3%ఖూ% వంటి కార్లతో పోటి పడనుంది. కైలాక్ లోపల భాగంలో యాపిల్ కార్‌ప్లే, ఆండ్రాయిడ్ ఆటోకు సపోర్ట్‌గా 10 అంగుళాల టచ్‌స్క్రీన్ అమర్చి ఉన్నాయి. ఈ ఎస్‌యూవీలో డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, వెనుక ఏసీ వెంట్‌లు, సింగిల్ పేన్ సన్‌రూఫ్ కూడా ఉన్నాయి. ఇతర సౌకర్యవంతమైన ఫీచర్లలో..కీలెస్ ఎంట్రీ, వైర్‌లెస్ ఫోన్ ఛార్జింగ్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు ఉన్నాయి. భద్రతాపరంగా కైలాక్ అన్ని వేరియంట్లలో సమగ్రమైన ఫీచర్లతో వస్తుంది. వీటిలో ఆరు ఎయిర్ బ్యాగ్‌లు, ఈబీడీతో కూడిన ఏబీఎస్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, ట్రాక్షన్ కంట్రోల్, ప్రయాణీకులందరికీ 3-పాయింట్ సీట్ బెల్ట్‌లు ఉన్నాయి. కైలాక్ 1.0-లీటర్, 3-సిలిండర్ టర్బోఛార్జ్డ్ పెట్రోల్ ఇంజిన్‌తో వస్తుంది. స్కోడాకు భారత్ కీలకమైన మార్కెట్. ఈ బ్రాండ్‌కు సంబంధించి 50% ఉత్పత్తులు చెక్ రిపబ్లిక్ వెలుపల జరుగుతున్నాయి. భారత్‌లో 2026 నాటికి ఏడాదికి ఒక లక్ష కార్లను విక్రయించాలని స్కోడా లక్ష్యంగా పెట్టుకుంది.

# లాభాలను తెచ్చిపెట్టే బెస్ట్ స్టాక్‌లు!

మ్యూచువల్ ఫండ్స్ లో కూడా పెట్టుబడులు పెడుతున్నారు. అయితే స్టాక్ మార్కెట్ లోకి వచ్చే వారికి వివిధ కంపెనీల స్టాక్ లపై కనీస అవగాహన అవసరం. కొందరు విశ్లేషకులు తాజ్గాగా అందుబాటులో ఉన్న కొన్ని స్టాక్ లను సిఫారసు చేస్తున్నారు. వాటి రాబడిని కూడా అంచనా వేసి చెబుతున్నారు. ఆ ప్రకారం.. 16 శాతం నుంచి 29 శాతం మధ్య రాబడినిచ్చే స్టాక్‌ల వివరాలు. డాబర్: ఈ సంస్థ స్టాక్ లకు నోమురా సంస్థ బ్రోకరేజ్ చేస్తోంది. డాబర్ స్టాక్ ధర ప్రస్తుతం రూ.543 ఉంది. భవిష్యత్తులో రూ. 650 పెరుగుతుందని ఆశిస్తున్నారు. ప్రస్తుతం ధర తక్కువగా ఉండడం వల్ల కొనుగోలుకు అనుకూలంగా ఉంటుంది. రిస్క్ తో పాటు రివార్డుకు అవకాశం ఉంది. డాబర్ లిమిటెల్ అనేది భారతీయ బహుళజాతి కన్స్యూమర్ గూడ్స్ కంపెనీ. ఈ సంస్థను ఎస్కే బర్మన్ స్థాపించారు. దీని ప్రధాన కార్యాలయంలో ఘజియాబాద్ లో ఉంది. ఆయుర్వేద వైద్యం, వినియోగదారుల ఉత్పత్తులను తయారు చేస్తుంది. దేశంలోని అతి పెద్ద మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ కంపెనీల్లో ఇది ఒకటి. ఆదిత్య బిర్లా క్యాపిటల్: ఇన్వెస్టిక్ బ్రోకరేజ్ సంస్థ ద్వారా ఈ కంపెనీ స్టాక్ ల లావాదేవీలు జరపొచ్చు. ప్రస్తుతం స్టాక్ ధర రూ.206 కాగా.. రాబోయే రోజుల్లో రూ.265కి పైగా పెరిగే అవకాశం ఉంది. మూడు సంవత్సరాల్లో స్థిరమైన ఆదాయ వృద్ధి సాధిస్తుందని భావిస్తున్నారు. ఆదిత్య బిర్లా క్యాపిటల్ లిమిటెడ్ (ఏబీసీఎల్)కు చెందిన అనుబంధ సంస్థలు రక్షణ, పెట్టుబడి, ఫైనాన్సింగ్ రంగాలలో బలమైన ఉనికిని కలిగి ఉన్నాయి. వీటికి దేశవ్యాప్తంగా 1048 శాఖలు ఉన్నాయి. ప్రెస్టీజ్ ఎస్టేట్: ప్రెస్టీజ్ ఎస్టేట్ కు చెందిన స్టాక్ లు కూడా మంచి రాబడిని ఇస్తాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. జేపీ మోర్గాన్ బ్రోకరేజ్ సంస్థ ఈ స్టాక్ లావాదేవీలు నిర్వహిస్తోంది. ప్రెస్టీజ్ ఎస్టేట్ స్టాక్ ధర (సీఎంపీ) రూ.1638 ఉంది. ఈ ధర రూ.1900కు పెరుగుతుందని భావిస్తున్నారు. ప్రెస్టీజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్ దేశంలోని 12 కంటే ఎక్కువ ప్రాంతాలలో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. రిటైల్, హాస్పిటాలిటీ, ప్రాపర్టీ మేనేజ్ మెంట్, వేర్ హౌస్ తదితర రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. నైకా: జెఫిరీస్ బ్రోకరేజ్ సంస్థ ద్వారా వీటిని కొనుగోలు చేసుకోవచ్చు. నైకా కంపెనీ స్టాక్ ధర ప్రస్తుతం రూ.184.15గా ఉంది. భవిష్యత్తులో రూ.220కి చేరవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. బ్యూటీ, వ్యక్తిగత ఉత్పత్తులపై దృష్టి పెట్టడం వల్ల స్టాక్ లు ఊపందుకుంటాయని భావిస్తున్నారు.

ముంబై కేంద్రంగా నైకా కంపెనీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. వెబ్ సైట్, మొబైల్ యాప్, దేశంలోని దాదాపు 100 దుకాణాల ద్వారా బ్యూటీ, వెల్నెస్, ఫ్యాషన్ ప్రోడక్టులు విక్రయిస్తోంది.



# నష్టాల్లో ట్రేడవుతున్న స్టాక్ మార్కెట్లు..

## 24,400 దిగువకు నిఫ్టీ

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం నష్టాల బాట పట్టాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించడంతో నిన్నటి ట్రేడింగ్ సెషన్‌లో దూసుకెళ్లిన సూచీలు నేడు ఒత్తిడికి గురవుతున్నాయి. మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో నేటి ట్రేడింగ్‌లో సూచీలు నష్టాల్లో సాగుతున్నాయి. ఉదయం 9:30 గంటల సమయంలో సెన్సెక్స్ 375 పాయింట్లు కుంగి 80,003 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 130 పాయింట్లు తగ్గి 24,353 వద్ద కొనసాగుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 5పైసలు పెరిగి 84.26 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్ 30 సూచీలో పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫిన్‌సర్వ్, నెస్లే ఇండియా, ఎస్‌బీఐ, ఎం అండ్ ఎం, మారుతీ సుజుకీ, టైటాన్, టాటా మోటార్స్ షేర్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి. టాటా స్టీల్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, భారతీ ఎయిర్‌టెల్, టెక్ మహీంద్రా షేర్లు మాత్రమే లాభాల్లో కొనసాగుతున్నాయి.



అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 75.47 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్సు 2,664.70 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అమెరికా మార్కెట్లు బుధవారం లాభాలతో ముగిశాయి. ఆసియా-పసిఫిక్ మార్కెట్లు నేడు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి. ఆస్ట్రేలియా ఏఎస్ఎక్స్ 0.05శాతం, షాంగై 0.76శాతం, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ సూచీ 0.71శాతం మేర లాభాల్లో ట్రేడవుతున్నాయి. జపాన్ నిక్కీ 0.41శాతం నష్టంతో ట్రేడవుతోంది. అక్టోబర్‌లో పెద్దఎత్తున విక్రయాలకు దిగిన విదేశీ సంస్థాగత మదుపర్లు నవంబర్ నెలలోనూ అదే బాటలో పయనిస్తున్నారు. బుధవారం నికరంగా రూ.4,446 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించారు. అదే సమయంలో దేశీయ సంస్థాగత మదుపర్లు నికరంగా రూ.4,889 కోట్ల షేర్లను కొనుగోలు చేశారు.

# జాతీయం – అంతర్జాతీయం

## దేశ ప్రజలపై మోడీ సర్కార్‌కు ఆసక్తి లేదు



న్యూఢిల్లీ : దేశంలోని సొంత ప్రజలపై మోడీ సర్కార్‌కు ఆసక్తి లేదని, ఎంతసేపూ కార్పొరేట్లు, బహుళజాతి సంస్థల సేవలోనే ఉన్నారని ప్రముఖ ఆర్థిక వేత్త, ప్రొఫెసర్ ఉత్స పట్నాయక్ అన్నారు. బుధవారం నాడిక్కడ హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో పుచ్చలపల్లి సుందరయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పి.సుందరయ్య రెండో స్మారకోపన్యాసం జరిగింది. ప్రొఫెసర్ ఉత్సా పట్నాయక్ స్మారకోపన్యాసం చేశారు. మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాల వెనుక అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల ప్రయోజనాలే ఉన్నాయని పేర్కొన్నారు. తమ పౌరులకు ఆహార భద్రత కల్పించే హక్కును భారతదేశం వంటి దేశాలకు అభివృద్ధి చెందిన దేశాలు నిరాకరించడానికి ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాల్లో వ్యవసాయాన్ని వైవిధ్యపరిచే అవకాశం లేని, భారతదేశంలో, ఇతర ప్రాంతాలలో తమకు అవసరమైన పంటలను ఉత్పత్తి చేసి లాభాలు పొందాలని ప్రయత్నిస్తున్నాయని పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం తన సొంత ప్రజలను రక్షించడానికి ఆసక్తి చూపలేదని, అభివృద్ధి చెందిన దేశాలు, కార్పొరేట్ల ఒత్తిడికి లొంగిపోయిందని అన్నారు. రైతుల తీవ్ర ప్రతిఘటన ఫలితంగా మోడీ ప్రభుత్వం వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకోవాల్సి వచ్చిందని, కానీ అభివృద్ధి చెందిన దేశాలు, బహుళజాతి సంస్థలకు మింగుడు పడటం లేదని పేర్కొన్నారు. వారు భారతదేశ వ్యవసాయం, వ్యవసాయ మార్కెట్లను వివిధ మార్గాల్లో స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారని వివరించారు. ఇందుకోసం ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఓ)ను ప్రయోగిస్తున్నారని, నయా ఉదారవాద ఆర్థిక విధానాలు భారతదేశ ప్రజల పోషకాహార స్థితిని ప్రతికూలంగా ప్రభావితం చేశాయని అన్నారు.

## హాటెస్ట్ ఇయర్ 2024!

2024ను ప్రపంచ అత్యంత వేడి సంవత్సరం(హాటెస్ట్ ఇయర్) అవుతుందని యూరోపియన్ యూనియన్ యొక్క కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్ (సి3ఎస్) గురువారం తెలిపింది. జనవరి నుండి అక్టోబర్ వరకు సగటు ప్రపంచ ఉష్ణోగ్రత రికార్డు స్థాయిలో ఉండటంతో ఈ విధంగా పేర్కొంది. ఈ రికార్డుకు కారణం వాతావరణ మార్పులేనని సి3ఎస్ డైరెక్టర్ కార్లో బ్యూంటెంపో రాయిటర్స్‌తో అన్నారు. అజర్‌బైజాన్‌లో వచ్చే వారం యుఎన్ కాప్–29 వాతావరణ శిఖరాగ్ర సమావేశానికి ముందు ఈ డేటా విడుదల చేయబడింది. వాతావరణ మార్పులను పరిష్కరించడానికి దేశాలు నిధులలో భారీ పెరుగుదలను అంగీకరించడానికి ప్రయత్నిస్తాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించడంతో చర్చలపై అంచనాలు తారుమారయ్యాయి. వాతావరణం సాధారణంగా వేడెక్కుతోంది. అన్ని ఖండాలలో, అన్ని సముద్ర బేసిన్‌లలో వేడెక్కుతోందన్నారు. గ్లోబల్ వార్మింగ్‌కు ప్రధాన కారణం బొగ్గు, చమురు మరియు వాయువు నుండి వెలువడే కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు.



## ముల్లా ఉమర్ కుమారుడితో భారత విదేశాంగ శాఖ ఉన్నతాధికారి భేటీ

అఫ్ఘనిస్తాన్‌ను పాలిస్తున్న తాలిబన్లతో భారత్ సంబంధాల వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. అఫ్ఘనిస్తాన్ రక్షణ శాఖ మంత్రి ముల్లా మహ్మద్ యాకుబ్‌తో భారత విదేశాంగ శాఖ జాయింట్ సెక్రెటరీ (పాకిస్తాన్– అఫ్ఘనిస్తాన్– ఇరాన్ డివిజన్) జేపీ సింగ్ తొలిసారిగా బుధవారం భేటీ అయ్యారు. ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై ఈసందర్భంగా చర్చించారు. తాలిబన్ సుప్రీం నేత ముల్లా ఉమర్ కుమారుడే ముల్లా మహ్మద్ యాకుబ్. అఫ్ఘనిస్తాన్ విదేశాంగ మంత్రి అమీర్ ఖాన్ ముత్తఖీ, అఫ్ఘనిస్తాన్ మాజీ అధ్యక్షుడు హమీద్ కర్జాయ్‌లతోనూ జేపీ సింగ్ వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సమావేశాలపై భారత విదేశాంగ శాఖ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అఫ్ఘనిస్తాన్ రక్షణ శాఖ మాత్రం ఈ సమావేశాల వివరాలను ట్విట్టర్ వేదికగా వెల్లడించింది. మానవతా సాయం, వివిధ రంగాల్లో ఇరుదేశాల పరస్పర సహకారం వంటి అంశాలపై ఈ భేటీలో చర్చ జరిగిందని తెలిపింది. కాగా, అఫ్ఘనిస్తాన్‌లోని తాలిబన్ ప్రభుత్వాన్ని ఇంకా భారత్ అధికారికంగా గుర్తించలేదు.

## ప్రత్యేక హోదా పునరుద్ధరించండి



శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌కు ప్రత్యేక హోదాను పునరుద్ధరించాలని కోరుతూ జమ్మూకాశ్మీర్ శాసనసభ బుధవారం ఓ తీర్మానాన్ని ఆమోదించింది. బిజెపి శాసన సభ్యులు దీనిని వ్యతిరేకించారు. అసెంబ్లీలో రచ్చకు యత్నించారు. రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోరుతూ నేషనల్ కాన్ఫరెన్స్ నాయకులు, ఉప ముఖ్యమంత్రి సురీందర్ కుమార్ చౌదరి శాసనసభలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెడుతూ ఆర్టికల్ 370 హామీ ఇచ్చిన ప్రత్యేక హోదా పునరుద్ధరించాలని ఈ సభ కోరుతోంది అన్నారు. జమ్మూకాశ్మీర్ ప్రజల గుర్తింపు, సంస్కృతి,
హక్కులను పరిరక్షణకు ఇది అవసరం, దీనిని కేంద్రం గతంలో ఏకపక్షంగా తొలగించడంపై ఈ సభ ఆందోళన వ్యక్తం చేస్తోంది' అని ఆ తీర్మానంలో తెలియ జేశారు. ప్రత్యేక హోదా, రాజ్యాంగ గ్యారంటీల పునరు ద్ధరణ కోసం జమ్మూకాశ్మీర్ ప్రజా ప్రతినిధులతో సంప్ర దింపులు ప్రారంభించాలని, రాజ్యాంగ వ్యవస్థలపై దృష్టి సారించాలని ఆ తీర్మానంలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర హోదా పునరుద్ధరణకు చేపట్టే ఏ ప్రక్రియ అయినా దేశ ఐక్యతను, జమ్మూకాశ్మీర్ ప్రజల చట్టబద్ధమైన ఆకాంక్షలను పరిరక్షించాలని తెలిపారు. ఈ తీర్మానాన్ని ఎన్‌సి నాయకులు, ఆరోగ్య మంత్రి సకీనా టూ బలపర్చారు. స్పీకర్ అబ్దుల్ రహీమ్ రాథర్ ఈ తీర్మానాన్ని ఓటింగ్ కోసం ఉంచారు. మెజార్టీ సభ్యులు దీన్ని ఆమోదించారు. ఎన్‌సితోపాటు, పిడిపి, ఎఐపి, జమ్ముకాశ్మీర్ పీపుల్స్ కాన్ఫరెన్స్ చీఫ్ సజాద్ లోన్, స్వతంత్ర సభ్యులు షబీర్ కుల్లారు తీర్మానికి మద్దతు పలికారు. అయితే ఈ తీర్మానంపై బిజెపి ఎమ్మె ల్యేలు రెచ్చిపోయారు. సభ ఆమోదించినా తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. వెల్‌లోకి దూసుకెళ్లారు. దీంతో సభను స్పీకర్ 15 నిమిషాల పాటు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైన తరువాత కూడా బిజెపి సభ్యులు గలభా సృష్టించడంతో సభను రేపటికి వాయిదా వేశారు. జమ్మూకాశ్మీర్ శాసనసభకు పదేళ్ల విరామం తర్వాత ఇటీవలే ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. ఈ ఎన్నికలు తర్వాత అసెంబ్లీ సమావేశం కావడం ఇదే మొదటిసారి.

## టెక్సాస్ 19వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్‌లో జోడీ అరింగ్టన్ విజయం..



రిపబ్లికన్ పార్టీ సభ్యుడు, టెక్సాస్ 19వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నాయకుడు జోడీ అరింగ్టన్ గురించి దేశం మొత్తం పరిచయం అవసరం లేదు. తను నాయకత్వం వహించిన ప్రాంతం నుంచి ఎన్నికవుతూనే ఉన్నారు. దాదాపు చాలా సంవత్సరాలు ఈ ప్రాంతానికి నాయకత్వం వహించారు. జార్జి డబ్ల్యూ బుష్ గవన్నటోరియల్, ప్రెసిడెన్షియల్ అడ్మని స్ట్రేషన్ లో సభ్యుడిగా కూడా కొనసాగారు. జీన్–బెట్టీ అరింగ్టన్ కుమారుడు అరింగ్టన్. ప్లెయిన్ వ్యూలో పెరిగాడు. 2000 లో బుష్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ప్రెసిడెంట్ కు స్పెషల్ అసిస్టెంట్, అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ ప్రెసిడెన్షియల్ పర్సనల్ గా చేశారు. 2014లో టెక్సాస్ స్టేట్ సెనేట్ డిస్ట్రిక్ట్ 28 కు ప్రత్యేక ఎన్నికల్లో ఓటమి పాలయ్యాడు. ఆ తర్వాత గెలుస్తూ వచ్చారు. 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో లిబర్టేరియన్ అభ్యర్థి బెర్నార్డ్ జాన్సన్, ఇండిపెండెంట్ అభ్యర్థి నాథన్ లూయిస్ పై జోడీ అరింగ్టన్ విజయం సాధించారు. టెక్సాస్ లోని 19వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి ఐదోసారి ఎన్నికయ్యారు. ఆయన మాట్లాడుతూ 'మీకు సేవ చేయడం, వెస్ట్ టెక్సాస్ విలువల కోసం పోరాడడం జీవితకాల గౌరవం' అని చైర్మన్ అరింగ్టన్ అన్నారు. 'సంవత్సరాలుగా మీరు ఇస్తున్న మద్దతుకు ధన్యవాదాలు – మేము ప్రతిరోజూ మీ ఆశీస్సులను కోరుకుంటాం. 'నేను అడిగిన దానికన్నా, ఊహి0చగలిగిన దానికన్నా దేవుడు నాకు ఎక్కువగా, సరిపోయేంతగా ఇచ్చాడు' అన్నారు. 'నేను ఇక్కడే ఉండాలని ఆయన కోరుకుంటున్నారని నూటికి నూరు శాతం నమ్మకంతో చెప్పగలను. ఆయన అనుగ్రహం అడుగడుగునా నాపై ఉంటుంది. ఎన్ని లోటు పాట్లు ఉన్నా భగవంతుడు మనకు విజయాలను అందిస్తూనే ఉన్నాడు. సరిహద్దును సురక్షితంగా ఉంచడానికి, వాషింగ్టన్ నిర్లక్ష్యపు ఖర్చులను నియంత్రించడానికి, అధికారాన్ని తిరిగి 'వీ ద పీపుల్'కు తిరిగి ఇవ్వడానికి మా పోరాటాన్ని కొనసాగించడానికి నేను ఎదురుచూస్తున్నాను అన్నారు.



## ఎల్ఎంవి లైసెన్స్ ఉన్నవారు లైట్ ట్రాన్స్ పోర్ట్ వెహికల్ నడపొచ్చు

న్యూఢిల్లీ : లైట్ మోటర్ వెహికల్స్ (ఎల్ఎంవి) డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నవారు లైట్ ట్రాన్స్ పోర్ట్ వెహికల్ (7,500 కిలోల కంటే తక్కువున్న) వాహనాలు నడపొచ్చని సుప్రీంకోర్టు మరోసారి తేల్చి చెప్పింది. ఎల్ఎంవి లైసెన్స్ హౌల్డర్లు లైట్ ట్రాన్స్ పోర్ట్ వెహికల్ నడిపడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరిగినట్లు ఎలాంటి డేటా లేదని పేర్కొంది. అందువల్ల గతంలో ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు సుప్రీంకోర్టు ఆదేశాల్లో పేర్కొంది. 2017 లో ముకుంద్ దేవాంగన్ వర్సెస్ ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ కేసులో ఎల్ఎంవి లైసెన్స్ హౌల్డర్లు లైట్ టాన్స్ పోర్ట్ వెహికల్ నడిపేందుకు సుప్రీంకోర్టు అనుమతించింది. ఈ తీర్పున పున: సమీక్షించాలని పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ హృషికేష్ రారు, జస్టిస్ పిఎస్ నరసింహ, జస్టిస్ పంకజ్ మిథాల్, జస్టిస్ మనోశ్ మిశ్రాలతో కూడిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం బుధవారం తీర్పు వెలువరించింది. ధర్మాసనం తరపున జస్టిస్ హృషికేశ్ రారు 126 పేజీల తీర్పును వెలువరించారు. ప్రధానంగా మోటర్ వెహికల్ (ఎంవి) యాక్ట్ లోని పలు అంశాలను ప్రస్తావిస్తు నాలుగు ప్రధాన అంశాలను పొందుపరిచారు.

## కోర్టుల్లో మీ శక్తిని వృథా చేసుకోవద్దు

న్యూఢిల్లీ : ఎన్నికల గుర్తు 'గడియారం' కోసం న్యాయ పోరాటానికి దిగిన ఎన్సీపీ వైరి వర్గాలకు సుప్రీంకోర్టు హితోపదేశం చేసింది. కోర్టుల్లో శక్తిని వృథా చేసుకోవద్దని, ఓటర్ల మనసు గెలవడంపై దృష్టి సారించాలని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ధర్మాసనం సూచించింది. గడియారం గుర్తును, ఎన్సీపీ వ్యవస్థాపకుడు శరద్ పవార్ పేరును అజిత్ పవార్ వర్గం దుర్వినియోగం చేస్తోందని, దానిని నివారించాలని కోరుతూ శరద్ పవార్ వర్గం దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా ధర్మాసనం అజిత్ పవార్ వర్గానికి కీలక ఆదేశాలు జారీ చేసింది. గడియారం గుర్తు వివాదం కోర్టులో పెండింగ్‌లో ఉందన్న విషయాన్ని మరాఠీ పత్రికలతో సహా వివిధ వార్తా పత్రికల్లోనూ డిస్‌క్లైమర్‌గా ప్రచురించాలని తెలిపింది. కోర్టు ఉత్తర్వు వెలువడిన 36 గంటల్లోగా దీనిని అమలు చేయాలని స్పష్టం చేసింది. అంతకుముందు శరద్ పవార్ వర్గం తరఫున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి....గడియారం గుర్తు వివాదం కోర్టులో పెండింగ్ ఉందన్న విషయాన్ని అజిత్ పవార్ వర్గం వారి కరపత్రాలు, పోస్టర్లు, ప్రకటనల్లో ప్రచురించడంలేదని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఈ విషయమై మార్చి 19న ఇచ్చిన ఆదేశాలను అజిత్ పవార్ వర్గం ఉల్లంఘించిందని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. గడియారం గుర్తును ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో అజిత్ పవార్ వర్గం వినియోగించకుండా నిరోధించాలన్న విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది.

ఎన్నికల ప్రక్రియ మధ్యలో న్యాయస్థానం జోక్యం చేసుకోవడం తగదని పేర్కొంది. గడియారం గుర్తు డిస్‌క్లైమర్ ప్రచురణ విషయమై ధర్మాసనం ఆదేశాల అమలుపై అజిత్ పవార్ వర్గం హామీ ఇవ్వాలని కోరింది.




## ఇజ్రాయిల్ చట్టాలపై ఫ్రాన్స్ విచారం

పాలస్తీనా శరణార్థుల కోసం యునైటెడ్ నేషన్స్ రిలీఫ్ అండ్ వర్క్స్ ఏజెన్సీ(యు.ఎన్.ఆర్.డబ్ల్యూ.ఏ)ని నిషేధించడానికి ఇజ్రాయిల్ చేసిన రెండు చట్టాలపై ఫ్రాన్స్ విచారం వ్యక్తం చేసింది. ఈ మేరకు యుఎన్ లో ఫ్రాన్స్ శాశ్వత ప్రతినిధి అయిన నికోలస్ డి రివియర్ ప్రకటన చేశారు. ఇజ్రాయిల్ చట్టాల అమలు గాజాలోని మానవతా పరిస్థితిపై తీవ్ర పరిణామాలను కలిగిస్తుందన్నారు. తన అంతర్జాతీయ బాధ్యతలను పాటించాలని ఇజ్రాయిల్‌కు ఫ్రాన్స్ పిలుపునిచ్చిందన్నారు. యు.ఎన్.ఆర్.డబ్ల్యూ.ఏకి ఇజ్రాయిల్ మద్దతును పునరుద్ఘాటిస్తుందని ఫ్రాన్స్ కోరింది. గాజా, ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని పాలస్తీనియన్లకు కీలకమైన మానవతా సేవలను అందించే సంస్థను నిషేధించడానికి ఇజ్రాయిల్ చట్టసభ సభ్యులు ఓటు వేసిన తర్వాత యు.ఎన్.ఆర్.డబ్ల్యూ.ఏతో సంబంధాలను తెంచుకోవాలనే నిర్ణయాన్ని ఇజ్రాయెల్ నవంబర్ 4న యుఎన్ కు అధికారికంగా తెలియజేసింది.

## ఐక్యరాజ్య సమితిలో పాకిస్తాన్ తీరుపై భారత్ విమర్శలు

న్యూయార్క్ : అసత్యాలు, తప్పుడు ప్రచారానికి పాల్పడేందుకు పాక్ ప్రతినిధి బృందం మరోసారి ఐక్యరాజ్య సమితి ఉన్నత వేదికను ఉపయోగించుకుందని భారత్ తీవ్రంగా విమర్శించింది. జమ్మూ కాశ్మీర్ అంశాన్ని పాకిస్తాన్ మరోసారి ఈ వేదికపై లేవనెత్తడంపై భారత్ తీవ్రంగా ప్రతిస్పందించింది. పార్లమెంట్ సభ్యుడు రాజీవ్ శుక్లా మాట్లాడుతూ, పాక్ ప్రతినిధి బృందానికి ఇదొక అలవాటుగా మారిపోయిందని, భారత్ గురించి తప్పుడు, అసత్య సమాచారం వ్యాప్తి చేస్తోందని విమర్శించారు.

ఇటువంటి అసత్యపు ప్రామాణికాలతో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయాలని చూస్తోందని విమర్శించారు. ఐక్యరాజ్య సమితిలోని గ్లోబల్ కమ్యూనికేషన్స్ విభాగం చేపట్టే కార్యకలాపాలు, చొరవలకు భారత్ మద్దతు వుంటుందని శుక్లా పునరుద్ఘాటించారు.

## 'పిఎం విద్యా లక్ష్మి'కు ఆమోదం



న్యూఢిల్లీ : ఉన్నత విద్యా సంస్థల్లో చేరే ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఆర్థిక సహాయం చేసేందుకు 'పీఎం విద్యాలక్ష్మి' పథకానికి కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రి వర్గం సమావేశం జరిగింది. ఈ సమావేశం వివరాలను కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ విలేకరులకు వెల్లడించారు. పిఎం విద్యాలక్ష్మి పథకం కింద ఉన్నత విద్యాసంస్థల్లో అడ్మిషన్లు పొందిన వారు ఆయా సంస్థల్లో చదువుకునేందుకు 'విద్యా లక్ష్మి పథకం' ద్వారా రుణాలు పొందవచ్చున్నారు. ఈ రుణాలకు కొలేటరల్, గ్యారంటర్ అవసరం లేదని అన్నారు. దేశవ్యాప్తంగా 860 ఉన్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వ హామీతో రూ.7.50 లక్షల వరకూ రుణం పొందవచ్చు. రుణంలో 75 శాతం బ్యాంకులకు కేంద్రం గ్యారెంటీ ఇస్తుంది. ఈ పథకం కింద ఏటా గరిష్టంగా 22 లక్షల మంది విద్యార్థులు ప్రయోజనం పొందుతారని తెలిపారు. వార్షిక కుటుంబ ఆదాయం రూ.8 లక్షల వరకూ ఉన్నవారికి ఈ పథకం వర్తింపజేయనున్నారు. పిఎం విద్యా లక్ష్మి పోర్టల్ ద్వారా విద్యార్థులు నేరుగా రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

## పిల్లలకు సోషల్ మీడియా నిషేధం




ఆస్ట్రేలియా: 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాపై నిషేధం కోసం ప్రభుత్వం చట్టం చేస్తుందని ఆస్ట్రేలియా ప్రధాన మంత్రి ఆంథోనీ అల్బనీస్ గురువారం వెల్లడించారు. ఈ విధానం ప్రపంచంలోనే అగ్రగామిగా ఉందని ప్రభుత్వం చెబుతోంది. సోషల్ మీడియా తమ పిల్లలకు హాని చేస్తోందన్నారు. ఆన్?లైన్ నుంచి పిల్లలను రక్షించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అల్బనీస్ మీడియా సమావేశంలో తెలిపారు. ఈ ఏడాది పార్లమెంట్‌లో చట్టం ప్రవేశపెట్టబడుతుందని, చట్టసభ సభ్యులు ఆమోదించిన 12 నెలల తర్వాత చట్టాలు అమల్లోకి వస్తాయని ఆయన తెలిపారు. చట్టం అమలును ఆస్ట్రేలియాకు చెందిన ఈ–సేఫ్టీ కమిషనర్ పర్యవేక్షిస్తారని ప్రధాని అల్బనీస్ పేర్కొన్నారు. తల్లిదండ్రుల సమ్మతి ఉన్నా వినియోగదారులకు(పిల్లలకు) ఎలాంటి మినహాయింపులు ఉండవన్నారు. 16 ఏళ్లలోపు పిల్లలు తమ సైట్లను యాక్సెస్ చేయకుండా నిరోధించడానికి సోషల్?మీడియా తగిన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. యువ యూజర్లకు ఎలాంటి జరిమానాలు ఉండవని, అయితే సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ మాత్రం నిబంధనలు పాటించకపోతే.. తర్వాత జరిగే తీవ్ర పరిణామాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.



# చక్కని ఆరోగ్యం

## నాన్‌వెజ్ వల్ల ఇన్ని సమస్యలు వస్తాయా?

ప్రతి రోజూ నాన్ వెజ్ తింటే అనేక అనారోగ్య సమస్యలు వస్తాయి అంటున్నారు నిపుణులు. ప్రతి రోజూ నాన్ వెజ్ ఐటెమ్స్ తినే వారిలో ఖచ్చితంగా కొన్ని వ్యాధులు వస్తాయట. ఆహార అలవాట్లు.. శరీర ఆరోగ్యం మీదనే కాకుండా.. మానసిక ఆరోగ్యం మీద కూడా ప్రభావం చూపిస్తుంటాయి. రోజూ ఫాస్ట్ ఫుడ్స్, లేదా మాంసం తినే వారిలో సాధారణంగా డయాబెటీస్, బీపీ, క్యాన్సర్, ఊబకాయం, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు వస్తాయి. అంతేకాదు మతి మరుపు కూడా వచ్చే అవకాశం ఉందట. ప్రతిరోజూ మాంసం తినే వారిలో వయసు పెరిగే కొద్దీ మతిమరుపు వచ్చే అవకాశం ఎక్కువ ఉంటుంది. ఎలా అనుకుంటున్నారా? ఆస్ట్రేలియాలోని బాండ్ యూనివర్శిటీలో 438 మంది వ్యక్తులపై పరిశోధన చేశారు ఆరోగ్య నిపుణులు. ఆహారపు అలవాట్లు జ్ఞాపకశక్తిపై ఎలా పని చేస్తున్నాయో తెలుసుకున్నారు. ఈ అధ్యయనం 438 మంది కొనసాగితే అందులో 108 మందికి అల్జీమర్స్ వ్యాధి వచ్చినట్టు తేలిందట. దీని ప్రకారం ఎక్కువగా నాన్ వెజ్ తింటే వయసు పెరిగే కొద్దీ మతిమరుపు వస్తుంది అంటున్నారు నిపుణులు. అంటే ఇంట్లో మనుషులను కూడా గుర్తించలేని పరిస్థితి కూడా వస్తుందట. ప్రతిరోజూ మాంసం తినేవారిలో అధిక బరువు, హై కొలెస్ట్రాల్, డయాబెటీస్, బీపీ, ఫ్యాటీ లివర్, గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం మరింత ఎక్కువ ఉంటుందట. ఈ సమస్యలు మాత్రమే కాదు ప్రతి రోజూ నాన్ వెజ్ తినే వారిలో నరాలకు సంబంధించిన సమస్యలు కూడా వస్తాయట. రోజూ పండ్లు, కూరలు, గింజలు తినే వారిలో నరాలకు సంబంధించిన సమస్యలు అసలు కనిపించడం లేదని పరిశోధనలో తేలిందట. మాంసాహారాలు ఎక్కువగా తీసుకుంటే నరాల సమస్యలు వస్తాయి సో స్కిప్ చేయండి. ఎక్కువగా తినకుండా లిమిట్ గా తినడం వల్ల ఈ సమస్యల నుంచి బయటపడవచ్చు. అతి సర్వత్రా వర్జయేత్. సో మితంగా తిని ఆరోగ్యంగా ఉండండని సలహా ఇస్తున్నారు నిపుణనలు.



## పెరుగు వల్ల ఇన్ని ప్రయోజనాలు ఉంటాయా?

పేగులకు మంచిది: పెరుగు లోని ప్రోబయోటిక్స్ పేగులు బాగా పనిచేయడానికి సహాయపడుత ుంటాయి. కడుపు ఉబ్బరాన్ని తగ్గించే శక్తి కూడా ఈ పెరుగుకు ఉంటుంది. మానసిక ఒత్తిడి: పెరుగులోని యాంటీఆక్సిడెంట్లు, మంచి కొవ్వులు, ప్రోబయోటిక్‌లు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి. ఒత్తిడిని కలిగించే కార్టిసాల్ హార్మోన్ ఉత్పత్తిని పెరుగు తగ్గిస్తుంది. ఈ హార్మోన్ నియంత్రణలో ఉంటే బరువు తగ్గుతుంటారు. జ్ఞాపకశక్తి మెరుగుదల: జ్ఞాపకశక్తిని పెంచుకోవాలనుకుంటే ప్రతిరోజూ పెరుగు తినాలి అంటున్నారు నిపుణులు. పెరుగులోని కాల్షియం, విటమిన్ డి జ్ఞాపకశక్తిని మెరుగుపరచడానికి సహాయం చేస్తుంది. చర్మ సంరక్షణ: పెరుగు తినేవారి చర్మం పొడిబారకుండా ఉంటుంది. తేమ వల్ల యవ్వనంగా కనిపిస్తారు కూడా. దురద ఉంటే కూడా పెరుగు తినడం వల్ల ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చు అంటున్నారు నిపుణులు. పెరుగులోని జింక్, విటమిన్ సి, కాల్షియం చర్మానికి ఎంతో మేలు చేస్తుంటాయి. ఎముకలు, దంతాల బలం : ఎముకలు, దంతాలను బలోపేతం చేస్తుంది ఈ పెరుగు. వీటికి అవసరమైన ఫాస్పరస్, కాల్షియం లు కూడా ఇందులో ఉంటాయి. దీన్ని ప్రతిరోజూ తినడం వల్ల దంతాలు చాలా స్ట్రాంగ్ గా ఉంటాయి.



ఎముకలను కూడా బలోపేతం చేయడం వల్ల కీళ్లనొప్పులు రాకుండా నిరోధించుకోవచ్చు. బిపి %డ% షుగర్ నియంత్రణ: పెరుగులోని పోషకాలు సులభంగా జీర్ణం అవడానికి కూడా ఈ పెరుగు ఉపయోగపడుతుంది. దీనిలోని ప్రోటీన్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. పెరుగులో ఉండే మెగ్నీషియం అధిక రక్తపోటును తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యం: ప్రతిరోజూ పెరుగు తీసుకునే వారికి కొలెస్ట్రాల్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయి అంటున్నారు నిపుణులు. రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. దీని వల్ల గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది. మెదడుకు మంచిది: పెరుగులో ఉండే ప్రోటీన్ మెదడు కణాల పెరుగుదల , నిర్వహణకు సహాయపడుతుంది అంటున్నారు నిపుణులు. పెరుగు, పంచదార రెండింటినీ కలిపి తింటే మెదడుకు మంచిదట. ఎందుకంటే పెరుగుతో పాటు పంచదార తిన్నప్పుడు లభించే గ్లూకోజ్ మెదడు శక్తిని పెంచడానికి మరింత సహాయపడుతుంది. శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది పెరుగు. ఇందులోని టైరోసిన్ వంటి అమైనో ఆమ్లాలు మెదడులో డోపమైన్, సెరోటోనిన్, నోర్‌పైన్‌ఫ్రైన్ వంటి హార్మోన్‌లను నియంత్రిస్తాయి.

## గుండెపోటుకు గురికాకూడదనుకునే వారు వీటిని అలవాటు చేసుకోవాల్సిందే

ప్రస్తుత రోజుల్లో గుండెపోటు అనేది సర్వసాధారణమైపోయింది. ఇంతకుముందు ఈ సమస్య పెద్దవారిలో మాత్రమే కనిపించేది. కానీ, ఇప్పుడు యువత కూడా దీని బారిన పడుతున్నారు. ఎవరైనా డ్యాన్స్ చేస్తున్నప్పుడు, లేదా ఏదైనా పని చేస్తున్నప్పుడు, మాట్లాడుతున్నప్పుడు ఎవరైనా పడిపోయారని మీరు తరచుగా వినే ఉంటారు. అలాంటి వారు కార్డియాక్ అరెస్ట్ కారణంగా మరణిస్తారు. వీటన్నింటికీ ప్రధాన కారణం



ధమనులలో ఫలకం అడ్డుపడటం. దీని కారణంగా రక్తం గుండెకు చేరదు. శరీరంలో ఆక్సిజన్ కొరత ఉంటుంది. ఈ పరిస్థితిలో గుండెపోటు లేదా గుండె ఆగిపోయే ప్రమాదం పెరుగుతుంది. ఈ పరిస్థితులన్నింటినీ నివారించడానికి, మీ జీవనశైలిలో కొన్ని మార్పులు అవసరం. అందుకోసం ఈ అలవాట్లను అలవాటు చేసుకోండి. కొలెస్ట్రాల్ లేదా ఫలకం ధమనులను అడ్డుకోవడం వల్ల గుండెపోటు లేదా కార్డియాక్ అరెస్ట్ సంభవిస్తుంది. కొలెస్ట్రాల్ పెరగడానికి అతి పెద్ద కారణం అనారోగ్యకరమైన ఆహారం. ఈ పరిస్థితిలో, మీరు గుండె సంబంధిత సమస్యలను నివారించాలనుకుంటే ఈ రోజు నుండి అనారోగ్యకరమైన ఆహారం లేదా ప్రాసెస్ చేసిన, ప్యాక్ చేసిన ఆహారాన్ని తినడం మానేయండి. వాటికి బదులుగా పచ్చి ఆకు కూరలు, పప్పులు, తృణధాన్యాలు, తాజా పండ్లు, గుడ్లు వంటి తాజా ఇంట్లో తయారు చేసిన ఆహారాన్ని తినండి. ధమనులలో ఫలకం పేరుకుపోకుండా నిరోధించడానికి, మీరు రోజూ వ్యాయామం చేయడం ముఖ్యం. ప్రతిరోజూ కనీసం అరగంట పాటు వ్యాయామం చేయాలి. దీని కోసం ప్రతిరోజూ సైకిల్, ఈత, పరుగు, నడక, శక్తి శిక్షణ చేయండి. ధూమపానం ఊపిరితిత్తులకు మాత్రమే హాని చేస్తుందని అనుకుంటే అది తప్పు. అది గుండెకు కూడా హాని చేస్తుంది. సిగరెట్ పొగ నుండి విడుదలయ్యే రసాయనాలు ధమనులలో పొరను ఏర్పరుస్తాయి. దీని వలన ధమనులు నిరోధించబడతాయి. ఈ రోజుల్లో, ఒత్తిడి అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగంగా మారుతోంది. ఇది ధమనులలో వాపును కలిగిస్తుంది. దీని వలన ధమనులు ఉబ్బడం అలాగే నిరోధించబడతాయి. ఒత్తిడి కారణంగా శరీరంలో 1500 రసాయనాలు విడుదలవుతాయని తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. ఈ పరిస్థితిలో, ఒత్తిడిని నియంత్రించడానికి ప్రశాంతంగా ఉండండి. కోపం తెచ్చుకోకండి. ప్రతిరోజూ యోగా, ప్రాణాయామం, ధ్యానం చేయండి. మీరు మీ హృదయాన్ని ప్రేమిస్తే మద్యానికి దూరంగా ఉండండి. ఆల్కహాల్ కొలెస్ట్రాల్, రక్తపోటు రెండింటినీ పెంచుతుంది. కాబట్టి, గుండె ఆరోగ్యంగా ఉండటానికి దాని వినియోగాన్ని నివారించండి. మీ బరువును అదుపులో ఉంచుకోండి. అధిక బరువు కొలెస్ట్రాల్, అధిక రక్తం, అధిక షుగర్‌కి అతి పెద్ద కారణంగా పరిగణించబడుతుంది. కాబట్టి దానిని అదుపులో ఉంచండి. దీని కోసం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. అలాగే ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోండి.

## ఈ నీరు అమృతంతో సమానం!



ప్రస్తుత కాలంలో మారుతున్న ఆహారపు అలవాట్లు, మారుతున్న జీవనశైలి వల్ల శరీరంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వాటిలో ముఖ్యంతో వయసుతో సంబంధం లేకుండా వచ్చే స్థూలకాయం ఒకటి. ఊబకాయాన్ని తగ్గించుకోవడానికి మంచి ఆహారం, వ్యాయామమే మార్గం. అంతేకాకుండా కొన్ని ఇంటి చిట్కాలను పాటించడం వల్ల బరువు తగ్గొచ్చని మన పెద్దలు చెబుతున్నారు. బరువు తగ్గడానికి, ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఈ నీటిని తాగితే.. నిమ్మ, తేనె: ఒక గ్లాసు నీటిలో సగం నిమ్మకాయ, ఒక చెంచా తేనె, చిటికెడు ఎండుమిర్చి వేసి తినాలి. నల్ల మిరియాలలో పైపెరిన్ అనే మూలకం ఉంటుంది. ఇది శరీరంలో కొత్త కొవ్వు కణాలు పేరుకుపోవడానికి అనుమతించదు. నిమ్మకాయలో ఉండే ఆస్కార్బిక్ యాసిడ్ శరీరంలోని కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. శరీరం నుండి విషపూరిత మూలకాలను తొలగించడంలో సహాయపడుతుంది. సోంపు నీరు: 6–8 సోంపు గింజలను ఒక కప్పు నీటిలో ఐదు నిమిషాలు మరిగించాలి. దీన్ని వడపోసి ఉదయం ఖాళీ కడుపుతో వేడి వేడిగా తాగాలి. ఇది అధిక ఆకలి సమస్య నుండి ఉపశమనం కలిగిస్తుంది. అంతేకాకుండా తినాలనే కోరికను తగ్గిస్తుంది. ఇది శరీరంలోని మురికిని శుభ్రపరుస్తుంది. మూత్రవిసర్జన, చెమట అధికంగా వచ్చేలా ప్రేరేపిస్తుంది. జీలకర్ర నీరు: జీలకర్ర నీటిని తాగడం వల్ల స్థూలకాయం త్వరగా తగ్గుతుంది. ఇందులో క్యుమినాల్డిహైడ్, థైమోక్వినోన్ వంటి సమ్మేళనాలు ఉన్నాయి. ఇవి యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలను కలిగి ఉంటాయి. ఆర్థరైటిస్ , కీళ్ల నొప్పులు వంటి పరిస్థితులు ఉంటే, చికాకు, వాపును తగ్గించడంలో జీలకర్ర నీరు ప్రభావవంతంగా ఉంటుంది. మెంతి గింజల నీరు: మెంతి నీరు తాగడం వల్ల స్థూలకాయం తగ్గడమే కాకుండా మధుమేహాన్ని అదుపులో ఉంచుతుంది. రక్తంలో గ్లూకోజ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో మెంతులు సహకరిస్తాయి. మెంతి నీటిని తయారు చేయడానికి, ముందుగా 1 టీస్పూన్ మెంతి గింజలను 1 గ్లాసు నీటిలో రాత్రంతా నానబెట్టండి. దీని తరువాత, ఉదయం నిద్రలేచిన తర్వాత, ఈ నీటిని వడపోసి ఖాళీ కడుపుతో తాగాలి.



## అలాంటివారు ఈ పండు తినకండి!

జామ పండు.. పేదల ఆపిల్ గా పేరు దక్కించుకున్న జామ పండు అన్ని సీజన్లో విరివిగా లభిస్తుంది. దానిమ్మ పండ్లతో పోల్చుకుంటే ఖర్చు కూడా చాలా తక్కువ. చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు కూడా జామ పండును ఎంతో ఇష్టంగా తింటారు. జామపండు పోషకాలకు నిలయం అని చెప్పవచ్చు. ఇకపోతే జామ పండు తినడం వల్ల శరీరానికి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కూడా లభిస్తాయి.. అయితే కొంతమందికి జామపండు పడదు. కొంతమందికి సైడ్ ఎఫెక్ట్స్ కూడా వస్తాయి. ఇంకొంతమంది ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారు.

ఇకపోతే ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారు జామ పండు తినకూడదో ఇప్పుడు చూద్దాం. జామ పండు చలికాలంలో తింటే బోలెడు ప్రయోజనాలు కలుగుతాయి. ఇందులో ఉండే విటమిన్ సి ఇమ్యూనిటీ పవర్ ను పెంచుతుంది. జామ పండు తినడం వల్ల రక్తపోటు తగ్గడంతో పాటు గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. జామ పండులో ఉండే విటమిన్ ఏ కంటి ఆరోగ్యాన్ని పెంచుతుంది. అలాగే శరీరానికి కావలసిన విటమిన్ డి కూడా లభిస్తుంది. ఇన్ని పోషకాలు ఉన్న జామ పండు కి కొంత మంది దూరంగా ఉండాలి. అలర్జీ సమస్యలతో బాధపడేవారు జామపండు తినకపోవడం మంచిది. అలాగే చర్మవ్యాధులు, శ్వాసకోశ వ్యాధులతో బాధ పడే వారు కూడా జామపండు తినకూడదు. జామ పండు తింటే చర్మం పై దద్దుర్లు, మంట, వాపు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి సమస్యలు ఉన్నవారు జామపండుకు దూరంగా ఉండటమే మేలు అని నిపుణులు చెబుతున్నారు. అలాగే గ్యాస్ట్రిక్, ఎసిడిటీ వంటి సమస్యలు ఉన్నవారు కూడా జామ పండుకు దూరంగా ఉండాలి. జామ పండు జీర్ణం అవ్వడానికి ఎక్కువ సమయం పడుతుంది కాబట్టి జీర్ణ సంబంధిత సమస్యలు ఉన్నవారు కూడా జామ పండుకు దూరంగా ఉండటమే మంచిది.

## తొక్కే కదా అని తీసి పారేయకండి..!

నారింజ పండు తొక్కలతో ఆరోగ్యానికి చాలా ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. నారింజ పండు తొక్కలు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బాక్టీరియల్, యాంటీ వైరల్, యాంటీ సెప్టిక్ వంటి గుణాలు కలిగి ఉంటాయి.నారింజ పండు తొక్కలతో ఒత్తిడి, మలబద్ధకం తగ్గుతుంది. క్యాన్సర్, గుండె జబ్బుల దోహదపడుతుంది. జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. బ్లడ్ షుగర్ లెవల్స్ తగ్గుతాయి. శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.నారింజ పండు తొక్కను గాయాలు, ఇన్‌ఫెక్షన్‌కు గురైన శరీర భాగాలపై రాయటం వల్ల ఆయా సమస్యలు త్వరగా తగ్గుతాయి. నారింజ పండు తొక్కలో యాంటీ మైక్రోబియల్, యాంటీ ఫంగల్, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు ఉంటాయి. అందువల్లే గాయాలు, ఇన్‌ఫెక్షన్లు త్వరగా మానిపోతాయి. క్యాన్సర్లకు వ్యతిరేకంగా పోరాడే గుణాలు నారింజ పండు తొక్కలో ఉంటాయి. శరీరంలో ఉండే క్యాన్సర్ కణాలను నాశనం చేసే శక్తి ఆ తొక్కలోని పాలీమిథాక్సీఫ్లేవోన్స్ అనబడే ఫ్లేవనాయిడ్లలో ఉంటాయి. అందువల్ల నారింజ పండు తొక్కను ఏదో ఒక రూపంలో తీసుకుంటే క్యాన్సర్లు రాకుండా అడ్డుకుంటుంది. నారింజ పండు తొక్కలో 61 నుంచి 69 శాతం వరకు ఫైబర్ ఉంటుంది. అందులో 19 నుంచి 22 శాతం వరకు సాల్యుబుల్ ఫైబర్ ఉంటుంది. ఇది మన శరీరానికి ఎంతో అవసరం. జీర్ణ సమస్యలు ఉన్నవారికి ఈ ఫైబర్ ఎంతగానో మేలు చేస్తుంది. నారింజ పండు తొక్కలో యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు పుష్కలంగా ఉంటాయి. అందువల్ల గుండె జబ్బులు, అల్జీమర్స్, డయాబెటిస్ వంటి వ్యాధులు రాకుండా ఉంటాయి. అలాగే, ఈ నారింజ తొక్కతో చర్మ సమస్యలను కూడా నయం చేసుకోవచ్చు. మొటిమల సమస్య ఉన్నవారు వాటిపై నారింజ పండు తొక్కలను నిత్యం మర్దనా చేస్తుంటే ఆ సమస్య నుంచి విముక్తి పొందవచ్చు. నిద్రనిద్రలేమితో బాధపడేవారు నారింజ తొక్క వల్ల ఆ సమస్య నుండి ఉపశమనం పొందవచ్చు. నారింజ తొక్క నీటిలో వేసి ఆ నీటిని మరగబెట్టి తాగాలి. ఇలా క్రమం తప్పకుండా తాగడం వల్ల రాత్రివేళల్లో సుఖమైన నిద్ర లభిస్తుంది. నారింజ తొక్కను చక్కెర, నిమ్మకాయతో కలిపి తింటే ఆరోగ్యానికి మంచిది.

## పడుకునే ముందు వాము నీటిని తాగితే ఇన్ని లాభాలా?

వామును మెత్తటి పౌడర్‌గా చేసుకుని నిల్వ చేసుకోవాలి. పంటి నొప్పితో ఇబ్బంది పడుతున్నవారు.. అర టీ స్పూన్ వాము పౌడర్, కొద్దిగా ఆలివ్ ఆయిల్, గోరువెచ్చని నీటితో కలిపి తాగితే, పంటి నొప్పిని తగ్గిస్తుంది. అంతేకాదు..నోటి దుర్వాసన కూడా దూరమవుతుంది. గోరువెచ్చని నీటిలో వాము పౌడర్ కలిపి తాగడం వల్ల నెలసరి సమయంలో మహిళలు ఎదుర్కొనే తిమ్మిర్లు, కడుపు నొప్పిని దూరం చేస్తుంది. పొత్తి కడుపు తగ్గుతుంది. ఇలా క్రమంగా వాము వాటర్ తాగుతూ ఉంటే.. బరువు కూడా తగ్గుతారు. ఇందుకోసం వాము పొడి లేదంటే, వాముని నేరుగా కూడా తీసుకోవచ్చు. వాములో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. అందువల్ల శ్వాస కోస వ్యాధులు రాకుండా ఉంటాయి. ఒక వేళ జలుబు, దగ్గు, కఫం లాంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఈ నీటిని తాగడం వల్ల అవి తగ్గుముఖం పడతాయి. రాత్రి పడుకునే ముందు ఇలా గోరువెచ్చని నీటిలో వాము పౌడర్‌ని కలిపి తాగడం వల్ల జీర్ణ సమస్యలు దూరమవుతాయి. సాధారణంగా కడుపు ఉబ్బరం, త్రేన్పులు, జీర్ణ సమస్యల్ని దూరం చేయడంలో ఈ వాము వాటర్ బాగా హెల్ప్ చేస్తాయి. వాముని కప్పున్నర నీటిలో వేసి మరిగించి కప్పు అయ్యే వరకూ ఉంచాలి. దీనిని ఫిల్టర్ చేసి రెగ్యులర్‌గా తీసుకుంటే బరువు తగ్గుతారు. పిల్లలకు అరుగుదల సరిగ్గా లేకపోయినా, పెద్దలు గ్యాస్ లాంటి వాటితో బాధ పడుతున్నా వాము ఔషధంగా పనిచేస్తుంది. వాముతో జీర్ణ సంబంధిత సమస్యలను దూరం చేస్తుంది.



# సినిమా



## నాని 'ప్యారడైజ్' వెనుక అసలు కహాని

దసరా బ్లాక్ బస్టర్‌తో నానికి మొదటి వంద కోట్ల గ్రాసర్ ఇచ్చిన దర్శకుడు శ్రీకాంత్ ఓదెల రెండోసారి న్యాచురల్ స్టార్ తో జట్టు కడుతున్న సంగతి తెలిసిందే. ప్రాజెక్టుని ఇప్పటికే అధికారికంగా లాంచ్ చేయగా హిట్ 3 ది థర్డ్ కేసులో బిజీగా ఉన్న నాని దాన్ని త్వరగా పూర్తి చేసుకుని ఈ సెట్స్ లో చేరబోతున్నాడు. షూటింగుకు ముందే భారీ అంచనాలు నెలకొన్న ఈ ప్యాన్ ఇండియా మూవీకి ప్యారడైజ్ అనే టైటిల్ దాదాపు లాకైనట్టు లేటెస్ట్ అప్డేట్. అనౌన్స్ చేయడానికి ఇంకా టైం ఉంది కాబట్టి అధికారిక ప్రకటన ఇప్పటికిప్పుడు రాకపోవచ్చు కానీ ఈ పేరు వెనుక మాత్రం ఆసక్తికరమైన లీక్ వినిపిస్తోంది.దాని ప్రకారం ఈ సినిమా బ్యాక్ డ్రాప్ మొత్తం సికంద్రాబాద్ లో జరుగుతుంది. ఆ మేరకు భారీ సెట్లు కూడా వేశారు. ఎనభై తొంభై దశకం మధ్య జరిగిన ఒక సంచలనాత్మక సంఘటనను ఆధారంగా చేసుకుని శ్రీకాంత్ ఓదెల ఈ స్క్రిప్ట్ రాసుకున్నాడట. జంట నగరాల్లో కీలకమైన ల్యాండ్ మార్క్ గా చెప్పుకునే ప్యారడైజ్ నేపథ్యంలో కీలకమైన మలుపులు ఉన్నందు వల్లే ఈ టైటిల్ సబబుగా ఉంటుందని భావించి ఆ మేరకు రిజిస్టర్ కూడా చేశారని అంటున్నారు. ఒకవేళ హీరో పేరు ఇదే అయినా ఆశ్చర్యపోనక్కర్లేదని మరో ఇంటరెస్టింగ్ న్యూస్ చక్కర్లు కొడుతోంది. మొత్తానికి ఊహలకు భిన్నంగా నాని ఓదెల ఏదో గట్టిగానే ప్లాన్ చేయబోతున్నారు.



## ప్రభాస్ ఫ్యాన్స్‌కి ఎపిక్ సర్ప్రైజ్

బ్లాక్‌బస్టర్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా రెబల్ స్టార్ ప్రభాస్‌తో భారీ బడ్జెట్‌లో తెరకెక్కిస్తున్న చిత్రం 'స్పిరిట్' ప్రస్తుతం ప్రభాస్ మారుతి డైరెక్షన్‌లో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న 'ది రాజా సాబ్', ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో హొంబలే ఫిలింస్ నిర్మిస్తున్న 'సలార్ 2', హను రాఘవపూడి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న సినిమాలు లైన్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో స్పిరిట్ సినిమా షూట్ జరిగేది ఎప్పుడో అని.. ఫ్యాన్స్‌తోపాటు సినీ ఎక్స్‌పర్ట్స్ అనుకున్నారు. అయితే అందరికి దిమ్మతిరిగే అప్డేట్ ఇచ్చారు నిర్మాత భూషణ్ కుమార్. ఈ న్యూస్ విని ప్రభాస్ ఫ్యాన్స్ ఎగిరి గంతేస్తున్నారు.. ఇంతకీ ఆ ఎపిక్ అప్డేట్ ఏంటంటే.. ఈ సినిమాలో ప్రభాస్ ఫస్ట్ టైమ్ పోలీసుగా కనిపించనున్నాడు. క్యారెక్టర్ మేక్ ఓవర్‌కి కూడా సమయం పడుతుంది. 'ది రాజా సాబ్', 'సలార్ 2', హను రాఘవపూడి సినిమాల్లో బిజీగా ఉన్న ప్రభాస్ 'స్పిరిట్' మూవీ స్టార్ట్ చేసేది, ఏ 2026, 2027లోనో అనుకున్నారంతా. కానీ.. మూవీ ప్రొడ్యూసర్ భూషణ్ కుమార్ ఈ సినిమా షూటింగ్ 2024, డిసెంబర్‌లోనే ప్రారంభం అని చెప్పడంతో అంత షాక్ అయ్యారు. ఫ్యాన్స్ ఎన్నో అంచనాలు పెట్టుకున్న ఈ సినిమా ఇంత తొందరగా ప్రారంభం కానుండటంతో ఫ్యాన్స్ ఫుల్ ఖుషి అవుతున్నారు. మరోవైపు ఈ సినిమా మ్యూజిక్ సెటింగ్స్‌ని సందీప్.. మ్యూజిక్ డైరెక్టర్ హర్షవర్ధన్ రామేశ్వర్‌తో కలిసి ఎప్పుడో ప్రారంభించారు.






## రెండు పార్టులుగా బాలీవుడ్ రామాయణం

బాలీవుడ్ మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ రామాయణం సినిమాకు సంబంధించి బిగ్ అప్‌డేట్ వచ్చింది. తాజాగా ఈ సినిమా విడుదల తేదీకి సంబంధించి బిగ్ అనౌన్స్‌మెంట్‌ను ఇచ్చారు మేకర్స్. ఈ సినిమాను రెండు పార్టులుగా తీసుకురాబోతునట్లు ఫస్ట్ పార్ట్‌ను దీపావళి కానుకగా 2026లో అలాగే రెండో పార్టును దీపావళి కానుకగా 2027లో తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా పోస్టర్‌ను విడుదల చేసింది. భారతీయ ఇతిహాసం ఆధారంగా రానున్న ఈ సినిమాకు దంగల్ ఫేమ్ నితేష్ తివారీ దర్శకత్వం వహిస్తుండగా.. రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, శాండల్‌వుడ్ స్టార్ యష్ రావణుడిగా నటించనున్నట్లు తెలుస్తుంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ సంబంధించి ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్నట్లు సమాచారం. ఇక ఈ ప్రాజెక్ట్‌లో సన్నీ డియోల్, రకుల్ ప్రీత్ సింగ్, లారా దత్తా తదితరులు ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.



## విజయ్ క్రేజ్.. వేరే లెవెల్

తమిళనాట దశాబ్దాల పాటు సూపర్ స్టార్ రజినీకాంతే నంబర్ వన్ హీరోగా ఉండేవారు. ఆయన సినిమాల బడ్జెట్లు, బిజినెస్, కలెక్షన్లు అన్నీ కూడా వేరే స్థాయిలో ఉండేవి. అప్పుడప్పుడూ రజినీకి కూడా డిజాస్టర్లు ఎదురైనా.. సరైన సినిమా పడితే బాక్సాఫీస్ మోత మోగిపోయేది. కానీ గత దశాబ్ద కాలంలో ఆయన ఫాలోయింగ్, మార్కెట్ తగ్గుతూ వచ్చాయి. అదే సమయంలో విజయ్ రైజ్ అయ్యాడు. రజినీని మించి మార్కెట్ సంపాదించాడు. గత కొన్నేళ్లలో అతను పట్టిందల్లా బంగారం అవుతోంది. విజయ్ సినిమాలకు టాక్ ఎలా ఉన్నా.. ఓపెనింగ్స్ అదిరిపోతున్నాయి. నెగెటివ్ టాక్ తెచ్చుకున్న సినిమాలు కూడా బాక్సాఫీస్ దగ్గర సక్సెస్ ఫుల్ అనిపించుకుంటున్నాయి. లియో, ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం అందుకు ఉదాహరణ. టాక్ బాలేకున్నా ఇవి వందల కోట్ల వసూళ్లు సాధించి విజయ్ స్టార్ పవర్ ఏంటో చూపించాయి. ఐతే ఈ క్రేజ్‌ను రాజకీయంగా ఉపయోగించుకోబోతున్న విజయ్.. పూర్తి స్థాయిలో రాజకీయాల్లోకి దిగే ముందు చివరగా ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. హెచ్.వినోద్ దర్శకత్వంలో విజయ్ హీరోగా ఇటీవలే ఓ సినిమా మొదలైంది. పూజా హెగ్డే అందులో కథానాయిక. ఈ సినిమా షూటింగ్ మొదలైందో లేదో ఓవర్సీస్ థియేట్రికల్ డీల్ పూర్తయిందట. ఏకంగా రూ.78 కోట్లకు ఫార్ ఫిలిమ్స్ సంస్థ అన్ని దేశాలకు సంబంధించిన హక్కులను గుంపగుత్తగా కొనేసినట్లు సమాచారం.

## సందీప్ వంగను ఏడిపించిన హీరోలెవరు?



సందీప్ రెడ్డి వంగ.. ఇప్పుడు ఇండియాలోనే మోస్ట్ వాంటెడ్ డైరెక్టర్లలో ఒకడు. తనతో సినిమా చేయడానికి టాప్ స్టార్లు ఎంతో ఆసక్తితో ఉన్నారు. ప్రభాస్ లాంటి టాప్ స్టార్ తనతో 'స్పిరిట్' మూవీ చేయబోతున్నాడు.సందీప్ ఇప్పటిదాకా తీసింది మూడు సినిమాలు, అందులో రెండు సినిమాలు ఒకే కథతో వేర్వేరు భాషల్లో తెరకెక్కాయి. అయినా తన క్రేజ్ మామూలుగా లేదు. తన పేరు మీద వందల కోట్ల బిజినెస్ జరుగుతోందిప్పుడు. ఇంత క్రేజ్ సంపాదించుకున్న సందీప్.. తొలి చిత్రం రిలీజవడానికి ముందు ఎన్నో ఇబ్బందులు పడ్డాడు. 'అర్జున్ రెడ్డి' కథతో అతను చాలా ఏళ్ల పాటు ట్రావెల్ చేసి.. దాన్ని సినిమాగా మలచడానికి పడ్డ కష్టాలు అన్నీ ఇన్నీ కావు. వాటి గురించి సందీప్ మరీ ఎక్కువగా చెప్పుకుంది లేదు. ఐతే తాజాగా స్టార్ రైటర్ కోన వెంకట్.. సందీప్‌తో తనతో పంచుకున్న కష్టాల గురించి ఓ పాడ్ కాస్ట్‌లో మాట్లాడాడు. 'అర్జున్ రెడ్డి' కథ మీద సందీప్ ఐదేళ్లు పట్టుబట్టి కూర్చున్నా ఆ సినిమా పట్టాలెక్కలేదని కోన వెంకట్ వెల్లడించాడు. ముందు ఒక హీరోకు ఈ కథ నచ్చి సినిమా చేయడానికి ఆసక్తి చూపించాడని.. తన ఆఫీస్‌లో ఆ కథ మీద వర్క్ చేసే అవకాశం కల్పించాడని కోన తెలిపాడు. ఐతే తనకు పెద్దగా సౌకర్యాలేమీ కల్పించలేదని.. ఒక మూలన ఒక సీట్ ఇచ్చి కథ మీద వర్క్ చేయమన్నాడని.. రోజూ తనకు భోజనం మాత్రం పెట్టేవారని కోన చెప్పాడు. చూద్దాం చేద్దాం అంటూనే ఆ హీరో మూడేళ్లు గడిపేశాడని.. అతడికి సినిమా చేసే ఉద్దేశం లేదని చివరికి అర్థమయ్యాక సందీప్ అక్కడి నుంచి బయటికి వచ్చేశాడని తెలిపాడు.

# 'ఒకే ఒక్కడు ఎనుముల రేవంత్ రెడ్డి'
# పుస్తకాన్ని ఆవిష్కరించిన టీపీసీసీ చీఫ్

-మొదటిపేజీ తరువాయి

పోరాటం చేసిన వ్యక్తి రేవంత్ రెడ్డి అన్నారు. రేపు ఆయన పుట్టిన రోజు సందర్భంగా 'ఒకే ఒక్కడు...' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్నట్లు చెప్పారు. టీపీసీసీ తరఫున మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్యమంత్రికి ముందస్తుగా పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పారు. రేవంత్ రెడ్డి నిండ నూరేళ్లు జీవించాలని... సుదీర్ఘ కాలం రాజకీయాల్లో ఉండాలని ఆకాంక్షించారు.

**పూరీ బీచ్ లో రేవంత్ రెడ్డి సైకత శిల్పం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఒడిశాలోని పూరీ సముద్ర తీరంలో రేవంత్ రెడ్డి సైకత శిల్పాన్ని వేసి ఫిషరీస్ కార్పోరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ తన అభిమానాన్ని చాటుకున్నారు.

**రేవంత్‌కు ఫ్యాన్స్ బిగ్ సర్‌ప్రైజ్.. జీవితంలో గుర్తుండిపోయేలా బర్త్‌డే కానుక**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న నేత. పదేళ్ల పాటు అధికారం కోల్పోయిన కాంగ్రెస్‌ను తిరిగి గద్దెనెక్కేలా చేశారు రేవంత్. టీపీసీసీ అధ్యక్షుడిగా ఉంటూ దిగువ స్థాయి శ్రేణులను కూడా కలుపుకుంటూ పోతూ కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడమే లక్ష్యంగా పనిచేశారు. మొత్తానికి అనుకున్నది సాధించిన రేవంత్.. ప్రస్తుతం ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తున్నారు. అలాగే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారు.

సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రెండు రోజుల్లోనే మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలులోకి తీసుకువచ్చారు రేవంత్. ఇదిలా ఉండగా.. రేపు (శుక్రవారం) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టినరోజు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అలాగే తెలంగాణ సీఎం పుట్టినరోజు సందర్భంగా ఆయనకు బిగ్ సర్‌ప్రైజ్ ఇవ్వాలని ఫ్యాన్స్ డిసైడ్ అయ్యారు.




దీంతో జీవితంలో ఆయనకు గుర్తుండుపోయేలా ఓ కానుకను ఇచ్చారు. సైకత శిల్పాలకు ఫేమస్ అయిన ఒడిశాలోని పూరి బీచ్‌లో రేవంత్ సైకత శిల్పాన్ని వేయించి.. ఆయనకు బర్త్‌డే కానుకను అందజేశారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డికి వచ్చిన ఓ స్పెషల్ కానుక మాత్రం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్.. రేవంత్ రెడ్డి పట్ల వెరైటీగా తన అభిమానాన్ని చాటుకున్నారు. సీఎంకు ఆయన ఇచ్చిన అపురూపమైన బహుమతి ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఇంతకీ సాయి కుమార్.. రేవంత్‌కు ఇచ్చిన బహుమతి ఏంటో ఇప్పుడు చూద్దాం. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఒరిస్సాలోని సముద్రతీరం పూరీ బీచ్‌లో సైకత శిల్పాన్ని ఆవిష్కరించి తన అభిమానాన్ని చాటుకున్నారు ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్. బీచ్‌లో ఇసుకతో రేవంత్ రెడ్డి చిత్రాపటాన్ని వేసి.. దానిపై హ్యాపీ బర్త్‌డే రేవంత్ అన్న .. తెలంగాణ సీఎం అంటూ రాశారు. బెస్ట్ విషెస్ ఫ్రమ్ ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ అంటూ అందులో పేర్కొన్నారు.

దీనికి సంబంధించి ఎక్స్‌లో ఓ వీడియో పోస్టు అయ్యింది. "ప్రియతమ ముఖ్యమంత్రి, తెలంగాణ ప్రజా నేత రేవంత్ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా ఒరిస్సాలోని సముద్ర తీరంలో పూరీ బీచ్‌లో సైకత శిల్పం ఆవిష్కరణతో తన అభిమానాన్ని చాటుకున్న ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్" అంటూ అందుకు సంబంధించి వీడియోను ఎక్స్‌లో పలువురు పోస్టు చేశారు. సీఎంపై అభిమానంతో మెట్టు సాయి ఇచ్చిన ఈ కానుక ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# కేటీఆర్ చుట్టూ బిగుసుకుంటున్న ఫార్ములా ఈ రేసు స్కాం

-మొదటిపేజీ తరువాయి

కేసులో ఏసీబీ దూకుడుగా దర్యాప్తు చేస్తోంది. ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వం కొరడా విసురుతోంది. రాష్ట్రంలో జరిగిన పలు స్కాములపై ప్రభుత్వం విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. కాళేశ్వరం ప్రాజెక్టు, ఫోన్ ట్యాపింగ్, విద్యుత్ కొనుగోళ్ల అంశం, లిక్కర్ పాలసీ కేసు ఇలా పలు అంశాలపై గత ప్రభుత్వం అవినీతి ఆరోపణలు ఎదురుకుంటోంది. వీటిలో లిక్కర్ పాలసీ కేసులో మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవిత కొన్ని నెలల పాటు జైలుకు సైతం వెళ్లి వచ్చారు. విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంలో అవినీతి జరిగినట్టు ఆరోపణలు రావడంతో కేసీఆర్ ను విచారణకు ఆహ్వానించినప్పటికీ ఆయన వెళ్లలేదు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై విచారణ జరుగుతుండగా గత ప్రభుత్వంలో పనిచేసి ఆరోపణలు ఎదురుకున్న అధికారి విదేశాల్లో ఉన్నారు. ఫార్ములా ఈ-రేసింగ్‌కు సంబంధించి రూ.55 కోట్లు విదేశీ సంస్థలకు అక్రమంగా చెల్లించినట్లు గుర్తించారు. మున్సిపల్ శాఖ వద్ద రికార్డుల ఆధారంగా విదేశీ సంస్థలు, ప్రతినిధులకు నోటీసులు ఇవ్వనున్నారు. ఫార్ములా ఈ-రేసింగ్ నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన గత ప్రభుత్వంలోని పెద్దలకు కూడా నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది. ఈ రేసు వ్యవహారం మొత్తం కేటీఆర్ కనుసన్నల్లో జరగడంతో ఆయనకే నోటీసులు ఇస్తారని అంటున్నారు. ప్రభుత్వ హయాంలో నిర్వహించిన ఫార్ములా ఈ రేస్‌లో చోటుచేసుకున్నఅక్రమాలపై విచారణకు అవినీతి నిరోధక శాఖకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ రేస్‌లో రూ.55 కోట్లు ఎలాంటి అనుమతులు లేకుండా తరలించారు. ఐఏఎస్‌లు సహా అప్పటి బీఆర్ఎస్ సర్కారు పెద్దల ప్రమేయం ఉండడంతో కేసు నమోదు చేయాలని నిర్ణయించారు. నుమతి కోరుతూ ఏసీబీ అధికారులు ప్రస్తుత ప్రభుత్వానికి లేఖ రాశారు. దీనిని పరిశీలించిన అనంతరం కేసు నమోదు చేసి విచారణ చేపట్టేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏసీబీ వెంటనే విచారణ ప్రారంభించింది. కేసుతో సంబంధం ఉన్నవారందరికీ విడివిడిగా నోటీసులు ఇచ్చి, విచారించి స్టేట్‌మెంట్లు రికార్డు చేయనున్నారు. ఐఏఎస్‌లు మొదలు కీలక అధికారులు, నాటి ప్రజాప్రతినిధుల దాక వీరిలో ఉండే అవకాశం ఉంది. స్టేట్‌మెంట్ ఆధారంగా గత ప్రభుత్వంలోని కీలక నేతలకు నోటీసులు జారీ చేసి ప్రశ్నించే అవకాశం ఉంది. ఫార్ములా ఈ రేస్‌కు సంబంధించి అప్పటి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు ఆదేశిస్తేనే విదేశీ సంస్థలకు నిధులు విడుదల చేశామని ఇప్పటికే అధికారులు వెల్లడించారు. మున్సిపల్ శాఖ ఉన్నతాధికారిగా పని చేసిన అర్వింద్ కుమార్ కేటీఆర్ నోటి మాట ద్వారా ఆదేశించడంతోనే నిధులు ఇచ్చామని అంటున్నారు. మున్సిపల్ శాఖ నుంచి నిధులు మాయమయ్యాయి. ఓ విదేశీ సంస్థకు వెళ్లాయి. ఆ విదేశీ సంస్థకు చెల్లించాల్సిన అవసరమే లేదు. చెల్లించేందుకు ఆర్థికశాఖ అనుమతి.. కేబినెట్ అనుమతి లేదు. పూర్తిగా ప్రజాధనం లెక్కల్లో లేకుండా పోయింది. ఇది పూర్తిగా నిధుల స్వాహా అనే అభిప్రాయం కల్పిస్తుంది. అందుకే ఏసీబీ కేసు నమోదు చేసింది. సీరియస్ నేరం కావడం పక్కాగా సాక్ష్యాలు ఉండటంతో విచారణకు పిలిచి అరెస్టులు చేసే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు.

# కామన్‌వెల్త్ గేమ్స్ అనగానే
# కాంగ్రెస్ కుంభకోణం గుర్తుకొస్తది

**హైదరాబాద్ :** కామన్‌వెల్త్ గేమ్స్ అనగానే కాంగ్రెస్ కుంభకోణం గుర్తుకు వస్తదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ కామన్‌వెల్త్ కుంభకోణంలో సురేశ్ కల్మాడి జైలుకు కూడా వెళ్లాడని కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.

ఈ మోటార్ కార్ల రేసింగ్ అనేది ఒక క్రీడ. కబడ్డీ, ఖోఖో, క్రికెట్ లాగే మోటార్ రేసింగ్ కూడా ప్రపంచ వ్యాప్తంగా ప్రజాదరణ పొందిన క్రీడ. ప్రపంచంలోనే తొలిసారిగా 1894లో కార్ల రేసింగ్ పారిస్‌లో జరిగింది. ఫార్ములా -1 మొదటి రేస్ 1946లో తొలిసారిగా ఇటలీ దేశంలో జరిగింది. ఎఫ్-1 రేస్‌ను ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా నిర్వహిరు. ఈ రేస్ నిర్వహణ కోసం ప్రపంచ దేశాలు పోటీ పడుతాయి. దేశానికి ఫార్ములా -1 రావాలనే కల ఈనాటిది కాదు. రేవంత్ రెడ్డి గురువు చంద్రబాబు నాయుడు 28 సెప్టెంబర్ 2003లో అప్పటి ఎఫ్-1 సీఈవోను కలిసి మా రంగారెడ్డి జిల్లాలో పెట్టాలని కోరారు. రేవంత్ రెడ్డి గురువు కన్నకలను మేం నెరవేర్చాం. శిష్యుడు మాత్రం నెరవేర్చలేదు. చంద్రబాబు దాంతో ఆగలేదు. ఎఫ్-1 కండక్ట్ చేయడానికి గోపన్‌పల్లి ప్రాంతంలో 1500 ఎకరాలు సేకరించాలని నిర్ణయించారు. చివరకు 400 ఎకరాలకు నోటిఫికేషన్ ఇచ్చి డెడికేటెడ్ ట్రాక్ నిర్మించాలని చంద్రబాబు నిర్ణయించారు. ఆ 400 ఎకరాల్లో కూడా రేవంత్ రెడ్డి భూమి ఉంది. భూసేకరణకు కూడా నోటిఫికేషన్ ఇచ్చారు. మేం భూములు ఇవ్వమని రైతులు కోర్టుకు వెళ్లారు. ఆ కేసు ఇంకా నడుస్తోందని కేటీఆర్ తెలిపారు. ఫార్ములా -1 రేష్ నిర్వహణ కోసం నాటి సీఎం చంద్రబాబు చొరవ తీసుకుని ఇటలీ వెళ్లి అడిగారు. 2004లో ఓడిపోయారు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకో లేదు. యూపీఏ హయాంలో యూపీలో మాయావతి ప్రభుత్వం.. జేపీ(జయప్రకాశ్ గ్రూప్) గ్రూప్ వాళ్లతో ప్రమోట్ చేసి.. ఎఫ్-1ను ఇండియాకు తీసుకొచ్చారు.



2011, 2012, 2013లో నోయిడాలో జేపీ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్మించిన ట్రాక్ పై ఎఫ్-1 రేస్ జరిగింది. 1984లో ఏషియన్ గేమ్స్, ఆ తర్వాత కామన్‌వెల్త్ గేమ్స్ మన దేశ రాజధాని ఢిల్లీలో జరిగాయి. కామన్ వెల్త్ గేమ్స్ కండక్ట్ చేయడానికి 70,608 కోట్లు ఖర్చు చేయడం జరిగింది నాటి కాంగ్రెస్ ప్రభుత్వం. ఇంకో ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే ఒరిజినల్ ఎస్టిమేట్ కంటే.. 114 రెట్లు ఎక్కువ. ఈ కామన్‌వెల్త్ కుంభకోణంలో సురేశ్ కల్మాడి జైలుకు వెళ్లాడని కేటీఆర్ గుర్తు చేశారు. 2013 అక్టోబర్ 24 నుంచి నవంబర్ 1 వరకు ఉమ్మడి ఏపీలో సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ఆఫ్రో ఏషియన్ గేమ్స్ నిర్వహించారు. దీని ఖర్చు 103 కోట్లు. ఒక క్రీడల కోసం ప్రభుత్వాలు ఖర్చు పెట్టడం పరిపాటి. కామన్ వెల్త్ గేమ్స్ యూపీఏ ప్రభుత్వం నిర్వహించింది. నోయిడాలో 2010-11లో ఎఫ్-1 ఖర్చు 1700 కోట్లు. తమిళనాడులో ఫార్ములా -4 రేస్ జరిగింది నాలుగు నెలల క్రితం. ఆ రాష్ట్ర ప్రభుత్వం 42 కోట్లు ఖర్చు పెట్టిందని కేటీఆర్ తెలిపారు.

**మెగా కృష్ణారెడ్డి ఇంటి మీదకు ఏసీబీని పంపే దమ్ముందా..? రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్**

మెగా కృష్ణారెడ్డి ఇంటి మీదకు ఏసీబీని పంపే దమ్ముందా..? అని సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. నీవు మొగోనివే అయితే మెగా కృష్ణారెడ్డి కంపెనీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. నన్ను ఏసీబీ విచారిస్తుందట.. ఏసీబీ ఫుల్ పామ్ తెలుసా రేవంత్ రెడ్డికి.. తెలుసనుకో.. బ్యాగులతో తిరిగినోడికి ఎందుకు తెల్వదు. ఏసీబీ అంటే యాంటీ కరప్షన్ బ్యూరో. ఏసీబీని కరప్షన్‌కు వ్యతిరేకంగా వాడాలి. ఇందులో కరప్షన్ ఏడుంది.. కాకరకాయ ఏడుంది. నేను అడుగుతున్నా చెప్పు. ఫార్ములా-ఈ రేస్ హైదరాబాద్‌లో ఉండాలని చెప్పి హెచ్ఎండీఏ నుంచి రూ. 55 కోట్లు పంపిన మాట వాస్తవం. దాంట్ల నేను ఏమైనా దాచుకుంటినా..? నాకు ఏమైనా వచ్చాయ..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ రేస్ రద్దుతో హైదరాబాద్‌కు నష్టం కలిగించినా రేవంత్ రెడ్డి మీద కేసు పెట్టాలి. హైదరాబాద్ ఇమేజ్ దెబ్బ తీశావు. రేవంత్ రెడ్డిది తెలివితక్కువ నిర్ణయం. ఆగస్టు 25న నరికిందు రేవంత్ రెడ్డి.. 2036 ఒలిపింక్స్‌ను ఇక్కడికి తెస్తడట. ఎంత ఖర్చు అయితదో తెలుసా ఈ సీఎంకు. 2016 ఒలిపింక్స్‌కు రియోలో లక్షా 8 వేల కోట్లు, 2020లో టోక్యోలో 2.9 లక్షల కోట్లు ఖర్చు పెట్టారు. ఈ ఖర్చు మన బడ్జెట్ అంత. ఈ మొగోడు ఒలింపిక్స్ హైదరాబాద్‌లో పెడుతాడట. 50 కోట్లకే ఒర్రుతుండు. నీ ముఖానికి అయితదా..? అంతర్జాతీయ ప్రమాణాతో ఈవెంట్ నిర్వహించడం తెలుసా..? అని కేటీఆర్ నిప్పులు చెరిగారు. చేతనైతే మెగా ఇంజినీరింగ్ మీద పెట్టు కేసు. సుంకిశాలలో గోడ కూలిపోయింది 80 కోట్లు నష్టం వచ్చింది. దమ్ముంటే బ్లాక్ లిస్ట్‌లో పెట్టి మెగా కృష్ణారెడ్డి ఇంటి మీదికి ఏసీబీని పంపు.. ఈస్టిండియా కంపెనీ అన్నావు కదా..? నీవు మొగోనివి అయితే పంపు.. ఏసీబీ కేసు పెట్టు. అవసరమైతే 50 లక్షలతో దొరికిన బ్యాగ్‌మెన్ మీద ఏసీబీ కేసు పెట్టాలి. ఇవాళ రేస్ రద్దు చేయడం కారణంగా జరిగిన నష్టానికి రేవంత్ మీద ఏసీబీ కేసు పెట్టాలి. మేం బ్రాండ్ ఇమేజ్ క్రియేట్ చేశాం. మీరు బ్యాడ్ ఇమేజే క్రియేట్ చేస్తున్నాం. హైడ్రా పేరుతో విశ్వనగరం విజన్‌ను దెబ్బతీస్తున్నావ్ అని రేవంత్ రెడ్డిపై కేటీఆర్ మండిపడ్డారు.

# మాకు న్యాయం జరిగేంత వరకు పోరాడతం



హైదరాబాద్,నవంబర్07(వుదయం ప్రతినిధి): ఎన్నో సంవత్సరాలుగా తాము ఫుట్ పాత్ పై ఫుడ్ వ్యాపారం నిర్వహిస్తున్నామని స్ట్రీట్ వండర్స్ తెలిపారు. ఈరోజు మాదాపూర్ లోని నాలెడ్జి సిటీ లో ఫుట్ పాత్ చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహిస్తున్న వండర్స్ పై జిహెచ్ఎంసి మరియు ట్రాఫిక్ పోలీసులు కనీసం ముందస్తు సమాచార ఇవ్వకుండా వారి జీవనోపాధి అయినబండ్లనిమరి యు తాత్కాలిక షాపులను తొలగించారని వారు వాపోయారు. గత ఎన్నో సంవత్సరాలుగా స్థానిక శాసన సభ్యుని సహకారం తో ఎవరికి యిబ్బంది కలిగించకుండా వ్యాపారాన్ని నిర్వహిస్తున్నామని అందరికీ తక్కువదరకు ఆహారాన్ని అందిస్తున్నామని వారన్నారు. కొందరు స్వార్థపరులు అధికారపార్టీ నాయకులతో చేతులుకలిపి మా జీవనోపాధి తొలగించారని వాళు ్ర వాపోయారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుమారి ఆంటీ కి అనుమతులు ఇచ్చి మా పొట్టను కొట్టడం అన్యాయమని వారన్నారు. అందరికీ సమన్యాయం చేయవలసిన అధికారులు కొందరికి అండగా ఉంటూ మమ్మల్ని రోడ్డు కీచటం అన్యాయమని, దీనిపై మేమందరం న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న ఈ ధమనకాండను ప్రతి ఒక్కరూ ఖండించాలని, మాకు అందరూ అండగా నిలవాలని వారు కోరుతున్నారు. మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ మాయి పోరాటానికి మద్దతు తెలియపరచాలని వారు వేడుకొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయుడుతో పాటు సుమారు 25 కుటుంబాల వారు ధర్నాలో పాల్గొన్నారు.

# ద్రవ్యోల్బణం పెరగొచ్చు ఆర్‌బిఐ ఆందోళన

ముంబయి : దేశంలో ద్రవ్యోల్బణం పెరుగనుందని రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బిఐ) అంచనా వేసింది. సెప్టెంబర్‌లో 5.5 శాతంగాయ నమోదు కాగా.. అక్టోబర్‌లో ఇది మరింత పెరిగే అవకాశం ఉందని ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ హెచ్చరించారు. బుధవారం శక్తికాంత మీడియాతో మాట్లాడుతూ.. అంతర్జాతీయంగా ఆర్థిక పరిస్థితుల్లో అస్థిరత నెలకొందన్నారు. కానీ భారత ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ఉంచేందుకు ఆర్‌బిఐ సమర్థంగా పని చేస్తోందన్నారు. ప్రస్తుత కాలంలో ప్రధానంగా రెండు అంశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తున్నాయన్నారు. ఒకటి అమెరికా ఎన్నికల ఫలితాలు కాగా.. మరొకటి ఆర్థిక విధాన మద్దతుకు సంబంధించి చైనా నుంచి ప్రకటనలు వెలువడడటమన్నారు. ఆర్థిక వృద్ధికి ప్రతికూల అంశాల కంటే సానుకూల అంశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. భారత వృద్ధి రేటును పెంచడానికి ఆర్‌బిఐ 70కి పైగా అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తుందన్నారు.

## నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి



అందరికి విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అందుకే డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచినట్లు చెప్పారు. 21వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించినట్లు తెలిపారు. 11,062 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసినట్లు తెలిపారు. దేశ నిర్మాణంలో విద్యార్థులు కూడా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం అందించేందుకు ప్రభుత్వం కుల గణన సర్వే నిర్వహిస్తోందిన్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. ప్రతీ నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. వచ్చే అకడమిక్ ఇయర్ లోగా నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిపారు. చదువుతో పాటు స్కిల్ ఉంటేనే ఉద్యోగాలు లభిస్తాయిని, అందుకే విద్యార్థి, నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. టాటా ఇనిస్టిట్యూట్ సహకారంతో ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తున్నట్లు వెల్లడించారు. సాంకేతిక నైపుణ్యంతో పాటు ప్రభుత్వం ఉద్యోగ భద్రతను కల్పిస్తోందన్నారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని, విద్యార్థులు క్రీడల్లో రాణించాలని వారిని ప్రోత్సహించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. వచ్చే ఒలింపిక్స్ లక్ష్యంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు.

## ముందుకు సాగని రైతు కమిషన్

-మొదటిపేజీ తరువాయి

మాత్రం అశ్రద్ధ వహిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. బీఆర్‌కే భవన్‌లో కమిషన్ ఏర్పాటైంది కానీ, సరైన సౌకర్యాలు చేయలేదు సంబంధిత అధికారులు. కనీస వసతులు, కావాల్సిన సిబ్బంది లేక ఇబ్బంది పడుతున్నారు సభ్యులు. చాంబర్లు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు ఉన్నతాధికారులు. ప్రస్తుతం చైర్మన్ కోదండ రెడ్డి కోసం ఒక చాంబర్ ఏర్పాటు చేయగా, అందులో వాష్ రూమ్‌కు డోర్ లేని పరిస్థితి. ఎవరైనా వాష్ రూమ్‌కు వెళ్లాలంటే మరొకరు దగ్గరలో నిలబడాల్సి వస్తోంది. వచ్చిన గెస్టులు దీన్ని చూసి షాక్ అవుతున్నారు. ఈ పరిస్థితి చూసి బాధ్యతలు తీసుకోడానికి సభ్యులు వెనుకాడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యానికి ఇది నిలువెత్తు నిదర్శనంగా కనిపిస్తోంది. బాధ్యతలు తీసుకున్న మెంబర్లు చాంబర్ల లేక చైర్మన్ రూమ్‌లోనే కూర్చుంటున్నారు. ఈ పరిస్థితి చూసి రాములు నాయక్ తనకు పదవి వద్దని అంటున్నట్టు సమాచారం. ఓవరాల్‌గా ఈ వ్యవహారం చూశాక, అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతుల కోసం ఈ కమిషన్‌ను ఏర్పాటు చేస్తే, కిందిస్థాయిలో అధికారులు నీరుగార్చే ప్రయత్నంలో ఉన్నారు. దీనికి ప్రధాన కారణం, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్‌కు కమిషన్ ఏర్పాటు ఇష్టం లేదనే టాక్ వినిపిస్తోంది. అందుకే, కమిషన్ ఏర్పాటుపై జీవో ఇవ్వడానికి ఈయన మొదట్లో ఆలస్యం చేశారని అనుకుంటున్నారు. రాష్ట్రంలో రైతు సంక్షేమం కోసం నిర్ణయాలు తీసుకుంటోంది ప్రజా ప్రభుత్వం. ఇప్పటికే రుణమాఫీ అందించి ఎన్నో కుటుంబాల్లో సంతోషాన్ని నింపింది. వారి అవసరాల కోసం ప్రభుత్వం రైతు కమిషన్‌ను ఏర్పాటు చేస్తే, అధికారులు మాత్రం దీన్ని పెత్తనంగా భావిస్తున్నారు. అందుకే, పైసా కూడా వ్యవసాయ శాఖ నుండి విడుదల కావడం లేదట. దీంతో సొంత ఖర్చులతోనే టీ, స్నాక్స్ తెప్పించుకుంటున్నారు సభ్యులు. అంతేకాదు, సొంత మనుషులనే సిబ్బందిగా వాడుకుంటున్నారట. ఈ ఇష్యూని సీఎం దృష్టికి తీసుకెళ్లే పనిలో కమిషన్ చైర్మన్, సభ్యులు ఉన్నారురైతు కమిషన్‌పై సీఎం రేంత్ రెడ్డి ఎంతో కృతనిశ్చయంతో ఉన్నారు. రైతుల పట్ల ఉన్న ప్రేమతో దీన్ని ఏర్పాటు చేశారు. కానీ, వ్యవసాయ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా వారిలో మార్పు రావాలి. నిజానిజాలు బయటకు తీసుకొస్తుంది. జాగ్రత్త ఆఫీసర్స్.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020, Telangana. **Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: APTEL/2000/00272. E-mail :** voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.